Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com
Journalism first!

సంపుటి: 56 • సంచిక: 126 • బుధవారం 16 ఆగస్టు 2017 • హైదరాబాద్ ✻ పేజీలు: 10+4 • వెల: 5.00

Published from: Hyderabad | Vijayawada | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Kurnool | Suryapet | Anantapur | Nellore | Nizamabad

సంబరాల జీవితం సౌభాగ్యాల సౌరభం
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
36
Enriching • Quality of Life
కపిల్ చిట్స్
కపిల్ చిట్స్
మీ కలలకు సాకారం





"18 లక్షల మంది ఆదాయానికి మించి ఆస్తులు కలిగివున్న వారిపై నిఘా పెట్టాం. వారి కంటికి కునుకు లేకుండా ఉంది. పెద్దనోట్ల రద్దుతో లెక్కలు చూపని 3లక్షల కోట్ల సొమ్ము బ్యాంకులకు చేరింది. ఈ మొత్తం ప్రక్రియతో పన్ను కట్టేవారి సంఖ్య రెట్టింపైంది. కిందటేడాది 22 లక్షలుంటే ఇప్పుడది 56 లక్షలు అయింది. 1.75 లక్షల షెల్ కంపెనీలు మూతపడ్డాయి. గోరఖ్‌పూర్ దుర్ఘటన ప్రకృతి విపత్తు లాంటిదే."

- ఎర్రకోట బురుజుల నుంచి ప్రధాని మోడీ

మోడీ ప్రసంగ పూర్తి పాఠం - 4లో

పంపకాలెలా?!

ఇద్దరు ముఖ్యమంత్రులతో సుదీర్ఘ భేటీ

9, 10 షెడ్యూళ్ల సమస్యలపై గవర్నర్ చర్చ

హైదరాబాద్‌లోని ఆస్తులు జనాభా నిష్పత్తిన పంచాల్సిందేనన్న చంద్రబాబు

తెలంగాణ భూభాగంలో ఉన్న ఆస్తులన్నీ మావేనన్న సీఎం కేసీఆర్

కేంద్రంతో మాట్లాడతానన్న నరసింహన్ • మంత్రుల కమిటీ పునరుద్దరణకు నిర్ణయం

• వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని సీఎంలకు గవర్నర్ భరోసా



మంగళవారం రాజ్‌భవన్‌లో ఎట్ హోం కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కెసీఆర్, చంద్రబాబు, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ: విభజన చట్టంలోని సమస్యలు పరిష్కారం కాకపోవడంతో రెండు రాష్ట్రాలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవలసిన పరిస్థితి ఏర్పడిందని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, చంద్రబాబులు ఆవేదన వ్యక్తంచేశారు. సమస్యలు పరిష్కరించవలసిన కేంద్ర ప్రభుత్వం ఈ బాధ్యతను రాష్ట్రాలపై నెట్టివేయడం ఎంతవరకు సమంజసమని సీఎంలిద్దరూ ప్రశ్నించినట్టు సమాచారం. రాజ్‌భవన్‌లో మంగళవారం గవర్నర్ ఏర్పాటు చేసిన తేనీటి విందు కార్యక్రమానికి హాజరైన ఇద్దరు ముఖ్యమంత్రులను తన కార్యాలయంలోకి తీసుకువెళ్ళిన గవర్నర్ వారితో రెండు గంటలకుపైగా మాట్లాడారు. ముఖ్యంగా విభజన చట్టంలోని 9, 10 షెడ్యూళ్ళలోని అంశాలు, విద్యుత్ బకాయిలు, నీటి పంపకాలు, ఉద్యోగుల విభజన, బదిలీలు, సచివాలయ అప్పగింత తదితర అంశాలపై చర్చించినట్టు సమాచారం. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా హైదరాబాద్‌లో ఉన్న ఆస్తులు, నిధులు 58, 42 నిష్పత్తిలో పంచవలసిందేనని అలా కాకుండా ఏ రాష్ట్రంలో ఉన్న ఆస్తులు ఆ రాష్ట్రానికే చెందాలని ఎవరైనా ఒత్తిడి తెస్తే అందుకు ఆస్తులను ఇవ్వడానికి తాము ఎంతమాత్రం సిద్ధంగా లేమని చంద్రబాబు తెగేసి చెప్పినట్టు సమాచారం. కట్టుబట్టలతో విజయవాడకు వెళ్ళామని, రూ.17వేల కోట్ల లోటు బడ్జెట్‌తో రాష్ట్రాన్ని నెట్టుకొస్తున్నామని ఈ సమయంలో ఆస్తుల పంపకంలో కూడా తమకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని చెప్పారు. ఈ అంశంపై కేసీఆర్ స్పందిస్తూ, కేంద్ర హోంమంత్రి శాఖ ఆస్తుల పంపకంపై ఇప్పటికే ఒక స్పష్టత ఇచ్చిందని తెలంగాణ భూభాగంలో ఉన్న ఆస్తులు తమకే చెందుతాయని అయితే నిధుల విషయంలో జనాభా నిష్పత్తి ప్రకారం 42 శాతం తెలంగాణాకు, 58శాతం ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వడానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదని చెప్పినట్టు తెలుస్తోంది. రెండు రాష్ట్రాల మధ్యనున్న సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్ళి వెనువెంటనే వీటి పరిష్కారానికి చొరవ చూపాలని సీఎంలిద్దరూ గవర్నర్‌ను కోరారు. ఇప్పటికే హైదరాబాద్ నుంచి ➩ 3వ పేజీలో...

అక్టోబర్ నుంచి రంగంలోకి

•రెండు తెలుగు రాష్ట్రాల్లో జనసేన సత్తా చూపిస్తా • రాజ్‌భవన్‌లో తేనీటి విందుకు హాజరైన పవన్ • ప్రత్యేకంగా ఆహ్వానించిన గవర్నర్ నరసింహన్

• విందు తర్వాత అరగంట పాటు పవన్‌తో గవర్నర్ ప్రత్యేక భేటీ 3





కూలిన బతుకులు నిలబెట్టడమే లక్ష్యం

ఉద్యమకాలం నాటి హామీలన్నీ నిలబెట్టుకుంటున్నా

లక్ష్యసాధన దిశగా పురోగమిస్తున్న రాష్ట్రం

21.7 శాతం ఆర్థిక వృద్ధి రేటుతో దేశంలో అగ్రస్థానం

తెలంగాణ పథకాలపై దేశ, విదేశాల్లో చర్చ

పొరుగు రాష్ట్రాలకు ఆదర్శంగా సంక్షేమ కార్యక్రమాలు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి కేసీఆర్

త్వరలో మరో 84 వేల పోస్టుల భర్తీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఉమ్మడి రాష్ట్రంలో దశాబ్దాల తరబడి దోపిడీకి గురైన తెలంగాణ ప్రాంతాన్ని దశల వారీగా పునరుద్ధరించే ప్రయత్నం కొనసాగుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అన్నారు. ఆర్థికంగా, సామాజికంగా, వృత్తిపరంగా నిరాదరణకు గురైన అనేక కులాలు, మతాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందడుగు వేస్తోందన్నారు. అణగారిన వర్గాలు, కడుపేద కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుని తెలంగాణ పౌరులంటే తలెత్తుకుని జీవించేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక తమ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక ప్రతిష్టాత్మక పథకాలు దేశానికే ఆదర్శవంతంగా మారాయని, అది తెలంగాణ సాధించన ఘనతేనని కేసీఆర్ స్పష్టంచేశారు.

71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చారిత్రాత్మకమైన గోల్కొండకోట వేదికగా జరుపుకున్న ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఉద్యమ నేతగా క్షేత్రస్థాయిలో అన్ని వర్గాల ప్రజల స్థితిగతులపై తనకు పూర్తిస్థాయి అవగాహన ఉందని, ఆయా వర్గాల సంక్షేమంపట్ల నిబద్ధతతో, చిత్తశుద్ధితో పరిపాలనను కొనసాగిస్తున్నానని అన్నారు. నాడు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని దశల వారీగా నెరవేర్చే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితోనే అహింసామార్గంలో, శాంతియుత పంథాలో పోరాడి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు.


ఏ ఆశయ సాఫల్యం కోసం స్వరాష్ట్రాన్ని కోరుకున్నామో ఆ లక్ష్యసాధన దిశగా పురోగమిస్తున్నందుకు తనకెంతో సంతోషంగా ఉందన్నారు. తెలంగాణ చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలిచిన గోల్కొండకోటలో మూడేళ్ళ క్రితం మొదటిసారి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి రాష్ట్ర ప్రగతికి పథనిర్దేశాన్ని ఎంచుకున్నామని, ఆ మేరకు ప్రణాళికలు రచించుకుని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. దేశంలో గతంలో ఏర్పడిన కొత్త రాష్ట్రాలేవీ అంత తొందరగా కోలుకోలేదని, కానీ మన రాష్ట్రం అనతికాలంలోనే సమర్ధవంతంగా సమస్యలన్నీ ➩ 3వ పేజీలో...



అమెరికా ఐటీ తరహాలో కేసీఆర్ వర్క్ ఫ్రం హోం

ప్రగతి భవనే సీఎంవో

హైదరాబాద్, ఆంధ్రప్రభ : 'వర్క్ ఫ్రం హోం' ఈ పదం అమెరికాలో ఐటి రంగ నిపుణులు ఆచరిస్తుంటారు. గత దశాబ్ద కాలంగా ఇంటి వద్దనుంచే ఆఫీస్ కార్యక్రమాలు చేసే ప్రక్రియ ఐటి రంగంలో అమలు చేస్తున్నారు. ప్రతి కంపెనీ తమ సిబ్బందికి వారంలో ఒకరోజు ఇంటినుంచి ఆన్‌లైన్ ద్వారా పనిచేసేందుకు వెసులుబాటు కల్పిస్తోంది. ఇటీవల కాలంలో ఇది మరింత విస్తరించి అసలు ఆఫీసులకు వెళ్ళకుండానే పూర్తిగా ఇంటినుంచే పనిచేసే నూతన ప్రక్రియకు అమెరికా కంపెనీలు శ్రీకారం చుట్టాయి. ఐటితో పాటు మ్యానుఫ్యాక్చరింగ్, మార్కెటింగ్, సర్వీస్ రంగంలో కూడా ఐటి విభాగం నిపుణులు ఇంటినుంచే పని చేసుకునే అవకాశం ఏర్పడింది. అంతేకాదు, అమెరికాలో ఒక నగరంలో కంపెనీ ఉంటే మరో నగరంలో నివాసం ఉంటూ సంబంధిత కార్యాలయంలో ఉద్యోగిగా వర్క్ ఫ్రం హోం చేసే సులువైన సదుపాయం అమెరికా కంపెనీలు కల్పిస్తున్నాయి. కానీ మన దేశంలో ఇలాంటి సదుపాయం ఇంతవరకు ఏ కంపెనీ కూడా అనుమతించడం లేదు. ఇదిలా ఉండగా, తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు మాత్రం వర్క్ ఫ్రం హోం ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా చేయని రీతిలో కొత్త పుంతలకు మార్గంవేస్తూ తనదైన ముద్ర వేసుకోవడంలో ఆయన చరిత్ర సృష్టిస్తున్నారు. ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టడంలో అంకితభావంతో పనిచేస్తున్న కేసీఆర్ ఇప్పుడు వర్క్ ఫ్రం హోం ఒరవడితో మరో అడుగు ముందుకు వేస్తున్నారు. రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయానికి రాకుండానే తన అధికారిక నివాసం నుంచే ప్రభుత్వ పాలన సాగించడం ➩ 7వ పేజీలో...




2345 పోస్టులకు టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్

అటవీ శాఖలో 2014 పోస్టులు • వైద్య ఆరోగ్య శాఖలో 331

ఉద్యోగాలకు నోటిఫికేషన్ • ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య శాఖతోపాటు అటవీ శాఖలో ఉద్యోగాల భర్తీ కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్సీ) నోటిఫికేషన్ జారీ చేసింది. వైద్య, ఆరోగ్య శాఖలో 331 పోస్టులకు, అటవీ శాఖలో 2014 పోస్టుల భర్తీకి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నోటిఫికేషన్‌ను జారీ చేసింది. అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కమిషన్ తెలిపింది. పూర్తి వివరాలు కమిషన్ ➩ 5వ పేజీలో...

బోరుబావిలో బాలుడు



గుంటూరు జిల్లాలో దారుణం

యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు 7లో

న్యాక్ గుర్తింపునకు ఎన్ని పరీక్షలో...

ఏ గ్రేడ్ కోసం తపన • హాస్టల్స్, కాలేజ్ భవనాలకు రంగులు వేయిస్తున్న ఓయూ అధికారులు • 17 నుంచి 19 వరకు న్యాక్ అధికారుల సందర్శన 5

ప్రకృతి వికృతమైనా... జెండావందనం ఆగదు!



వరదలతో కకావికలమైన అసోంలోని ఓ లోయర్ ప్రైమరీ స్కూల్‌లో టీచర్లు, ఇద్దరు విద్యార్థులతో కలిసి జాతీయ జెండా ఆవిష్కరించిన దృశ్యం 9లో

ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: బహుళ నవమి, మ. 1.30 వరకు, అనంతరం దశమి; నక్షత్రం: రోహిణి రా. 12.09 వరకు, అనంతరం మృగశిర; అమృతకాలం: రా. 9.10 నుండి 10.45 వరకు; వర్జ్యం: సా. 4.43 నుండి 6.11 వరకు; తె. 5.21 నుండి (మరుసటి ఉదయం) 6.51 వరకు; దుర్ముహూర్తం: ఉ. 11.42 నుండి 12.33 వరకు; రాహుకాలం: మ. 12.00 నుండి 1.30 వరకు; యమగండం: ఉ. 7.30 నుండి 9.00 వరకు

ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

• తెరాస భవన్‌లో...



రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ఓర్వలేక విపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయి . ప్రభుత్వం ప్రాజెక్టులు కడుతుంటే అడ్డుపడుతూ ఓట్లరాజకీయాలు చేస్తున్నారు. ప్రజలంతా ప్రభుత్వం వెంటే ఉన్నారు. ఎందరో త్యాగాలతో దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ముఖ్యమంత్రి కేసీఆర్ పేదలకోసం అనేకసంక్షేమ కార్యాక్రమాలు అమలు చేస్తున్నారు.విద్యుత్ కోతల స్థాయినుంచి ఇతర రాష్ట్రాలకు విద్యుత్ అమ్ముకునే స్థాయికి వచ్చాం.

-మంత్రులు నాయిని, మహమూద్ అలీ

• గాంధీ భవన్‌లో...



దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడమే గాక ప్రపంచంలో అగ్రదేశంగా నిలిపిన ఘనత కాంగ్రెస్ పార్టీదే. రాజ్యాంగ స్ఫూర్తిగా రాష్ట్ర సర్కార్ విఘాతం కలిగిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్నాయి.దళితులు, గిరిజనులు, బీసీలు, మైనారిటీలంటే సీఎం కేసీఆర్‌కు చులకన భావమని ఆ వర్గాలపై దాడులు జరుగుతున్న పట్టించుకోవడం లేదు. హరితవిప్లవం, పారిశ్రామిక విప్లవంతో ప్రపంచంలోనే దేశాన్ని బలమైన దేశంగా తీర్చిదిద్దడం వెనుక కాంగ్రెస్ ప్రభుత్వాల కృషి ఉంది.

-ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ చీఫ్

• బీజేపీ కార్యాలయంలో ...



తెలంగాణ రాష్ట్రంలో దళితులు, ప్రజాస్వామిక వాదులపై దాడులు పెరుగుతున్నాయి. నవ భారత్ నిర్మాణంకోసం దేశంలోని ప్రతి వ్యక్తి కంకణబద్ధులు కావాల్సిన అవసరం ఏర్పడింది. ఎంఐఎం పార్టీ సంతోషం కోసమే తెలంగాణ విమోచన దినోత్సవమైన సెప్టెంబర్ 17ను సీఎం చంద్రశేఖర్‌రావు పక్కన పెట్టారు.ప్రధాన మంత్రి నరేంద్రమోడి దేశంలో అవినీతిరహిత పాలన కోసం పని చేస్తున్నారు.

- కేంద్రమంత్రి దత్తాత్రేయ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

• ఎన్టీఆర్ భవన్‌లో..



70 సంవత్సరాల స్వాతంత్ర్య భారతదేశంలో వివిధ పార్టీలు గెలిచినా పేదరిక నిర్మూలన అనుకున్నంతగా జరగలేదు. హైదరాబాద్ స్టేట్‌ను నిజాం భారతదేశంలో విలీనం చేయనంటే పోలీసుచర్య ద్వారా విలీనం చేయబడింది.బడుగు, బలహీన వర్గాలకు, యువకులకు, మహిళలకు పాలకులుగా అవకాశం వచ్చిందంటే అది ఎన్టీఆర్, చంద్రబాబునాయుడు వల్లే సాధ్యమైంది.పనికిరాను వారు పాలకులు కావడం వల్ల రాష్ట్రంలో అనేక సంఘటనలు జరుగుతున్నాయి.

-ఎల్. రమణ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు

• సీపీఐ కార్యాలయంలో ...



భూమి కోసం భుక్తి కోసం, మాతృదేశ విముక్తి కోసం సాగిన పోరాటంలో సీపీఐ పార్టీ పాత్ర కీలకం. రాష్ట్రంలో ఇసుక మాఫియా రాజ్యమేలుతోంది. అవినీతి బందు ప్రీతి తొలిగినప్పుడు సామాజిక న్యాయం సాధ్యం అవుతుంది. భూ బకాసురుల చేతుల్లో తెలంగాణ విలవిలలాడుతోంది

- చాడా వెంకట్‌రెడ్డి ,సీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: భారత 71వ స్వాతంత్ర్య వేడుకలు రాష్ట్రమంతటా మంగళవారం నాడు ఎంతో ఘనంగా జరిగాయి. జాతీయ పతాకాల ఆవిష్కరణల కార్యక్రమాల్లో ప్రజలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలపైన,టీఆర్ఎస్, కాంగ్రెస్, వైఎస్ఆర్‌కాంగ్రెస్, బీజేపీ, తెలుగుదేశం సీపీఐ, సీపీఎం తదితర రాజకీయ పార్టీల కార్యాలయాల ఆవరణల్లో త్రివర్ణ పతాకాలను ఎగుర వేశారు. జాతీయగీతాలాపనల అనంతరం మిఠాయిలు పంచిపెట్టుకుంటూ ఒకరికొకరు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాం క్షలు తెలుపుకున్నారు.వివిధ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమాల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

అసెంబ్లీ, మండలిలో... తెలంగాణ అసెంబ్లీ, శాసన మండలిలో స్వాతంత్ర్య దినోవత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అసెంబ్లీ ఆవరణలో శాసనసభాపతి మధుసుదనాచారి జాతీయ జెండాను ఆవిష్కరించారు. శాసన మండలి ఆవరణలో డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ జాతీయ జెండాను ఎగురవేశారు. అంతకు ముందు అసెంబ్లీ ఆవరణలో ఉన్న మహాత్మగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలవూలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్పీకర్ మధుసుదనాచారి మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందుకు సాగుతోందని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కార్యదర్శి రాజాసదారామ్, అసెంబ్లీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీ కార్యాలయంలో

నేషనల్ థర్మల్ పవర్ కార్పోరేషన్ (ఎన్టీపీసీ) కార్యాలయంలో జెండా పండుగ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. జనరల్ మేనేజర్ ఆనంద్ ఖలాట్కర్, రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (సౌత్) వేర్వేరుగా తమ కార్యాలయాల్లో పతాకావిష్కరణలు చేశారు. ఈ సందర్భంగా సంస్థ చేపడుతున్న విద్యుత్, సోలార్ ప్రాజెక్టులను గూర్చి వారు వివరించారు. నవరత్నాల్లో ఒకటైన ఎన్టీపీసీ దేశానికి అందిస్తున్న సేవలను గూర్చి చెప్పారు. ఈ కార్యక్రమాల్లో వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు పీకే జైన్, ఐజే రెడ్డి, ఏజీఎం డాక్టర్ టీ ప్రతాప్ (హెచ్‌ఆర్)



అసెంబ్లీ ఆవరణలో జెండా ఎగురవేస్తున్న స్పీకర్ మధుసూదనాచారి

,వీఆర్‌టీ ఎల్లర్ట్ చూట్ భూంపాగ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.125కే విద్యుత్ కనెక్షన్ : రఘుమారెడ్డి

తెలంగాణ రాష్ట్రం పరిధి లోని దారిద్య్రరేఖకు దిగువన ఉన్నకుటుంబాలకు రూ.125 కే విద్యుత్ కనెక్షన్ ఇచ్చుతో పాటు అందించనున్నట్లు దక్షి ణ తెలంగాణ విద్యుత్ పంపి ణీ సంస్థ చైర్మన్ జి.రఘుమా రెడ్డి వెల్లడించారు.తన కార్యా లయం ఆవ రణంలో 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడు కలను ఘనంగా నిర్వహిం చారు. జాతీయ పతాక ఆవి ష్కరణ అనంతరం రఘు మారెడ్డి మాట్లాడుతూ వి ని యోగదారులకు సంతృప్తిక రమైన సేవలు అందించటమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నా రు. గత నెల 7న పీక్ డిమాం డ్‌లో 9397 మెగావాట్ల విద్యు త్ అందచేశామన్నారు. వ్యవ సాయానికి 24గంటల విద్యుత్ ద్వారా 10500మెగా వాట్ల విద్యుత్ అందచేసేందుకు కూడా సిద్దంగా ఉన్నట్టు రఘువమారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు టి.శ్రీనివాస్, జె.శ్రీనివాస రెడ్డి,కమాలుద్దీన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

కొత్త వెలుగుల్లో తెలంగాణ: సీఎండీ ప్రభాకర్ రావు

విద్యుత్ సౌధలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఎండీ ప్రభాకర్ రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఎందరో మహనీయుల పోరాటాలతో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టి, అన్నిస్థాయిల్లో ఉద్యోగుల సమిష్టి కృషితో నేడు తెలంగాణ రాష్ట్రమంతటా కొత్త వెలుగులు ప్రసరిస్తున్నాయన్నారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి విద్యుత్ రంగం వెన్నెముకలా నిలుస్తోందన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 36వేలకోట్ల వ్యయంతో 5880 మెగావాట్ల అదనపు విద్యుదుత్పత్తి చేసుకోగలుగుతున్నామన్నారు. రాష్ట్రం 13095 మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్ధ్యాన్ని చేరుకుందన్నారు. మరో 15145 మెగావాట్ల సామర్థ్యం మేరకు ప్రాజెక్టుల పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ ఇచ్చే స్థాయికి చేరుకున్నామన్నారు. 2018-19నాటికి విద్యుత్ రంగంలో మిగులు రాష్ట్రంగా నిలుస్తామని సీఎండీ ప్రభాకర్‌రావు పేర్కొన్నారు.తెలంగాణ విద్యుత్ శక్తి పేరుతో కొత్త యాప్‌ను రూపొందించినట్లు టీఎస్ ట్రాన్స్‌కో డైరెక్టర్ నరసింగరావు వెల్లడించారు. ఈ యాప్ ద్వారా దేశంలో విద్యుత్ పరిస్థితిని ఎప్పటికపుడు తెలుసుకో వచ్చని నరసింగరావు పేర్కొన్నారు.



విద్యుత్‌సౌధలో జెండా ఎగురవేస్తున్న ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

మహనీయుల ఆశయ సాధనకు పాటుపడదాం

• తెలంగాణ భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అరవింద్ కుమార్

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : ఢిల్లీలోని తెలంగాణా భవన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించు కుంటూ వారి ఆశయ సాధనలో భాగస్వాములు కావాలని తెలంగాణా భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అరవింద్ కుమార్ పిలుపు నిచ్చారు. శబరి బ్లాక్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మువ్వన్నెల జెండాను ఆయన ఎగుర వేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భవన్ రెసిడెంట్ కమిషనర్ వేదాంతం గిరి, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి కె.ఎన్ సహాని, తెలంగాణా భవన్‌లోని వివిధ విభాగాల



అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. మదర్సా విద్యార్థులు ఆలపించిన జాతీయ గీతం అందరినీ ఆకట్టుకుంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుద్దీప అలంకరణతో తెలంగాణా భవన్ కాంతులీనింది.

ఆంధ్రప్రదేశ్ భవన్‌లో స్వాతంత్ర్య వేడుకలు

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. దేశ సమగ్రత, సమైక్యతలకు ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఆంధ్ర భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ పిలుపునిచ్చారు. ఏపీ సమగ్ర అభివృద్ధికి, ఆదర్శ ఆంధ్ర ప్రదేశ్ సాధనకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. త్రివర్ణ పతాక రూపకర్త పింగళి వెంకయ్య ఆంధ్రకు చెందిన వాడు కావడం ఎంతో గర్వకారణమని అన్నారు. భవన్ ప్రాంగణంలో జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం ప్రవీణ్ ప్రకాష్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలందించిన ప్రభుత్వోద్యోగులు, పోలీసులు, ఉపాధ్యాయులు, చదువుల్లో ప్రతిభా పాటవాలు చూపుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఆయన ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ డాక్టర్ రజత్ భార్గవ్, అదనపు రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ అర్జ శ్రీకాంత్, డిప్యూటీ కమిషనర్ సూర్యనారాయణ, ఏపీఐసీ ప్రత్యేక అధికారి కంచర్ల జయరావు, పరిపాలనాధికారి లింగరాజు, డిప్యూటీ ఇంజినీర్ రవి నాయక్, భవన్ ఉద్యోగులు, విద్యార్థులు, ఢిల్లీలోని వివిధ తెలుగు సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కన్నుల పండువగా జెండా పండుగ

• నేషనల్ పోలీసు అకాడమీలో...



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సర్దార్ వల్లభ్ భాయి పటేల్ నేషనల్ పోలీసు అకాడమిలో 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అకాడమి డైరెక్టర్ డి.ఆర్.డోలే బర్మన్ మువ్వన్నెల జాతీయపతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆమె మాట్లాడుతూ.. సమాజాన్ని పట్టి పీడిస్తున్న సామాజిక, ఆర్థిక రుగ్మతలైన పేదరికం, అవినీతి వంటివాటిని నిర్మూలించవలసిన అవసరాన్ని, దేశం ఎదుర్కొంటున్న అంతర్గత భద్రతా సమస్యలపై తిరుగులేని పోరాటాన్ని చేయవలసిన అవసరాన్ని నొక్కి వక్కాణించారు. రెండో దశ (ఫేజ్-2 క్రింద) శిక్షణ పొందుతున్న 66 ఆర్.ఆర్.బ్యాచ్‌కు చెందిన 137 మంది ఐపీఎస్, 68 ఆర్.ఆర్. బ్యాచ్‌కు చెందిన 118 ఐపీఎస్, ప్రాథమిక శిక్షణ పొందుతున్న భూటాన్, నేపాల్, మాల్దీవులకు చెందిన నలుగురిని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. భారతదేశపు ఐక్యత, సమగ్రతను కాపాడటానికి అన్ని సంస్థలను, వ్యక్తులను సంఘటితపరిచి భారతదేశము యొక్క ఖ్యాతిని ఎప్పుడు లేనంత ఉన్నతస్థాయికి తీసుకువెళతామని వారు చేసిన ప్రతిజ్ఞను వారు సర్వదా గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రొబెషనర్స్(శిక్షణలో ఉన్నవారు) చేసిన మార్చ్‌ఫాస్ట్‌ను ఎస్.వి.సి.ఎస్.పిఏ కేంద్రీయ విద్యాలయంలోని విద్యార్థులతో పాటు అకాడమీ అధ్యాపకులు, సిబ్బంది, సామాన్య ప్రజలు వారి కుటుంబసభ్యులు వీక్షించారు.

జైళ్ళ శాఖ కార్యాలయంలో...



హైదరాబాద్,ఆంధ్రప్రభ: చంచల్ గూడలో రాష్ట్రజైళ్ళశాఖ కార్యాలయంలోని పరేడ్‌గ్రౌండ్స్‌లో 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా, ఉత్సాహంగా నిర్వహించారు. జైళ్లశాఖ డీజీ వీకే సింగ్ జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం కావించారు. కార్యక్రమంలో జైలు సిబ్బందితో పాటు సమీప స్కూల్స్‌కు చెందిన విద్యార్థులు కూడా పాల్గొన్నారు.

డీజీపీ కార్యాలయంలో...



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వెల్ఫేర్, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఐజీపీ సౌమ్యమిశ్రా జాతీయ పతా కాన్ని ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఐపీఎస్‌లకు ఐపీఎం, పీపీఎం అవార్డులు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఐపీఎం, పీపీఎం అవార్డులు పొందిన పోలీసు అధికారులు గోల్కొండ కోటలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఆ అవార్డులను నందుకున్నారు. పీపీఎం అవార్డులు నందుకున్న పోలీసు అధికారులు సీవీ ఆనంద్, ఎ.బాలకృష్ణ, ఐపీఎం అవార్డుల నందుకున్న పోలీసు అధికారులు జోగుల నర్సయ్య, మిర్యాల ప్రభాకర్, రేగట్టే జగదీశ్వర్‌రెడ్డి, పాక గిరి రాజు, టీ.ఆర్.రాజేశ్వర్ లక్ష్మి, పి.భూపతి రెడ్డి, బూర్గుల మహేందర్, తూడి ప్రభాకర్, ముద్దం రఘుపతి రావు, మహ్మద్ ఖైరుద్దీన్, పి.జీవానందంలు ఉన్నారు.

లాభాల బాటలో ఆర్టీసీ

• చైర్మన్ సోమారపు సత్యనారాయణ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆర్టీసీ ఆర్థిక పరిపుష్టికి అందరూ తోడ్పాటును అందించాలని సంస్థచైర్మన్ సోమారపు సత్యనారాయణ కోరారు. రోజుకు 94 లక్షల మంది ప్రయాణికులను సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుస్తున్న ఆర్టీసీ పురోభివృద్ధిలో అందరూ భాగస్వామ్యం కావలసి ఉందన్నారు. ఆర్టీసీ క్రమంగా లాభాల బాటలో పయనిస్తుందని పేర్కొన్నారు. బస్ భవన్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఉద్యోగులు, కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్టీసీ ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకునేందుకు దూర ప్రాంతాలకు, పొరుగు రాష్ట్రాలకు నడిపించే బస్సుల సంఖ్యను పెంచడం జరిగిందన్నారు. అరుణాచల్ ప్రదేశ్ పర్మిట్లతో నడుస్తున్న బస్సులను రద్దు చేయడంతో ఆర్టీసీ కొంత మేరకు అదనపు ఆదాయం పెంచుకుంటుందన్నారు. ఆర్టీసీకి ఉన్న 96 డిపోలకు గాను కేవలం 5 డిపోలు మాత్రమే లాభాల్లో నడిచేవని, ఇటీవల తీసుకున్న



చర్యలతో 32 డిపోలు లాభాల బాటలో పయనిస్తున్నాయని, 50 డిపోలు నిర్వహణ వ్యయాన్ని సాధిస్తున్నాయని, ఐదు రీజియన్లు లాభాలతో నడవడం ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ పరిణామం అని వెల్లడించారు. తెలంగాణలోని అన్ని బస్ స్టేషన్‌లను ఆధునీకరించడం జరుగుతుందని వివరించారు.

మహామహులంతా న్యాయవాదులే..

• హైకోర్టు ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఏసీజే



హైదరాబాద్,ఆంధ్రప్రభ : ఉమ్మడి హైకోర్టు ప్రాంగణంలో మువ్వన్నెల జాతీయ పతాకం రెపరెపలాడింది.71 వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ మంగళవారం హైకోర్టులో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ ప్రసంగిస్తూ స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర నిర్వహించిన మహాత్మాగాంధీ, లాలా లజపతిరాయ్, అంబేద్కర్, నెహ్రూ, బాబురాజేంద్ర ప్రసాద్, సి.రాజగోపాలచారి తదితరులందరూ ప్రఖ్యాతి చెందిన న్యాయవాదులేనని గుర్తు చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో వి.పి మీనన్, వల్లభాయ్ పటేల్ తదితులు స్వతంత్ర రాజ్యాలు, సంస్థానాలను దేశంలో విలీనం చేసేందుకు ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో , తెలంగాణ అడ్వకేట్ జనరల్ డి.ప్రకాశ్ రెడ్డి, ఏపీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి.శ్రీనివాస్, తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జల్లి.కనకయ్య, ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చల్లా. ధనంజయ, తదితరులు ప్రసంగించారు. సుప్రీంకోర్టు , హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు, ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తులు, కింది కోర్టులకు చెందిన న్యాయాధికారులు , హైకోర్టు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభను ప్రదర్శించిన హైకోర్టు సిబ్బంది, పిల్లలకు ఈ సందర్భంగా ఏసీజే ప్రతిభ అవార్డులు ప్రదానం చేశారు.

ప్రయాణికుల భద్రతకే ప్రాధాన్యత

• ద.మ.రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : దక్షిణ మధ్య రైల్వే అన్ని విభాగాల్లో ఎంతో అభివృద్ధిని సాధిస్తుందని జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ వివరించారు. ప్రయాణికుల భద్రతే మొదటి ప్రాధాన్యతగా పని చేస్తున్నామని వెల్లడించారు. రైల్వేను అన్ని విధాలుగా ఆధునీకరిస్తున్నామని, సేవలను విస్తరించడం జరుగుతుందని పేర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యాన సికింద్రాబాద్‌లోని రైల్వే ఆర్ఎస్‌సీ మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొని రైల్వే పోలీసులు, విద్యార్థుల కవాతును వీక్షించారు. గౌరవ వందనం స్వీకరించారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి రైల్వే ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా వివరించారు. 2017 తొలి త్రైమాసికంతో దక్షిణ మధ్య రైల్వే రూ. 4320 కోట్లు ఆర్జించిందని వివరించారు. అన్ని విభాగాల్లో పని తీరు బాగా మెరుగుపడిందని వెల్లడించారు.

కూలిన బతుకులు

నిలబెట్టడమే లక్ష్యం





(మొదటిపేజీ తరువాయి)

అధిగమించిం దని అభిప్రాయం వ్యక్తంచేశారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో 21.7 శాతం ఆదాయ వృద్ధిరేటుతో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. తమ ప్రభుత్వం అవలంబిస్తున్న పారదర్శక విధానాలవల్ల, పటిష్టమైన ఆర్థిక క్రమశిక్షణ వల్ల సత్ఫలితాలు సాధిస్తున్నామన్నారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనలో నూతన ఒరవడికి నాంది పలికిన ఘనత తెలంగాణకు దక్కుతుందన్నారు. ఇక్కడ మనం ప్రవేశపెట్టిన పథకాలు, సరికొత్త కార్యక్రమాలు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాయన్నారు. నిబద్ధతతో, సమన్వయంతో చేస్తున్న నిరంతర కృషి వల్లనే అభివృద్ధి ఫలాలను సకాలంలో అందుకోగలుగుతున్నామన్నారు. కేవలం ఆర్థికలక్ష్యాలను సాధించడమే కర్తవ్యంగా భావించే యాంత్రిక ధోరణిని విడనాడి సమానత్వం, సామాజిక న్యాయం అనే ఉదాత్త లక్ష్యాలను సాధించే దిశగా పరిపాలనా విధానాల్లో మార్పులు తీసుకువచ్చామన్నారు.

◆ అణగారిన వర్గాలకు కనీస జీవన భద్రత

తొంభైశాతం ప్రజలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలే ఉన్నందున వారి సమస్యలపట్ల సానుభూతితో వ్యవహరిస్తున్నామన్నారు. ఆయా కుటుంబాల్లో పేదరికాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. కనీస జీవన భద్రతను కల్పించేందుకు బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి సింహ భాగాన్ని వెచ్చిస్తున్నామన్నారు. నిరుపేదలకు, నిస్సహాయులకు కనీస భద్రత కల్పించేందుకు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, నేత, గీత కార్మికులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, బీడీ కార్మికులతో పాటు ఇటీవల ఒంటరి మహిళలకు కూడా జీవన భృతిని కల్పించామన్నారు. కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల ద్వారా రూ.75వేల మొత్తాన్ని అందజేస్తూ ఆడపిల్ల పెళ్ళి భారాన్ని ప్రభుత్వం కొంతమేరకు పంచుకునే ప్రయత్నం చేస్తోందన్నారు.

◆ విద్యుత్ రంగంలో విప్లవాత్మక ప్రగతి

దేశంలోనే ఏ రాష్ట్రం సాధించని విధంగా, ఊహించని విధంగా విద్యుత్ రంగంలో తెలంగాణ విప్లవాత్మక ప్రగతిని సాధించిందని సీఎం కేసీఆర్ ప్రకటించారు. నిరంతర విద్యుత్ సరఫరాతో అన్ని రంగాల ప్రగతికి బాటలు వేస్తున్నామన్నారు. వ్యవసాయ రంగానికి పగటిపూటే 9 గంటల విద్యుత్ సరఫరా చేస్తూ అన్నదాతల మన్ననలు పొందామన్నారు. ఇటీవల పూర్వ మెదక్, కరీంనగర్, నల్గొండ జిల్లాల్లో ప్రయోగాత్మకంగా 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి చేయూతనిస్తున్నామన్నారు.

◆ ప్రజల దాహార్తిని తీర్చేందుకు శాశ్వత కార్యాచరణ

రాష్ట్ర ప్రజల దాహార్తిని శాశ్వతంగా పరిష్కరించే అపురూపమైన పథకం మిషన్ భగీరథ లక్ష్యాన్ని చేరుకునే దిశగా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అధికార యంత్రాంగం రేయింబవళ్ళు శ్రమిస్తోందన్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికే అన్ని గ్రామాలకు శుద్ధి చేసిన రక్షిత మంచినీటిని అందించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. గ్రామాల్లో అంతర్గత పైప్‌లైన్లు, వాటర్ ట్యాంకుల నిర్మాణం, ఇళ్ళల్లో నల్లాల ఏర్పాటు వంటి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు.

◆ అర్ధాకలితో ఉన్న ఉద్యోగులకు అండ

ఎన్ని న్యాయపరమైన చిక్కులు ఎదురైనా, రాజకీయ లబ్ధికోసం ప్రతిపక్షాలు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నా వాటన్నింటిని అధిగమిస్తూ శ్రమ దోపిడీకి గురవుతున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను పెంచి వారి అర్ధాకలిని తీర్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కొన్ని ప్రతీపశక్తులు సంకుచితత్వంతో అడ్డు తగులుతున్నాయని, అయినా వారి కుతంత్రాలు తమ ప్రభుత్వంలో సాగనివ్వడం లేదని కేసీఆర్ వ్యాఖ్యానించారు.

◆ పేదల ఆత్మగౌరవం కోసమే డబుల్ బెడ్‌రూం

పేదల ఆత్మగౌరవాన్ని పెంపొందించే విధంగా, భవిష్యత్ తరాలకు ధీమాను కల్పించే విధంగా తమ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రస్తుత ఆ ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతోందని ప్రకటించారు. దశాబ్దాల తరబడి శ్రమించినా సొంత గూటికి నోచుకోని వారందరినీ గుర్తించి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర్చే ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

◆ గర్భిణీ స్త్రీలపట్ల ప్రత్యేక శ్రద్ధ

పేద కుటుంబాల్లో వాస్తవ పరిస్థితులు తెలిసిన వ్యక్తిగా గర్భిణీ స్త్రీల సంక్షేమంపట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ కేసీఆర్ కిట్ అనే కొత్త పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఇల్లు గడవడం కోసం గర్భిణీ స్త్రీలు కూడా కూలీ పనులకు పోవాల్సి రావడం, కొన్ని సందర్భాల్లో అనారోగ్యానికి గురికావడం తనకెంతో బాధ కలిగించిందన్నారు. వారికోసమే కాకుండా పుట్టిన పసిపిల్లలకు కూడా ఈ పథకంలో లబ్ధి చేకూరుస్తూ మూడు దశల్లో రూ.12వేలను అందిస్తున్నామన్నారు. గడిచిన రెండున్నర నెలల్లోనే ఈ పథకం ద్వారా 42వేల మందికి ప్రయోజనం చేకూరిందన్నారు.

◆ గ్రామ స్వరాజ్యానికి బాటలు

పల్లెసీమలే దేశానికి పట్టుకొమ్మలన్న మహాత్మాగాంధీ నినాదాన్ని అమలు చేస్తూ కులవృత్తులను, చేతివృత్తులను ప్రోత్సహిస్తూ గ్రామాల్లో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. చిన్నాభిన్నమైన కులవృత్తులను పునరుద్ధరించి తద్వారా ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసేందుకు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందడుగు వేస్తున్నామన్నారు. కోటి 47 లక్షల గొర్రెలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. తెలంగాణకు జీవన రేఖలుగా ఉన్న గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించేందుకు మిషన్ కాకతీయ పథకాన్ని అమలు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 46,500 చెరువుల్లో ఇప్పటికే 20వేల చెరువులను పునరుద్ధరించామన్నారు. పాత ప్రాజెక్టుల పునరుజ్జీవ పథకానికి శ్రీకారం చుట్టి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా నాంది పలికామన్నారు.

◆ రైతులకు అండగా పెట్టుబడి పథకం

చిన్న, సన్నకారు రైతులు ప్రతియేటా నష్టాలను చవిచూస్తుంటే... వాటినుంచి బయటపడేందుకు ప్రభుత్వం పెట్టుబడి రాయితీ పథకాన్ని ప్రవేశపెట్టిందని, వచ్చే ఏడాది వానాకాలం నుంచి ఈ పథకాన్ని అమలులోకి తీసుకువస్తామని కేసీఆర్ ప్రకటించారు. రెండు పంటలకు ప్రతి ఎకరానికి రూ.8వేల చొప్పున పెట్టుబడిన సమకూర్చి వారి కష్టాల్లో భాగస్వామ్యం పంచుకోబోతున్నామన్నారు. అలాగే ఉచిత చేపపిల్లల పంపిణీ ద్వారా లక్షలాది కుటుంబాలకు ఆర్థిక చేయూతను అందిస్తున్నామన్నారు.

◆ పేద మహిళలకు చీరల పథకం

రాష్ట్రవ్యాప్తంగా వచ్చే బతుకమ్మ పండుగ నుంచి తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న 93 లక్షల మంది మహిళలకు చీరలను పండుగ కానుకగా అందించే పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. చేనేత పరిశ్రమ నుంచి ఈ పథకానికి అవసరమైన చీరలను కొనుగోలు చేసి రెండు రకాలుగా పేదలకు లబ్ధి చేకూరుస్తామన్నారు. వరంగల్‌లో అతిపెద్ద టెక్స్‌టైల్ పార్కు, సిరిసిల్లలో అపెరల్ పార్కు నిర్మాణాలకు త్వరలోనే ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతున్నదని వెల్లడించారు.

త్వరలో మరో 84 వేల పోస్టుల భర్తీ

ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని చేసిన ప్రకటనకు కట్టుబడి ముందడుగు వేస్తున్నామన్నారు. అందులో భాగంగా కేవలం ప్రభుత్వ రంగంలోనే 1,12,536 ఉద్యోగాల భర్తీకి చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు 27,660 పోస్టులు వివిధ శాఖల్లో భర్తీ చేశామని, మరో 84,876 పోస్టుల భర్తీ ప్రక్రియ త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పడానికి తాను సంతోషిస్తున్నానని సీఎం కేసీఆర్ అన్నారు. వచ్చే సంవత్సరం ఏర్పడే ఖాళీలను భర్తీ చేయడానికి కూడా ఈ ఏడాది నుంచే ప్రక్రియ ప్రారంభించవలసిందిగా అధికార యంత్రాంగాన్ని ఆదేశించామన్నారు.

టీఎస్-ఐపాస్ చట్టంపై ప్రపంచ దృష్టి

తాము ప్రవేశపెట్టిన టీఎస్-ఐపాస్ చట్టం ఇతర రాష్ట్రాలకు కరదీపికగా మారిందన్నారు. ప్రపంచదృష్టిని ఆకట్టుకున్న తెలంగాణ ప్రపంచ పారిశ్రామికవేడులకు వేదికవుతోందని, ఇది మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. నవంబర్ 28 నుంచి 30 వరకు హైదరాబాద్ మహానగరంలో జరిగే ఈ ప్రతిష్టాత్మక సదస్సుకు ప్రధాని నరేంద్రమోడీతో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ హాజరవుతుండడం శుభ పరిణామమని కేసీఆర్ చెప్పుకొచ్చారు. తెలంగాణ ప్రజల సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న తమ ప్రభుత్వ ఏకాగ్రతను ఎలాంటి టిక్షుద్ర ప్రయత్నాలు మరల్చలేవని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదంతొ సౌభాగ్యవంతమైన రాష్ట్రాన్ని నిర్మించేందుకు మొక్కవోని దీక్షతో ముందుకు సాగుతామని కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.

శాంతి భద్రతల్లో నెం-1

దేశంలోనే తెలంగాణ పోలీసు వ్యవస్థ అత్యంత ప్రతిష్టవంతంగా పనిచేస్తోందని సీఎం తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందన్నారు. గతంలో పోలిస్తే నేరాల సంఖ్య భారీగా తగ్గిందని, పేకాట, గుడుంబా మహమ్మారులను తరిమికొట్టామని పేర్కొన్నారు. షీ టీమ్స్ ఏర్పాటు చేయడం ద్వారా మహిళలపై అఘాయిత్యాలు, వేధింపులు 90శాతం తగ్గించగలిగామన్నారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా షీటీమ్స్‌ను ఏర్పాటుచేసి మహిళలకు సామాజిక భద్రతను పెంచుతామన్నారు. మాదక ద్రవ్యాలలాంటి సామాజిక రుగ్మతలను ఆదిలోనే అంతం చేసేందుకు తమ ప్రభుత్వం రాజీలేని వైఖరిని అవలంబిస్తోందన్నారు.

కొత్త జిల్లాలతో పాలన మరింత చేరువ

సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని తెలంగాణ ప్రభుత్వం కొత్తగా 21 జిల్లాలను ఏర్పాటు చేసిందని, తద్వారా పరిపాలన ప్రజలకు మరింత చేరువైందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. 25 రెవెన్యూ డివిజన్లు, 125 మండలాలను ఏర్పాటు చేయడం ద్వారా పౌర సేవలు విస్తరించాయన్నారు. కొత్త జిల్లాల్లో పరిపాలనా భవనాల నిర్మాణం శరవేగంగా జరుగుతోందన్నారు.

పంపకాలెలా?!

(మొదటిపేజీ తరువాయి)

ఏపీ కార్యాలయాన్నింటిని అమరావతికి తరలించామని బుధవారం నుంచి డీజీపీ కార్యాలయం కూడా మంగళగిరి నుంచే పని చేయడం ప్రారంభిస్తుందని చంద్రబాబు చెప్పారు. అన్ని సమస్యలు పరిష్కారమవుతేనే తమ ఆధీనంలో ఉన్న సచివాలయం అంశంపై దృష్టి సారిస్తామని అప్పటిదాకా ఎటువంటి నిర్ణయం జరగదని చంద్రబాబు చెప్పారు. కొన్ని రోజుల క్రితం విజయవాడలో నిర్మించిన విద్యుత్ కార్యాలయాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ నరసింహన్‌తో ప్రత్యేకంగా సమావేశమైన చంద్రబాబు విభజన చట్టంలోని అంశాల పరిష్కారంలో జరుగుతున్న జాప్యంపై తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తంచేశారు. తెలుగు రాష్ట్రాల మధ్య పెద్దన్న పాత్ర పోషించి సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని కోరిన సంగతి తెలిసిందే. పంద్రాగస్టు సందర్భంగా తాను నిర్వహిస్తున్న తేనీటి విందుకు తప్పకుండా రావాలని ఆ రోజున తెలంగాణ సీఎంను కూడా సమయం కేటాయించాలని కోరుతానని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు గవర్నర్ సీఎంలిద్దరిని కూర్చోబెట్టి సమస్యల పరిష్కారానికి చొరవ చూపారు. రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ ప్రమాణ స్వీకారానికి హాజరైన తెలంగాణ సీఎం కేసీఆర్ తెలుగు మీడియా ప్రతినిధులకు ఇచ్చిన విందులో మాట్లాడుతూ అభివృద్ధిలో రెండు రాష్ట్రాలు పోటీ పడతాయని ఆ దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. సమస్యల పరిష్కారంలో తానూ చొరవ చూపుతానని పట్టింపులకు వెళ్ళనని భరోసా ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే గవర్నర్ సమక్షంలో జరిగిన సీఎంల సమావేశంలో విభజన చట్టంలోని అంశాలపైనే ప్రధానంగా చర్చ జరిగింది. త్వరలోనే ఇరు రాష్ట్రాలకు చెందిన మంత్రులు, ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటుచేసి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని గవర్నర్ హామీనిచ్చినట్టు సమాచారం. అధికారుల బదిలీలు, ఉద్యోగుల కేటాయింపులపై కూడా రెండు రాష్ట్రాల్లో సమస్య తీవ్రంగా ఉందని ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులు, తెలంగాణలో ఉన్న ఏపీ ఉద్యోగులు ఎప్పటికప్పుడు ఆందోళన నిర్వహిస్తూ తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నారని సీఎంలు గవర్నర్ దృష్టికి తీసుకువెళ్ళారు. ఇటీవల రెండు రాష్ట్రాలు బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసిందని వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వాటిపై తుదినిర్ణయం తీసుకుంటామని తెలుగు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు బదిలీలపై కసరత్తు చేస్తారని గవర్నర్‌కు చెప్పారు. గతంలో విభజన సమస్యల పరిష్కారానికి రెండు తెలుగు రాష్ట్రాలు మంత్రులు, అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీని పునరుద్ధరించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ కమిటీలో తెలంగాణ తరపున మంత్రులు హరీష్‌రావు, జగదీశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వివేక్ ఉండగా, ఏపీ నుంచి ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, రవాణాశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు ఉన్నారు. శాఖల వారీగా విభజన చట్టంలో ఉన్న పెండింగ్ సమస్యలను అధ్యయనంచేసి ఇరు రాష్ట్రాలు నివేదికలు సిద్ధం చేయాలని వీటిని అధ్యయనం చేశాకే ఏం చేయాలన్నది నిర్ణయిద్దామని గవర్నర్ తెలిపారు. ఈ సమస్యలన్నింటినీ తాను కేంద్రం దృష్టికి తీసుకువెళతానని వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తానని గవర్నర్ సీఎంలకు భరోసా ఇచ్చారు. రెండు గంటల పాటు సాగిన ఈ తేనీటి విందు భేటీలో రాజకీయ అంశాలు కూడా చర్చకు వచ్చినట్టు సమాచారం. వైకాపా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి నంద్యాల ఉపఎన్నిక ప్రచారం సందర్భంగా తనపై ప్రయోగించిన భాషను, నడిరోడ్డులో తనను చంపాలంటూ చేసిన వ్యాఖ్యలపై కూడా గవర్నర్ ఆరా తీసినట్టు సమాచారం. ప్రజాస్వామ్యంలో ఈ తరహా వ్యాఖ్యలు మంచిది కాదన్న అభిప్రాయానికి గవర్నర్‌తో సహా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వచ్చినట్టు సమాచారం. ఆరోపణలు, ప్రత్యారోపణ లు చేసుకోవడం పరిపాటని, అలా కాకుండా నడిరోడ్డులో ఉరితీయండని, చంపాలని, దుస్తులను ఊడదీయాలని అనడం అప్రజాస్వామికంగా ఉంటుందన్న అభిప్రాయానికి వచ్చినట్టు చెబుతున్నారు.



ముఖ్య సేవకుడిగా పనిచేస్తా

- తెలంగాణ ఉద్యమంలో ముస్లింలు వెన్నంటి ఉన్నారు : సీఎం కేసీఆర్
- హజ్ యాత్రికులకు వీడ్కోలు



హైదరాబాద్,ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రజలకు ముఖ్య సేవకుడిగా పని చేస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ముందంజలో ఉన్నదని ఆయన తెలిపారు. మంగళవారం నాంపల్లి హజ్‌హౌజ్‌లో హజ్‌యాత్రీకులతో సీఎం భేటీ అయ్యారు. హజ్‌యాత్రకు వెళ్లే యాత్రికులకు సీఎం కేసీఆర్ వీడ్కోలు పలికారు. యాత్రికులను తీసుకెళ్లే బస్సులకు సీఎం పచ్చ జెండాను ఊపారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం సమయంలో ముస్లింలు వెన్నంటి ఉన్నారని గుర్తు చేశారు. అలాంటి వారికి సేవ చేయడం తన బాధ్యత అని పేర్కొన్నారు. 2014 నాటికి తెలంగాణ బడ్జెట్ రూ. 5 లక్షల కోట్లకు చేరుకుంటుందని సీఎం చెప్పారు. మైనార్టీ విద్యార్థులకు కార్పోరేట్ స్థాయి విద్యను అందిస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా వందలాది గురుకులాలను తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిందని, ఒక్కో విద్యార్థిపై ఏడాదికి రూ. 1.50 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు సీఎం తెలిపారు. నిజాం రాజు అప్పట్లోనే అత్యంత ధనికుడని, మక్కాలో అప్పుడే వసతి భవనం ఏర్పాటు చేశారని సీఎం గుర్తు చేశారు. నిజాం నిర్మించిన భవనానికి ఉమ్మడి రాష్ట్రంలో రంగులు కూడా వేయలేదని ఆయన విమర్శించారు. ముస్లింల అభివృద్ధికి రూ. 12 వందల కోట్లు కేటాయించామన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రపంచానికే ఆదర్శంకావాలనే ఉద్దేశ్యంతో తాము ముందుకు పోతున్నట్లు తెలిపారు. చిత్తశుద్ధితో రాష్ట్రాన్ని సాధించుకున్నామని, ఆ విధంగానే బంగారు తెలంగాణకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ, డిప్యూటీ మేయర్ బాబాషఫియోద్దీన్‌తో పాటు ఎమ్మెల్యేలు, మైనార్టీ నేతలు హాజరయ్యారు.

అక్టోబర్ నుంచి రంగంలోకి!

- తెలుగు రాష్ట్రాల్లో జనసేన సత్తా ఏంటో చూపిస్తా
- తెలంగాణలోనూ పోటీ చేస్తా
- రాజ్‌భవన్‌లో తేనీటివిందుకు హాజరైన జనసేన అధినేత పవన్
- ప్రత్యేకంగా ఆహ్వానించిన గవర్నర్
- రాజకీయ అంశాలు, ప్రజల సమస్యలపై చర్చ
- 4గంటలపాటు రాజ్‌భవన్‌లో గడిపిన పవన్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలోనూ అన్ని స్థానాల్లో పోటీకి దిగుతామని సినీ నటుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. అక్టోబర్ మాసం నుంచి పూర్తిస్థాయిలో తన సమయాన్ని రాజకీయాలకు కేటాయిస్తానని ఈలోపు నిర్మాణాల్లో ఉన్న చిత్రాలను పూరిచేస్తానని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ మంగళవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన తేనేటి విందు కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానం మేరకు పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర భారతీయ జనతాపార్టీ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ఆంధ్రప్రదేశ్ వైద్యఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్‌తో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ, రెండు తెలుగు రాష్ట్రాల్లో తమ పార్టీ కీలకం కానున్నదని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణ్ తెలంగాణలో ఎన్ని స్థానాలకు పోటీ చేస్తారని అడగ్గా వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో జనసేన అభ్యర్థులను నిలబెడుతుందని ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు శంకర్ అనే తమ పార్టీ నాయకుడిని ఇన్‌ఛార్జిగా నియమించినట్టు పవన్ చెప్పారు. అందరి ఊహలకు భిన్నంగా ప్రజల్లోకి తమ పార్టీ దూసుకుపోతుందని తెలుగు రాష్ట్రాల్లో జనసేన సత్తా చాటుతుందని చెప్పారు. తేనేటి విందుకు గవర్నర్ నరసింహన్ సోమవారమే పవన్ కళ్యాణ్‌కు ఫోన్‌చేసి రాజ్‌భవన్‌కు రావలసిందిగా ఆహ్వానించారు. తమ పార్టీ అధ్యక్షుడు రాజ్‌భవన్‌కు వెళుతున్నారని మంగళవారం మధ్యాహ్నం మీడియాకు జనసేన పార్టీ ముఖ్య నేత సమాచారం అందించారు. పైజామా, జుబ్బా ధరించి వచ్చిన పవన్‌ను కలిసేందుకు నాయకులు సైతం పోటీపడ్డారు. కొంతమంది నేతలు తేనేటి విందుకు పవన్ కళ్యాణ్‌ను గవర్నర్ ఎందుకు ఆహ్వానించి ఉంటారని, సినీ నటుడిగా ఆయనను ఆహ్వానించారా లేక జనసేన అధ్యక్షుడిగా పిలిచారా అనే అంశంపై రాజ్‌భవన్‌కు వచ్చిన ఆహ్వానితుల్లో కొందరు చర్చించుకోవడం కనిపించింది. ఏ హోదాలో గవర్నర్ నరసింహన్ పవన్‌ను పిలిచి ఉంటారని కొందరు కూపీలాగే పనిలో పడ్డారు. శ్రీకాకుళం జిల్లా ఉద్దానం గ్రామంలో కిడ్నీ బాధితుల సమస్యల పరిష్కారంతో పాటు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రభుత్వాలకు సూచనలు, సలహాలు చేస్తుండడంవల్లే పవన్‌ను తేనేటి విందుకు ఆహ్వానించి ఉండవచ్చని చర్చించుకోవడం కనిపించింది. తేనేటి విందులో ప్రధాన స్థానంలో పవన్ ఆశీనులయ్యారు. గవర్నర్ కుడిచేతి వైపున తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు, ఎడమ చేతివైపున ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు బండారు దత్తాత్రేయ, సుజనా చౌదరి ఆశీనులయ్యారు. గవర్నర్ కుడిచేతి చివరి సీటులో గవర్నర్ సతీమణి విమలా నరసింహన్, ఆయన పక్కన పవన్ కళ్యాణ్ కూర్చున్నారు.



గవర్నర్ సతీమణితో పవన్ అరగంట పాటు వివిధ అంశాలపై చర్చించుకోవడం కనిపించింది. ముఖ్యమంత్రులిద్దరూ పవన్‌కు కరచాలనం చేసి వివిధ అంశాలపై ఆయనతో మాట్లాడారు. ఈ తేనేటి విందు కార్యక్రమానికి తెరాస ఎంపీలు డి.శ్రీనివాస్, కె.కేశవరావు, బూర నర్సయ్య గౌడ్, నగర మేయర్ బొంతు రామ్మోహన్, తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, కేటీ రామారావు, జగదీశ్వర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సిఎల్‌పి నేత జానారెడ్డి, శాసనమండలిలో కాంగ్రెస్ పక్షనేత షబ్బీర్ అలీ, భాజపా అధ్యక్షుడు లక్ష్మణ్, శాసనసభలో భాజపా పక్షనేత కిషన్‌రెడ్డి, ఆ పార్టీ ఎమ్మెల్యే ప్రభాకర్, సిపిఐ రాష్ట్రకార్యదర్శి చాడా వెంకట్‌రెడ్డి, ఏపీ అసెంబ్లీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు, శాసనమండలి మాజీ చైర్మన్ చక్రపాణి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, పుర ప్రముఖులు, ఆయా రంగాల్లో నిష్ణాతులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

సెల్ఫీల హోరు

రాజ్‌భవన్‌కు వచ్చిన పవన్ కళ్యాణ్‌తో సెల్ఫీ ఫోటోలు దిగేందుకు సీనియర్ అధికారులు సైతం పోటీపడ్డారు. ముఖ్యంగా అధికారుల సతీమణులు పవన్ కళ్యాణ్‌కు కరచాలనంచేసి ఆయనతో ఫోటో దిగారు. తేనేటి విందు కార్యక్రమం ముగిశాక గేటు ద్వారా గవర్నర్ కార్యాలయంలోకి వెళుతున్న సమయంలో వరప్రసాద్ అనే యువకుడు పవన్‌తో సెల్ఫీ దిగేందుకు దూసుకువచ్చి ఆయనను నెట్టే ప్రయత్నం చేస్తున్న సమయంలో ఆయన అంగరక్షకుడు జోక్యం చేసుకుని అటువైపు లాగాడు. ఇలా దూసుకువస్తే ఎలా అని ఆయన వ్యక్తిగత భద్రతా సిబ్బంది ఆ యువకునిపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆ యువకుడిని మీడియా ప్రతినిధులు ప్రశ్నించే ప్రయత్నం చేశారు. తేనేటి విందుకు ఎవరు ఆహ్వానించారని, అసలు రాజ్‌భవన్‌లో వచ్చేందుకు పాసు ఉందా అని అడగ్గా ఏ సమాధానం చెప్పకుండానే ఆ యువకుడు పరుగులు తీశాడు.

తేనేటి విందు సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమైంది. అప్పటిదాకా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, చంద్రబాబుల కోసం వేచిచూసిన గవర్నర్ నరసింహన్ ఎంతకీ వారు రాకపోవడంతో 5.30 గంటల ప్రాంతంలో ఆయన తన సతీమణి విమలతో కలిసి తేనేటి విందు ఏర్పాటు చేసిన పచ్చికబయళ్ళలోకి వచ్చారు. ఆహ్వానితులను పలకరించి ముందుకు సాగుతున్న సమయంలో తెలంగాణ సీఎం కేసీఆర్ వచ్చారన్న వార్తను అధికారులు గవర్నర్ చెవిలో వేశారు. మధ్యలోనే గవర్నర్, ఆయన సతీమణి తిరిగి వెనక్కి వెళ్ళి సీఎంను సాదరంగా ఆహ్వానించారు. ఈలోపే ఏపీ సీఎం చంద్రబాబు కూడా వస్తున్నారని తన కార్యాలయ అధికారులు తెలియజేయడంతో ఆయన కోసం కాసేపు గవర్నర్

ఆలస్యంగా ఇద్దరు సీఎంలు

వేచిచూశారు. తిరిగి ఇరువురు సీఎంలను వెంట బెట్టుకుని తేనేటి విందు ఏర్పాటుచేసిన ప్రాంగణానికి చేరుకున్నారు. వచ్చిన అతిథులందరినీ గవర్నర్, ఆయన సతీమణి విమలా ఇద్దరు సీఎంలు పలుకరించారు. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం కేసీఆర్, జానారెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, షబ్బీర్ అలీ, దత్తాత్రేయ, పవన్ కళ్యాణ్‌లతో విడివిడిగా సమావేశమై మాట్లాడుకున్నారు. ప్రతిరోజూ ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకునే తెరాస, కాంగ్రెస్ నేతలు తేనేటి విందులో ఎంతో అన్యోన్యంగా మాట్లాడుకోవడంతో పాటు ఒకరిపై ఒకరు ఛలోక్తులు విసురుకుంటూ విరగబడి నవ్వుకున్నారు. తేనేటి విందు ముగిశాక తిరిగి ఇరువురు సీఎంలతో కలిసి గవర్నర్ రాజ్‌భవన్‌లోని తన కార్యాలయంలోకి వెళ్ళారు. వెళుతూ వెళుతూ జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను తన కార్యాలయంలోకి రావలసిందిగా కోరారు. ఇందుకు పవన్ కళ్యాణ్‌ను తీసుకువచ్చే బాధ్యతను ఓ ఉన్నతాధికారికి గవర్నర్ అప్పగించారు. సీఎంలతో గవర్నర్ సమావేశం జరుగుతున్నంతసేపు పవన్ కళ్యాణ్ ఓ ప్రత్యేక గదిలో ఆశీనులయ్యారు. సమావేశం ముగిసిన వెంటనే గవర్నర్ బయటకువచ్చి పవన్ కళ్యాణ్‌ను తిరిగి తన ఆఫీసు గదిలోకి తీసుకుని వెళ్ళారు. అరగంట పాటు ఇరువురు మాట్లాడుకున్నారు. ప్రజా సమస్యలపై తాను ఏ విధంగా స్పందిస్తున్నది, ఉద్దానం కిడ్నీ బాధితుల అంశంతో పాటు ఇరు రాష్ట్రాల్లో నెలకొన్న సమస్యలపై పోరాడేందుకు సిద్ధమని ఈ దిశగా తమ పార్టీ శ్రేణులను జాగురూకత చేస్తున్నామని ఆయన గవర్నర్‌కు చెప్పినట్టు సమాచారం.

తన సోదరుడు, మాజీ కేంద్రమంత్రి చిరంజీవికి సంబంధించిన పలు అంశాలు కూడా ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చినట్టు తెలుస్తోంది. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో రాజ్‌భవన్‌కు చేరుకున్న పవన్ కళ్యాణ్ రాత్రి 9 గంటల వరకు అక్కడే గడిపారు. సమావేశం ముగిశాక తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో గవర్నర్ బయటకు వచ్చి పవన్‌ను సాగనంపారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నాన్మృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

బుధవారం 16 ఆగస్టు 2017

నినాదం కాదు.. అదే మన లక్ష్యం!

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి ఎర్రకోట ప్రసంగానికీ, అంతకుముందు రోజున రాష్ట్రపతి ఆకాశవాణి, దూర్‌దర్శన్‌ల ద్వారా జాతినుద్దేశించి చేసే ప్రసంగానికీ సారూప్యత ఉంది. ఇద్దరి నినాదం... ఆకాంక్ష... పిలుపు నవభారత్ నిర్మాణం. ఇది కొత్తదేమీ కాకపోయినా, మారిన పరిస్థితుల నేపథ్యంలో మారిన పాత్రధారుల నోటంట వెలువడటం వల్ల ఇది కొత్తదనాన్ని సంతరించుకుంది. ఇవి మొక్కుబడి ప్రసంగాలు కావు. దేశ ప్రజలకు దిశానిర్దేశనం చేసిన ప్రసంగాలు. జాతిని జాగృతం చేసిన ప్రసంగాలు. చైతన్యస్ఫూర్తికి నిలువెత్తు నిదర్శనాలు.. దేశ ప్రజల కర్తవ్యాన్ని గుర్తు చేసిన సందేశాలు. భారత రాష్ట్రపతి పీఠాన్ని అధిష్ఠించిన రెండవ దళితునిగా చరిత్రలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న రామనాథ్ కోవింద్ ఇచ్చిన సందేశంలోనే మానవత్వం అనేది మన డిఎన్ఎలోనే ఉందన్నారు. మానవుడు ఎంత పురోగమించినా, మానవత్వానికి దూరమవుతున్నాడన్న ఆవేదన అందరిలోనూ ఉంది. అలాగే, ఆధునికత వెర్రితలలు వేయడం, అనురాగం దూరం కావడం కూడా సమాజంలో నిత్యం చూస్తూనే ఉన్నాం. సాంకేతిక నైపుణ్యం మానవ వికాసానికి ఉపయోగ పడాలే తప్ప, విధ్వంసానికి కాదన్నది రాష్ట్రపతి సందేశ సారాంశం. శాస్త్ర, సాంకేతికరంగాల్లో ఎంత అభివృద్ధిని సాధించినా మనిషి సాటి మానవుణ్ణి తనతో సమానంగా చూడలేకపోతున్న వికృత ధోరణులను దృష్టిలో ఉంచుకునే ఆయన ఈ ఉద్బోధ చేశారు. స్వయం ప్రతిభ, ఆత్మతృప్తి ఉంటే ఎంత తక్కువ స్థాయి నుంచి అయినా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని మన పూర్వీకులు నిరూపించారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ జీవితమే ఇందుకు నిలువెత్తు నిదర్శనం. అలాగే, మహాత్మాగాంధీ మనుషుల్లో దేవునిగా కీర్తినొందడానికి ఆయనలోని నిజాయితీ, సత్యసంధత, కార్యదీక్షే కారణం. ఏ మనిషి అయినా అనుకున్నది సాధించాలంటే దృఢసంకల్పంఅత్యవసరం. దానినే వజ్ర సంకల్పం అంటారు. అది ఉండటం వల్లనే తొలి ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశంలోని 500 పైగా సంస్థానాలను భారత్‌లో విలీనం చేయగలిగారు. అంకిత భావం, అలుపెరగని కృషి ఉంటే నవభారత నిర్మాణం సాధ్యమేనని తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రుజువు చేశారు. ఆనాడు ఆయన నిర్మించిన నవభారత్‌లో అవినీతి, బంధుప్రీతి, అలసత్వం వంటి దుర్గుణాలు చొచ్చుకుని రావడంతో నవభారత్ గమ్యం తప్పింది. ఆ దుర్నీతిలన్నింటినీ పారద్రోలి నవభారతాన్ని పట్టాలెక్కించడం కోసమే ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడీ ఐదేళ్ళలో నవభారత్‌ని నిర్మిద్దామంటూ పిలుపు ఇచ్చారు. భారత్ ఎప్పటికీ నవనవోన్మేషంగా ఉండాలన్నది దేశాధినేతల ఆకాంక్ష. అంతటి శక్తి, వనరలు, ప్రతిభ మనకు పుష్కలంగా ఉన్నప్పుడు ఉన్నత లక్ష్యాల సాధనకై కృషి చేయడం పౌరుల బాధ్యత. దానిని మోడీ పదే పదే గుర్తు చేస్తున్నారు. వచ్చే సంవత్సరారంభానికి ఈ శతాబ్దంలో నవయవ్వనంలోకి అడుగు పెట్టే యువత సంఖ్య 20 కోట్లకు చేరుకుంటుంది. వారంతా కొత్త ఊహలతో, ఆలోచనలతో ముందుకు వస్తున్నారు. వారి కలలను పండించేందుకు అనువైన వాతావరణాన్ని సృష్టించడం కోసమే నవభారత్‌ని నిర్మిద్దామన్న పిలుపును మోడీ ఇచ్చారు. దేశం కోసం అందరూ, ఒక్కరి కోసం దేశం కలిసికట్టుగా కృషి చేసిన రోజునే సమున్నతమైన ఈ ఆశయాలు నెరవేరుతాయి. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా మనం ఎన్నో రికార్డులను నెలకొల్పుతున్నాం. ఆహారధాన్యాల అధికోత్పత్తి నుంచి అంతరిక్షంలో వినూత్న పరిశోధనల వరకూ మన దేశం సాధించిన కీర్తి తక్కువేమీ కాదు. ఇతర దేశాల ఉపగ్రహాలను సైతం అంతరిక్షంలోకి పంపడంలో మన ఇస్రో రికార్డులను సృష్టిస్తోంది. మన ఐటి ఇంజనీర్లు సిలికాన్ వ్యాలీలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. గుండె మార్పిడి శస్త్ర చికిత్సల్లో మన వైద్యులు ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్నారు. అన్నీఉన్నా మనం ఇంకా ఎందుకు దూసుకుపోలేకపోతున్నామని ప్రశ్నించుకుంటే, ఎవరో రావాలి, ముందుకు నడపాలి, మనకెందుకులెమ్మన్న భావాలు మనల్ని ఇంకా వదలకపోవడమే. అలాంటి వాటిని వదిలించుకుని ముందుకు దూసుకుని పోవడం కోసమే రాష్ట్రపతి, ప్రధానమంత్రి నవభారత్‌ని సాధించాలన్న పిలుపు ఇచ్చారు. దానిని సాకారం చేయడం మనందరి కర్తవ్యం.

'కోట్ల' హృదయాల్లో పెద్దాయన



నేడు జయంతి

నిండైన విగ్రహం... నిజాయితీకి నిలువటద్దం... మాటకు కట్టుబడటం.. పార్టీ పట్ల విశ్వసనీయత.. ఇవన్నీ పోతపోస్తే కోట్ల విజయభాస్కరరెడ్డి. ప్రజాజీవితంలోఐదు దశాబ్దాలు పైగా కొనసాగినా మచ్చలేని నాయకునిగా పేరొందిన విజయభాస్కరరెడ్డి కర్నూలు జిల్లా కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని లద్దగిరి గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించారు. ఆయన చదువుకునే రోజుల్లోనే జాతీయ భావాలను పుణికి పుచ్చుకున్నారు. మద్రాసు, మదనపల్లిలలో విద్యాభ్యాసం ముగించి న్యాయశాస్త్ర పట్టా పొందారు. కళాశాలలో చదువుకునే రోజుల్లోనే విద్యార్థి కాంగ్రెస్ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. మహదేవ్ దేశాయ్ మరణించినప్పుడు, జాతిపిత మహాత్మాగాంధీ ఆరోగ్యం క్షీణిచినప్పుడు నిరసన కార్యక్రమాలను నిర్వహించి అరెస్టు అయ్యారు. అతి చిన్న వయసులోనే కాంగ్రెస్ అధ్యక్షునిగా పనిచేసిన కోట్ల ఎన్నో విద్యార్థి సదస్సులను నిర్వహించారు.1953లో రాజకీయ రంగప్రవేశం చేసిన కోట్ల 1955లో తొలిసారిగా ఎమ్మిగనూరు - కోడుమూరు ఉమ్మడి నియోజకవర్గం నుంచి అసెంబ్లీకి భారీ మెజారిటీతో గెలుపొందారు. ఆతర్వాత రెండు సార్లు కర్నూలు జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డికి విజయభాస్కరరెడ్డి అత్యంత సన్నిహితుడు. సంజీవయ్యను ఓడించినందుకు విజయభాస్కరరెడ్డి శాసనసభ్యుడు కాకపోయినా, ఎగువసభకు నామినేట్ చేయించి ఆయనకు మంత్రిపదవిని బ్రహ్మానందరెడ్డి ఇచ్చినట్టుగా ఆనాటి కాంగ్రెస్ వర్గాలు పేర్కొనేవి. బ్రహ్మానంద రెడ్డి కేబినెట్‌లో ఆర్థిక, సహకార, భారీ నీటి పారుదల శాఖలను విజయభాస్కరరెడ్డి సమర్థవంతంగా నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా వివిధ పదవులను నిర్వహించిన విజయభాస్కరరెడ్డి 60వ దశకం చివరలో ఆంధ్రప్రదేశ్ క్రీడామండలి ఛైర్మన్‌గా కూడా వ్యవహరించారు. కేంద్రంలో కీలకమైన నౌకాయానా శాఖ, పరిశ్రమలు, కంపెనీ వ్యవహారాల శాఖలను నిర్వహించారు.

తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు రాజకీయాల్లోకి రాకముందు కిలో రూపాయి తొంభై పైసలకు చౌక డిపోల ద్వారా పేదలకు సబ్సిడీ బియ్యాన్ని సరఫరా చేసిన ఘనత విజయ భాస్కరరెడ్డిదే. అలాగే, ఎన్టీఆర్ 1994 ఎన్నికల్లో మళ్ళీ అధికారంలోకి వచ్చి మద్యనిషేధాన్ని ప్రవేశపెట్టడానికి ముందే మద్యనిషేధ కార్యక్రమం అమలుకు విజయభాస్కరరెడ్డి స్ఫూర్తిగా నిలిచారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు నంద్యాల లోక్‌సభ స్థానం నుంచి గెలుపొందడానికి విజయభాస్కరరెడ్డి ఎంతో కృషి చేశారు. జాతీయ స్థాయిలో దేశానికీ, రాష్ట్రస్థాయిలో రాష్ట్రానికీ విశిష్టమైన సేవలందించిన విజయభాస్కరరెడ్డి 81వ ఏట సరిగ్గా పదహారు సంవత్సరాల క్రితం భౌతికంగా ఈ లోకాన్ని వీడినప్పటికీ, కోట్లాది ప్రజల హృదయాల్లో పెద్దాయనగా శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నారు.

-కదిరికోట ఆదెన్న,
9989386008

మంచి మాట

మనం అభ్యుదయం సాధించాలంటే చరిత్రను పునరావృతం చేయడం కాదు, నూతన చరిత్రను సృష్టించాలి.



● గాంధీజీ

ప్రధాని నరేంద్ర మోడీ స్వాతంత్ర్య దినోత్సవ సంరంభంలో ఉత్తేజభరితంగా ప్రసంగించారు. యువతకు స్ఫూర్తి మంతంగా సాగిన ఆ ఉపన్యాసంలో ఆయన భిన్నాంశాలను స్పృశించారు. తీవ్రవాదం మొదలు జరిగేది జరుగుతుందిలే అనే వైఖరులను ప్రస్తావించారు. ఆధార్ మొదలు టెక్నాలజీ వరకూ...వన్ ర్యాంక్ వన్ పెన్షన్ మొదలు జమ్మూ కాశ్మీర్‌కు పునర్వైభవం వివిధ సమస్యలనూ వాటికి పరిష్కారాలను సూచిస్తూ.. మోడీ ధారాళంగా మాట్లాడారు. 54 నిమిషాల వాగ్ధరిలో నరేంద్ర భాయ్ మోడీ ప్రస్తావించని రంగం లేదు. క్విట్ ఇండియా స్ఫూర్తితో 2022 నాటికి నవభారతావనిని ఆవిష్కరింపజేయాలని యువతకు దిశానిర్దేశం చేశారు. మోడీ ప్రసంగం పూర్తి పాఠం.



నవభారతం వైపు... నడుద్దాం!

ఈ స్వాతంత్ర్య దినం ఎంతో ప్రత్యేకం

ఈ స్వాతంత్ర్య దినం మనకెంతో ప్రత్యేకమైనది. క్విట్ ఇండియా ఉద్యమానికి 75ఏళ్ళు పూర్తిచేసుకున్న సంవత్సరమిది. సబర్మతీ ఆశ్రమం, చంపారన్ సత్యాగ్రహాలకూ 75ఏళ్ళు. లోకమాన్య తిలక్ స్వరాజ్యం నా జన్మహక్కు.. అని పిలుపునిచ్చి ఈ ఏడాదికి వందేళ్ళయ్యింది. దేశ ప్రజలను ఒకటి చేసిన గణేశ ఉత్సవాలకు 125 ఏళ్ళయ్యింది. 1942-47 మధ్య దేశవ్యాప్తంగా ఐకమత్యం వెల్లివిరిసింది. 70వ-75వ స్వాతంత్ర్య దినోత్సవ సంరంభాల మధ్య మనం అదే స్ఫూర్తిని కనబరచాలి. 2022లో ఆ దీప్తిని చాటాలి.

దేశం ఈరోజు స్వాతంత్ర్య దినోత్సవంతో పాటు, జన్మాష్టమిని కూడా నిర్వహించుకుంటోంది. ఈ సభలో నేను అనేక మంది బాల కృష్ణుల్ని చూస్తున్నాను. మన సంస్కృతీ, చారిత్రక వారసత్వాలలో సుదర్శన్ చక్రధారి అయిన మోహన్ నుంచి చక్రధారి అయిన మోహన్ వరకూ ఉండడం మనం చేసుకున్న అదృష్టం. దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన వారికి 125 కోట్ల ప్రజల తరపున శిరస్సు వంచి అభివందనం చేస్తున్నా. దేశంలోని ఒక ఆస్పత్రిలో అమాయకులైన పసికందులు కన్నుమూశారు. 125 కోట్ల ప్రజలు భుజం భుజం కలిపి, విపత్కరమైన ఈ పరిస్థితుల్లో ఆ కుటుంబాలకు బాసటగా నిలవాలి. అందరూ బాగుండడం కోసం వచ్చే ఏ అవకాశాన్ని విడిచిపెట్టకూడదు. 75వ స్వాతంత్ర్య దినోత్సవానికి మనకు ఇంకా ఐదేళ్ళు సమయముంది. స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ మన ఐకమత్యాన్ని చాటుతూ, మన దృఢ నిశ్చయాన్నీ, పటిష్టతనూ కనబరచాలి. 2022నాటికి వారి కలలను సాకారం చేయడానికి దీక్షబూనాలి. నూతన భారతాన్ని ఆవిష్కరించడానికి ప్రతిజ్ఞ చేయాలి. కృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని ఎత్తేందుకు పశువుల కాపర్లు, రాముడు లంక చేరడానికి వానరులు ఎలా తోడ్పడ్డారో.. మోహన్‌దాస్ కరమ్ చంద్ గాంధీ స్వాతంత్ర్యమనే వస్త్రాన్ని నేయడానికి దేశ ప్రజలు అలాగే సహాయపడ్డారు. ఐకమత్యంగా ప్రజలు చేసిన కృషి దేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టింది. ఈ క్రతువులో అందరూ సమానులే. ఎవరూ పెద్దాచిన్నా కాదు. చిన్ని ఉడత మార్పునకు కారణమెలాగైందీ మన స్మృతిపథంలోంచి చెరిగిపోలేదు. అలాగే.. 125 కోట్ల మందీ అంతా సమానమేనని గుర్తుంచుకోవాలి. మనం ఏ ప్రాంతం వారిమనే ధ్యాస లేకుండా మన శక్తిని కేంద్రీకరించి ఐకమత్యంతో 75వ స్వాతంత్ర్య దినోత్సవం నాటికి మరింత సుదృఢంగా తయారవడానికి కృషిచేయాలి. భీతిలేని, సంపన్నమైన, సుదృఢమైన దేశాన్ని ఆవిష్కరింపజేసేందుకు చేతులు కలపాలి. అదే మన నూతన భారత్ కావాలి. ప్రపంచంలో దేశానికి కొత్త సొబగులద్దే విజ్ఞానం, సాంకేతికత మన సొంతం కావాలి. మన స్వాతంత్ర్య సమరం, కొన్ని విశ్వాసాలతో ముడిపడి ఉంది. ఉపాధ్యాయుడు, రైతు, కార్మికుడు, ఇలా

వచ్చే జనవరి 1 అసాధారణమైన రోజు

జనవరి 1, 2018 సాధారణమైన రోజు కాదు. ఆరోజున పుట్టిన వారు 18ఏళ్ళ వయసువారవుతారు. అంటే ఈ సంవత్సరం వారికి అత్యంత కీలకమైనది. నిర్ణయాలు తీసుకునేదీనూ. 21వ శతాబ్దంలో మన దేశానికి వారు భాగ్య విధాతలవుతారు. దేశం కోసం ఏదో చేసే శక్తి వారిలో ప్రవేశిస్తుంది. ఈ యువ తరాన్ని నేను హార్దికంగా ఆహ్వానిస్తున్నాను. దేశ భవిష్యత్తును తీర్చి దిద్దే శక్తి మీలో ఉంది. దేశాభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు మీకు ఆహ్వానం పలుకుతున్నాను.

ఎవరేం చేసినా దేశ స్వాతంత్ర్యం కోసమే చేస్తున్నామని నమ్మేవారు. ఇదే మన బలానికి మూలమైన ఆలోచన. మనింట్లో రోజూ అన్నం వండుకుంటాం. దాన్ని దేవుడికి నైవేద్యం పెట్టినప్పుడే అది ప్రసాదమవుతుంది. అలాగే, మనం భరతమాత కోసం పనిచేయాలి.

అలాచేసే పని పవిత్రమవు తుంది. మనం దేశం కోసం చేసే పని ఏదీ వృధా కాదు. అప్పుడు లభించే ఫలితాలు అత్యంత ఆశాజనకంగా ఉంటాయి. కురుక్షేత్ర సంగ్రా మంలో అర్జునుడు ఎన్నో సందేహాలు అడిగినప్పుడు.. నీ ఆలోచనలూ, నమ్మకాలపైనే నీ లక్ష్యాల సాధన ఆధారపడి ఉంటుందని శ్రీకృష్ణ పరమాత్ముడు బదులిస్తాడు. మనకు దృఢమైన నిశ్చయముంటే, మనం భవిష్య భారతాన్ని తీర్చి దిద్దే శక్తి ఉన్నట్లే. నిరాశను విడిచిపెట్టి, ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసుకోవాలి. జరిగేది జరుగుతుందిలే... అనే వైఖరిని విడనాడాలి. మార్చగలమనే వైఖరిని అందిపుచ్చుకోవాలి. ఇది దేశానికి ఎంతో ప్రయోజనకరం. ఈ ఆత్మవిశ్వాసాన్ని మనం తెచ్చుకోవాలి. త్యాగం, కఠోర పరిశ్రమ, ఏదో చేయాలనే

దోచుకున్నోడికి నిద్ర కూడా కరవు

దేశాన్నీ, ప్రజలనూ దోచుకున్న వారు ఈరోజు ప్రశాంతంగా నిద్ర పోలేకపోతున్నారు. దీనివల్ల కష్టపడి పనిచేసే, నిజాయితీగా పనిచేసే వారిలో ఆత్మవిశ్వాసం పొంగిపొర్లుతోంది. తన నిజాయితీ కి ప్రతిఫలం దక్కుతోందని నిజాయితీపరుడు ఆనందిస్తున్నాడు. మనం ఈ రోజు నిజాయితీ పర్వదినాన్ని నిర్వహించుకుంటున్నాం. దేశంలో నిజాయితీ లేమికి ఆస్కారం లేదు. ఇదే కొత్త ఆశను చిగురింపజేస్తోంది.

సైనిక దళాల్లో వన్ ర్యాంక్ ఉత్సాహం

వన్ ర్యాంక్-వన్ పెన్షన్ అనే విధానం 40 ఏళ్ళుగా స్తంభించిపోయింది. మా ప్రభుత్వం దాన్ని అమలుచేసింది. సైనికుల ఆశలను తీర్చింది. దీనివల్ల వారిలో ఉత్సాహం ఉరకలెత్తుతోంది. దేశ రక్షణకు మరింత పటిష్టంగా వారు కృషిచేయగలుగుతున్నారు. అలాగే జిఎస్టీ అమలు వల్ల సహకారాత్మక సమాఖ్య విధానం కొత్త శక్తిని పుంజుకుంది. జిఎస్టీ విజయాన్ని కఠోర శ్రమకు ప్రతీకగా చెప్పుకోవచ్చు. సాంకేతికత జిఎస్టీని అద్భుతంగా తీర్చిదిద్దింది. ప్రపంచం ఈ వ్యవస్థను చూసి, ఆశ్చర్యచకితమైంది. తక్కువ సమయంలో జిఎస్టీ అమలు ఎలా సాధ్యమైందని నోళ్ళు నొక్కుకుంది. మన సామర్థ్యానికి జిఎస్టీప్రతీకగా నిలుస్తోంది. భవిష్య తరాలకు స్ఫూర్తినీ, విశ్వాసాన్ని అందిస్తోంది.

తపనతో మనకు వనరులు అందివస్తాయి. అప్పుడు పెద్ద మార్పు వస్తుంది. అదే మన కలను నెరవేర్చుకోవడానికి సాధనమవుతుంది. మన సుస్థిరత, క్షేమం కోరుకోవడం దేశ ప్రజల అవసరం. మన సైన్యం, సాహసోపేత హృదయాలు, ఎయిర్ ఫోర్స్, నేవీ లేదా ఏ సిబ్బందయినా అవసరమైన సమయంలో రంగంలో దిగి, శాంతి సుస్థిరతలకు ప్రాణాలిస్తారు. వారి శక్తివంచన లేకుండా పనిచేస్తారు. వారి బలాన్ని ప్రదర్శిస్తారు. వారెప్పుడూ వెన్ను చూపలేదు. అతివాదమైనా.. తీవ్రవాదమైనా వాటి అంతాన్ని చూశారు. ఇందులో ప్రాణ త్యాగమూ చేశారు. సర్జికల్ స్ట్రైక్స్ చూసి, ప్రపంచం భారత్ శక్తిని తెలుసుకుంది. దేశ రక్షణే మన ప్రాధాన్యత. అది తీర ప్రాంతమైనా.. సరిహద్దయినా.. అంతరిక్షమైనా.. సైబర్ స్పేసయినా స్వీయ రక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తాం. ఏళ్ళుగా బినామీ ఆస్తులెన్నో తేలకుండా ఉంది. మనం చేసుకున్న కొత్త బినామీ చట్టం, అతి తక్కువ సమయంలో 800కోట్ల రూపాయల బినామీ ఆస్తులను బయటపెట్టింది. ఇలాంటి చర్యల వల్లే సామాన్య పౌరుడిలో విశ్వాసం ఏర్పడుతుంది. దేశం నిజాయితీపరుల కోసమేననే నమ్మకం కలుగుతుంది. కొంగ్రొత్త విధానాలు ఇప్పుడు ఆవిష్కృతమవుతున్నాయి. రహదారులను రెట్టింపు వేగంతో నిర్మించగలుగుతున్నాం. రైల్వే లైన్లనూ చురుగ్గా వేయగలుగుతున్నాం. 14వేల గ్రామాలలో విద్యుత్తు వెలుగులు నింపాం. 29 కోట్ల మంది బ్యాంకు ఖాతాలను తెరిచారు. 9 కోట్ల మంది రైతులకు మృణ్మయారోగ్య కార్డులను పంపిణీ చేశాం. 2 కోట్ల మంది మహిళలకు గ్యాస్ అందుబాటులోకి తెచ్చాం. పేద గిరిజనులకు వ్యవస్థపై నమ్మకాన్ని కలిగించాం. వరుసలో చివరున్న వ్యక్తి సైతం అభివృద్ధి ఫలాలను అందుకునే స్థితికి చేర్చాం. యువతకు భరోసా కలిగించేలా స్వీయ ఉపాధి కింద 8 కోట్ల రూపాయలు పైనే రుణాలను మంజూరు చేశాం. బ్యాంకు రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించాం. ద్రవ్యోల్బణం అదుపులో ఉంది. మధ్య తరగతి వారు ఇల్లు కట్టుకోవడానికి తక్కువ వడ్డీకే రుణాలందిస్తున్నాం. ఈ విధంగా దేశం అందర్నీ కలుపుకుని ప్రగతి పథంలో పయనిస్తోంది. రోజులు మారాయి. ప్రభుత్వం ఏమనుకుంటోందో అది చేస్తోంది. చిన్న పాటి పనికి సైతం 50 నుంచి 60 దరఖాస్తులు నింపాల్సి వచ్చేది. వాటిని 6 ఫారాలకు తగ్గించాం. సత్పరిపాలనకు ఇలాంటి ఉదాహరణలెన్నో నేను చెప్పగలను. గవర్నెన్స్ విధానాన్ని సరళీకరించాం. నిర్ణయాలు వేగంగా తీసుకుంటున్నాం. అందుకే 125 కోట్ల ప్రజలు పరిపాలన పట్ల విశ్వాసాన్ని వ్యక్తంచేస్తున్నారు. భారత దేశ ప్రతిష్ట ప్రపంచవ్యాప్తంగా పెరిగింది. తీవ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటంలో ఇప్పుడు భారత్ ఒంటరి కాదు. అనేక దేశాలు ఇప్పుడు మనకు మద్దతు పలు కుతున్నాయి. హవాలా..లేదా ఇదే తరహా తీవ్రవాద చర్యలపై పోరాటంలో ప్రపంచదేశాలు మనకి మద్దతునిస్తున్నాయి. కీలకమైన సమాచారాన్ని అం దిస్తున్నాయి. తీవ్రవాదంపై ఉమ్మడిపోరుకు మనం ఇతర దేశాలతో చేతులు కలిపాం. ఆ దేశాలన్నింటికీ నేను మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నాను. వేల కిలోమీటర్ల దూరం లో ఉండి కూడా సాధారణ పౌరుడు తన ఉత్పత్తులను ప్రభుత్వానికి అమ్మగలడు. ఎవరూ దళారీ అవసరం లేదు. జిఇఎమ్ అనే పోర్టల్‌ను ఇందుకోసం ఆవిష్కరించాం.

ఈ పోర్టల్ ద్వారా ప్రభుత్వం తనకు కావాల్సిన వస్తువులను కొనుగోలు చేస్తోంది. వివిధ స్థాయుల్లో పారదర్శకతను తెచ్చేందుకు మేము ప్రయత్నిస్తున్నాం. ప్రభుత్వ స్కీముల అమలు వేగం పుంజుకుంటోంది. ప్రతి ప్రాజెక్టునూ నేను ప్రతి నెలా సమీక్షిస్తున్నాను. అంగారక గ్రహానికి తొమ్మిది మాసాల్లో చేరే సామర్థ్యం కలిగిన దేశం నలభైరెండేళ్ళుగా 70 నుంచి72 కిలోమీటర్ల రైలు మార్గం వేయలేకపోవడానికి కారణం ఏమిటి? పేద ప్రజల మనసు ల్లో ఇలాంటివే సందేహాలను రేకెత్తిస్తున్నాయి. ఇలాంటి వన్నీ పరిగణనలోకి తీసుకు న్నాం. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా వీటి ని సాధిస్తాం. భూసాంకే తికపరిజ్ఞానమైనా, రోదశి సాంకేతి క పరిజ్ఞానమైనా, ఈ పరిజ్ఞానా లన్నింటిని అనుసంధానం చేయడం ద్వారా వ్యవస్థలో మార్పు తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తున్నాం.


మీకు తెలుసు. యూరియా,కిరోసిన్‌లకోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉద్రిక్తతలు గతంలో చోటు చేసుకున్నాయి. కేంద్రానిది అన్నగారి పాత్ర అయితే, రాష్ట్రా లది తమ్ముళ్ళ పాత్ర. గుజరాత్ ముఖ్యమంత్రిగా చాలా కాలం వ్యవహరించడం వల్ల దేశాభివృద్ధిలో రాష్ట్రాల పాత్ర ఏమిటో నాకు తెలుసు. అందుకే, సహకార సమాఖ్యకు ఇప్పుడు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఇప్పుడు సమష్టిగా నిర్ణయాలను తీసుకుంటు న్నాం. మీకు గుర్తుండే ఉంటుంది. మన ప్రధానమంత్రుల్లో ఒకరు ఎర్రకోట ప్రసంగంలో దేశంలో విద్యుత్ సరఫరా కంపెనీల దుస్థితి గురించి వివరించారు.దీనిపై అప్పట్లో ఆయన ఆందోళన వ్యక్తం చేసారు కూడా.మేం అధికారంలోకి వచ్చాక,ఉదయ్ యోజన పథకాన్ని తీసుకుని వచ్చాం. విద్యుత్ కంపెనీలతో కలిసి ఈ సమస్య పరిష్కారం కోసం కృషి చేశాం. ఈ సమస్య పరిష్కారం కావడం ఫెడరల్ స్ఫూర్తికి నిదర్శనం. వస్తు సేవా పన్ను (జిఎస్‌టి) అయినా, ఆకర్షిత నగరాల (స్మార్ట్ సిటీ) ప్రాజెక్టు అయినా, స్వచ్ఛ భారత్ అభియాన్ అయినా, మరుగుదొడ్ల నిర్మాణమైనా, వాణిజ్య కార్యకలాపాలకు అనుకూలత అయినా, ఇవన్నీ మా ప్రభుత్వం తీసుకున్న శ్రద్ధాశక్తులు,చొరవ కారణంగా ప్రతిఫలించినవే. నవభారత నిర్మాణం మన ప్రజాస్వామ్యానికి కొండంత శక్తినిస్తుంది. అయితే, మన ప్రజాస్వామ్యాన్ని బ్యాలెట్ పెట్టెలకే పరిమితం చేసేశాం.నవభారతంలో ప్రజాస్వామ్యాన్ని పరిఢవిల్లజేయడం మన ముందున్న కర్తవ్యం. అలాంటి ప్రజాస్వామ్యం నవభారతానికి గుర్తింపును ఇస్తుంది.ఆ దిశగా పయనించాలనుకుంటున్నాం.

మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి ఏనాడో ఏభైమూడేళ్ళ క్రితం జై జవాన్,జై కిసాన్ అనే నినాదం ఇచ్చారు.అప్పటి నుంచి మన రైతులు వెనక్కి తిరిగి చూసుకోలేదు.ఆహార ధాన్యాలను రికార్డు స్థాయిలో ఉత్పత్తి చేస్తున్నారు.ప్రకృతి వైపరీత్యాల వల్ల ఎన్నో ఆటుపోట్లను తట్టుకుంటున్నప్పటికీ ఆహారధాన్యాల అధికోత్పత్తిని వీడలేదు.ఈ ఏడాది పప్పుధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయిలో జరిగింది.

మన దేశం ఎప్పుడూ పప్పుధాన్యాలను దిగుమతి చేసుకునేది కాదు. ఎప్పుడైనా అసాధారణ సందర్భాల్లో మాత్రం దిగుమతిచేసుకునేదేమో. ఈ ఏడాది 16 లక్షల టన్నుల పప్పుధాన్యాలను మన రైతులు ఉత్పత్తి చేశారు. పేదలకు పౌష్టికాహారాన్ని అందించారు. రైతుల నుంచి పప్పుధాన్యాలను కొనుగోలు చేయాలని ప్రభుత్వం రంగంలోకి దిగింది.

భారత్ ఛోడో ఆనాటి నినాదం, భారత్ జోడో ఇప్పటి నినాదం

బ్రిటిష్ వారిని పారద్రోలడానికి ఆనాటి పెద్దలు భారత్ ఛోడో నినాదాన్ని ఇచ్చారు.దేశం నుంచి దురాచారాలు,దుష్ట ధోరణులను పారద్రోలడానికి భారత్ జోడో ఇప్పటి మన నినాదం. గడిచిన మూడేళ్ళలో మా ప్రభుత్వం ఎన్నో ముఖ్యమైన నిర్ణయాలను తీసుకుంది.రైలు ప్రమాదాలను చాలా వరకూ అరికట్టింది.రైళ్ళ వేగాన్ని 60నుంచి 30కి తగ్గించింది. కొత్త లైన్ల నిర్మాణాలను పూర్తి చేసింది. విమానాశ్రయాలను ఆధునీకరించింది. గ్యాస్‌గ్రిడ్, వాటర్ గ్రిడ్‌లను ఏర్పాటు చేసింది. మౌలిక సదుపాయాల రంగంలో ఆధునికతకు పెద్ద పీటవేస్తోంది. దేశాన్ని 21వ శతాబ్దంలో ముందుకు తీసుకుని పోవడాని కి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు అవసరమై న వనరులు మనకు పుష్కలంగా ఉన్నాయి. తూర్పు భారతం అభివృద్ధిపై మా ప్రభుత్వం దృష్టి పెట్టింది.అసోం, బీహార్, పశ్చిమబెంగాల్, ఒడిషా, ఈశాన్య రాష్ట్రాల్లో విద్యుత్, మౌలిక సదు పాయాలను పెంచేందుకు కృషి చేస్తోంది. మనకు సమృద్ధిగా సహజవ నరులు ఉన్నాయి. వాటిని సద్వినియో గం చేసుకోవాలి.



అవినీతిని పారద్రోలుతాం

అవినీతిని దేశం నుంచి పారద్రోలేందుకు మా ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు సాగుతోంది.అవినీతి కేసుల సత్వర విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాలను (సిట్‌లను) ఏర్పాటు చేస్తోంది. గడిచిన మూడేళ్లలో 1.25 లక్షల కోట్ల నల్లధనాన్ని వెలికి తీశామని గర్వంగా ప్రకటిస్తున్నాం. దోషులు ఎంతటి వారైనా చట్టం కింద శిక్షార్హులే.

పెద్ద కరెన్సీ రద్దు

పెద్ద కరెన్సీ రద్దు వల్ల నల్లధనం చాలా వరకూ అదుపులోకి వచ్చింది. పాత నోట్లు మార్చుకోవడానికి గడువు కోరారు.ఇచ్చాం.., పెట్రోల్ బంకులు,మందుల దుకాణాల్లో కూడా మార్చుకోవడానికి అవకాశం ఇచ్చాం. గతంలో ఎన్నడూ బ్యాంకింగ్ వ్యవస్థ పరిధిలోకి రాని మూడు లక్షల కోట్ల రూపాయిలు ఇప్పుడు బ్యాంకుల్లోకి వచ్చి చేరినట్టు ప్రభుత్వేతర నిపుణులు పేర్కొన్నారు. ప్రభుత్వ నిఘా కింద 1.75 లక్షల కోట్లను బ్యాంకుల్లో జమ చేశారు.రెండు లక్షల కోట్ల రూపాయిల నల్లధనం బ్యాంకుల్లో జమ చేయబడింది.ఈ నల్లధనం అంతా ఇప్పుడు లెక్కల పరిధిలోకి వచ్చింది.ఆదాయం పన్ను చెల్లింపుదారుల సంఖ్యపెరిగింది. ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి ఆగస్టు ఐదవ తేదీ వరకూ 56 లక్షల కొత్త రిటర్న్‌లు దాఖలైనాయి.ఇదే కాలంలో గత సంవత్సరం దాఖలైన రిటర్న్‌లు 22లక్షలు మాత్రమే.నల్లధనంపై మా ప్రభుత్వం జరుపుతున్నపోరాటానికి ప్రతిఫలం ఇది.

ఆదాయం పన్ను అంటే ఏమిటో తెలియని వారిని సైతం ఈ పన్ను పరిధిలోకి తెచ్చాం.అలాంటి వారు లక్ష మంది పైగా ఇప్పుడు పన్ను పరిధిలోకి వచ్చారు. ప్రకటించిన దాని కన్నా ఎక్కువ ఆదాయం ఉన్న వారి సంఖ్యను 18 లక్షలుగా గుర్తించాం.కొత్తగా 4.5 లక్షల మందిని ఈ పరిధిలోకి తెచ్చాం.

మన దేశంలో కంపెనీలు మూత పడటంతో ఆర్థిక సంక్షోభం మళ్ళీ పొంచి ఉందనే చర్చ నిరంతరాయంగా సాగుతోంది. నల్లకుబేరులు,అక్రమ వ్యాపారులు డొల్ల కంపెనీల ద్వారా నల్లధనాన్ని తరలించేందుకు అలవాటుపడ్డారు.అలాంటి మూడు లక్షల డొల్ల కంపెనీలను మా ప్రభుత్వం గుర్తించింది.పెద్దకరెన్సీ రద్దుతో ఇలాంటి అక్రమ లావాదేవీలన్నీ బంద్ అయ్యాయి. 1.75 లక్షల కంపెనీల రిజిస్ట్రేషన్లనురద్దు చేశాం.ఒకే చిరునామాతో డొల్ల కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి.అవినీతి,నల్లధనంపై నేను చాలా పెద్ద యుద్ధాన్ని చేశాను,ఇప్పటికీ చేస్తున్నాను.

జిఎస్‌టి తర్వాత

వస్తు, సేవా పన్ను అమలులోకి వచ్చిన తర్వాత జవాబుదారీతనం, పారదర్శకత పెరిగాయి.30 శాతం సామర్థ్యం పెరిగింది.చెక్‌పోస్టులను తొలగించడం ద్వారా వందల కోట్లు ఆదాఅయ్యాయి. జిఎస్‌టి విప్లవాత్మకమైన మార్పులు తెచ్చింది. పెద్ద కరెన్సీ రద్దు వల్ల ద్రవ్య నిల్వలు పెరిగాయి. బ్యాంకులు వడ్డీ రేట్లనుతగ్గిస్తున్నాయి. ముద్ర పథకం ద్వారా సామా న్యులకు నిధులు అందుబాటులోకి వస్తున్నాయి.

ఐదేళ్లలో నవభారత్

ఐదేళ్ళలో నవభారత్ నిర్మాణం లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.కొత్త సంకల్పంతో కొత్త ఆశలతో ముందుకు సాగితే మనం ఆశించిన లక్ష్యాన్ని సాధించడం పెద్ద కష్టమేమీకాదు. అందుకు మీ అందరి సహాయ సహకారాలు కావాలి. మీ అందరి చేయూతతోనే సురాజ్‌ని సాధించాలన్నది నా సంకల్పం.

భారత్ మాతాకీ జై!
వందే మాతరం, జైహింద్!!

అసహనంతో వ్యవస్థను దెబ్బతీసే యత్నం

కొన్ని సందర్భాల్లో మత విశ్వాసాల పేరిట కొందరు వ్యక్తులు సహనాన్ని కోల్పోయి సాంఘిక వ్యవస్థ చట్రాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది ఆందోళన కలిగించే విషయం.శాంతి,సామరస్య, ఐక్యత మన సమాజానికి పట్టుగొమ్మలు.తరతరాలుగామన సమాజం వీటిపై ఆధారపడి నిర్మితమైంది.ఇది మన సంప్రదాయం.ఇదే సంప్రదాయాన్ని కొనసాగిద్దాం.హింసతో దేనినీ సాధించలేం. ఆ విషయాన్ని ఎరుకపరచడం ద్వారా ఉద్వేగాలకు లోనయ్యేవారిని శాంతింపజేయాలి.ఏదైనా ఆస్పత్రిలో రోగికి ఏమైనా జరిగితే ఆస్పత్రిని తగులబెట్టే దురదృష్టకర సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.ఇది మన వారసత్వం కాదు.,ఇది మన సంస్కృతి కూడా కాదు.మన విశ్వాసమూ కాదు.అందరం కలిసిమెలిసి సహజీవనం సాగించడమే తరతరాలుగా మన పెద్దలు మనకు అందించిన సంప్రదాయం.

సాహస సైనికులకో వెబ్‌సైట్

రక్షణ దళాలు సరిహద్దుల్ని కాపలా కాస్తున్నాయి. సాహస అవార్డు విజేతల కోసం నేనొక వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్నానని చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నాను. వీరికి సంబంధించిన పూర్తి వివరాలను అందించేందుకు ఒక పోర్టల్‌ను కూడా ఏర్పాటుచేస్తున్నాను. మన దేశానికి గర్వకారణమైన సైనికుల వివరాలన్నీ ఇందులో ఉంటాయి. వారి త్యాగాలనూ ఇందులో పొందుపరుస్తాం. ఇవి యువతరంలో స్ఫూర్తిని నింపుతాయి. సాంకేతికత సాయంతో పారదర్శకత, నిజాయితీలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నాం. నల్ల ధనంపై, అవినీతిపై మా పోరాటం కొనసాగుతుంది. ప్రతి వ్యవస్థనూ ఆధార్‌తో అనుసంధానించేందుకు ప్రయత్నిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఈ విధానాన్ని ప్రశంసిస్తున్నారు. ఇది వ్యవస్థలో పారదర్శకతను ప్రోది చేస్తుంది.

మోడీకి పోయేకాలం వచ్చిందన్నారు

పెద్ద కరెన్సీని రద్దు చేసినప్పుడు యావత్ ప్రపంచం విస్తుపోయింది. ప్రధాని మోడీకి పోయేకాలం వచ్చిందని అన్నవారు కూడా ఉన్నారు. అయితే, 125కోట్ల మంది ప్రజలు ఎంతో సహనాన్నీ,విశ్వాసాన్ని ప్రదర్శించారు. అవినీతిని నిర్మూలించేందుకు ఒక్కొక్క చర్యను తీసుకుంటూ వస్తున్నాం. ఈ కార్యక్రమాలన్నింటిలో ప్రజలభాగస్వామ్యాన్ని చూస్తున్నాం.ఇది కొత్తపోకడ.ప్రజల భాగస్వామ్యంతోనే దేశాన్ని ముందుకు తీసుకుని పోవాలన్నది మా అభిమతం.

కాశ్మీర్ పూర్వ వైభవానికి కంకణ బద్ధులం

జమ్మూ, కాశ్మీర్ అభివృద్ధి, పురోగతి కోసం మనమంతా కలిసి కృషిచేయాలి. మనందరిపైఆ బాధ్యతుంది. ఆ రాష్ట్రా నికి పూర్వ వైభవాన్ని తేవాల్సిన అవసరం మనపై ఉంది. అందుకు మనం కంకణ బద్ధులమై ఉన్నాం. కాశ్మీర్ అంశంపై ఎన్నో రాజకీయాలున్నాయి. కానీ వేర్పాటువాదంపై విజయమెలా సాధించాలో నా మటుకు నాకు స్పష్టమైన విధానముంది. కొద్దిమంది చేతులలో అది చిక్కుకుని ఉంది. బుల్లెట్ల వల్లనో, దూషించడం వల్లనో అది పరిష్కారం కాదు. కాశ్మీరీలందరినీ చైతన్యవంతులను చేయడం ద్వారా అది సాధ్యమవుతుంది. 125 కోట్ల ప్రజల వారసత్వమది. ఆ దిశలో సమస్యను పరిష్కరించేందుకు ముందడుగు వేస్తున్నాం. తీవ్రవాదంపైనా, తీవ్రవాదులతోనూ మెతగ్గా వ్యవహరించే అవకాశమే లేదు.

అమరుల స్ఫూర్తి యాత్రను నిర్వహిస్తాం



హైదరాబాద్,ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు కల్పించినా తెలంగాణ అమరుల స్ఫూర్తియాత్రను నిర్వహించాలని టీజేఏసీ నిర్ణయించింది. ఐదో విడత అమరుల స్ఫూర్తి యాత్రను ఢిల్లీ పర్యటన తర్వాత అదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో నిర్వహించాలని టీజేఏసీ నాయకులు నిర్ణయం తీసుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని టీజేఏసీ కార్యాలయంలో కోదండరామ్ అధ్యక్షతన స్టీరింగ్ కమిటి సమావేశం జరిగింది. ఇప్పటి వరకు చేపట్టిన స్ఫూర్తియాత్ర, భవిష్యత్‌లో తీసుకునే నిర్ణయాలపై సమావేశంలో చర్చించారు. అంతకు ముందు టీజేఏసీ కార్యాలయంలో కోదండరామ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కోదండరామ్ మీడియాతో మాట్లాడారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ అమరుల స్ఫూర్తియాత్రను కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. నిజామాబాద్‌లో తమ యాత్రను అడ్డుకున్న విషయంపై చర్చించామని, అక్కడనే హాల్ మీటింగ్ నిర్వహించాలని సభ్యులందరూ ఏకాభిప్రాయానికి వచ్చినట్లు కోదండరామ్ తెలిపారు. తెలంగాణలోని మూడేళ్ల పాలన, ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్ విషయంలో ఈ నెల 22 నుంచి మూడు రోజుల పాటు ఢిల్లీలో కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. నిరుద్యోగ సమస్యపై కూడా హైదరాబాద్‌లో దసరా పండుగ తర్వాత పెద్ద బహిరంగ సభను నిర్వహిస్తామని కోదండరామ్ తెలిపారు. టీజేఏసీని కూడా క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కార్యాచరణ ఉంటుందన్నారు.

అణచివేతపై తిరుగుబాటు తప్పదు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేత విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు తిరగబడే రోజులొస్తాయని పీసీసీ ఉపాధ్యక్షులు మల్లు రవి ఆరోపించారు. మంగళవారం గాంధీ భవన్‌లో పీసీసీ అధికార ప్రతినిధులు సునీతారావు, ఇందిరాశోభన్‌తో కలిసి ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లా డారు. దేశాభివృద్ధి, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నో విప్లవాత్మక కార్యక్రమాలు చేపడితే, టీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని తుంగలోతొక్కుతోందని విమ ర్శించారు. ప్రజలకు ఆర్థిక, రాజకీయ , సామాజిక, సాంస్కృతిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందన్నారు. సీఎం కేసీఆర్ రాజ్యాంగ వ్యతిరేక చర్యలను మానుకోకపోతే ప్రజలు బుద్ధి చెబుతారని మల్లు రవి హెచ్చరించారు.

తెలంగాణకు సెప్టెంబర్ 17 నిజమైన స్వాతంత్ర్య దినోత్సవం



హైదరాబాద్,ఆంధ్రప్రభ : తెలంగాణకు సెప్టెంబర్ 17 నిజమైన స్వాతం త్ర్యది నోత్సవమని మాజీ మంత్రి, బీజేపీ జాతీ య కార్యవర్గ సభ్యుడు నాగం జనార్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమవేశంలో మాట్లాడారు. గోల్కొండ కోటపైన జెండాను ఎగురవేయడంతో సీఎం చంద్రశేఖర్ లోపల నిజాం అవహించి ఉన్నారనే విషయం స్పష్టమవుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించి ప్రతి పథకంలో అవినీతి దాగుందన్నారు. ఈ మూడేళ్లో 27 వేల ఉద్యోగాలు ఎక్కడిచ్చావో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టుల రీ డిజైన్లల్లో పెద్ద ఎత్తున అవినీతి దాగి ఉందన్నారు. పాలమూరు- రంగారెడ్డికి ప్రాజెక్టుకు టెండర్లు పలిచి 19 నెలలు గడుస్తున్నా అంచనాలు పెరిగాయే తప్పా ఇప్పటి వరకు రూ. వెయ్యికోట్లు ఖర్చు చేయలేదని నాగం ఆరోపించారు. మంత్రులు, ఎమ్మె ల్యేలు జీవచ్చాలుగా బతుకుతున్నారని, సీఎం మాత్రం తానే తెలివైన వాడనని అనుకుంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. పోలీస్ యాక్ట్30 ని అమలు చేస్తూ నిజాం కంటే నిరంకుశంగా పాలన సాగిస్తున్నాడని ఆయన విమర్శించారు. నేరెళ్ల ఘటనపై విచారణ జరిపి జిల్లా ఎస్పీపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.


ప్రమాదానికి ముందు యువకులతో గొడవపడిన ఎస్సై ఖలీల్

గంట తర్వాత రోడ్డు ప్రమాదంలో మృతి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ట్రైనీ కానిస్టేబుల్ మమత ఫోన్ చేయడంతోనే వికారాబాద్ స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ ఖలీల్ అప్పా జంక్షన్‌కు వచ్చాడని పోలీసులు నిర్ధా రించారు. ప్రమాదానికి గంట ముందుగా ఎస్ఐ ఖలీల్ హిమాయత్ సాగర్ ఆరే మైసమ్మగుడి వద్ద యువకులతో గొడవకు దిగాడు. శనివారం రాత్రి హిమా యత్‌సాగర్ రోడ్డు ప్రమాదంలో స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ ఖలీల్, ట్రైనీ కానిస్టేబుల్ కీర్తిలు మరణించారు. మరో ట్రైనీ కానిస్టేబుల్ మమత ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. శనివారం నాడు ఇంటికి వస్తానని భార్య ముంతాజ్‌కు ఉదయాన్నే ఫోన్ చేసి ఖలీల్ చెప్పా డు. రాత్రి రోడ్డు ప్రమాదంలో ఖలీల్ మరణించాడు. ట్రైనీ కానిస్టేబుల్ మమత ఎస్ఐ ఖలీల్‌కు ఫోన్ చేయడంతోనే ఎస్ఐ ఖలీల్ అప్పా జంక్షన్‌కు వచ్చాడని పోలీసులు గుర్తించారు. కానిస్టేబుల్ మమత ఫోన్ చేసి పిలవ డంతోనే అంబర్‌పేట, రామంతాపూర్‌లలో వారిని దింపేందుకు ఎస్ఐ ఖలీల్ అక్క డికి వచ్చినట్లు రాజేంద్రనగర్ పోలీసులు గుర్తిం చారు. ఆరేమైసమ్మ గు డి వద్ద ఇద్దరు యువకులు కారుకు అడ్డుగా వచ్చారని ఎస్ఐ ఖలీల్ గొడవకు దిగా రని కూడా పోలీసులు గుర్తించారు. నానా హంగామా చేశారని కూడా పోలీసులు నిర్ధారించారు. ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే రోడ్డు ప్రమాదంలో ఖలీల్ మరణంచారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

ప్రభుత్వానికి వారం గడువిచ్చిన బీసీ విద్యార్థి సంఘం



హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వారం రోజుల్లో విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం డిమాండ్ చేసింది. బకాయిలను విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపట్టాలని ఆదివారం జరిగిన బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. ఈ సమావేశానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. కార్యవర్గ సమావేశం ఆదివారం బీసీ భవన్‌లో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ జి అంజి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో గుజ్జ కృష్ణ, కోట్ల శ్రీనివాస్, పి సతీష్, టిఆర్ చందర్, జి కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు రూ. 1800 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని ఆర్ కృష్ణయ్య తెలిపారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలను గత ఏడాది నుంచి ఇవ్వడం లేదన్నారు. రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో కోర్సు పూర్తి అయిన వారికి ఆయా కాలేజీల యాజమాన్యాలు ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇవ్వడం లేదన్నారు. దీంతో విద్యార్థులు కొందరు ఉన్నత విద్యను చదవలేక, వారికి వస్తున్న ప్రైవేటు ఉద్యోగాల్లో చేరలేక పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఫీజులు చెల్లిస్తేనే కోర్సుల్లో అడ్మిషన్లను ఇస్తామని కాలేజీలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో గత ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వారం రోజుల్లోగా విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

న్యాక్ గుర్తింపునకు ఎన్ని పరీక్షలో..

•ఏ గ్రేడ్ కోసం తపన •హాస్టల్స్, కాలేజ్ భవనాలకు రంగులు •17 నుంచి 19 వరకు న్యాక్ అధికారుల సందర్శన •పూర్తి బాధ్యత తీసుకుని పర్యవేక్షిస్తున్న వైస్ చైర్మన్–1 ప్రొఫెసర్ లింబాద్రి



హైదరాబాద్,ఆంధ్రప్రభ: వందేళ్ళ ఘన చరిత్ర ఉన్న ఉస్మానియా విశ్వ విద్యాలయం న్యాక్ గుర్తింపు కోసం ముస్తాబవుతోంది. న్యాక్ ద్వారా ఏ గ్రేడ్ సాధించడం కోసం యూనివర్సిటీ అధికారులు ఎంతో శ్రమిస్తున్నారు. యూనివర్సిటీలోని భవనాలను, హాస్టల్స్‌ను అందంగా తీర్చిదిద్దడం కోసం కష్టపడుతున్నారు. వందేమాతర ఉద్యమం నుంచి మొన్న జరిగిన తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం వరకు యూనివర్సిటీ సాక్షి భూతంగా నిలిచింది. అటువంటి ఘన చరిత్ర ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ ఇప్పుడు న్యాక్ గుర్తింపు కోసం కష్టపడాల్సి వస్తోంది. గతంలో యూనివర్సిటీకి న్యాక్ ఏగ్రేడ్ గుర్తింపును ఇచ్చింది. ఈసారి ఏ ఫ్లస్, లేదా ఏ ఫ్లస్‌ఫ్లస్ గ్రేడ్ సాధించడం కోసం అన్ని రకాలుగా ప్రయత్నాలను యూనివర్సిటీ అధికారులు చేస్తున్నారు.

యూనివర్సిటీలోనే మకాం వేసిన ఉన్నత విద్యా మండలి వీసీ-1

మొన్నటి వరకు ఉస్మానియా యూనివర్సిటీ ఉపకులపతి ప్రత్యేక అధికారిగా పనిచేసిన ఆచార్య ఆర్ లింబాద్రి న్యాక్ గుర్తింపు బాధ్యతను తీసుకున్నారు. ఆయన దగ్గర ఉండి అన్ని పనులను పర్యవేక్షిస్తున్నారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్‌చైర్మన్-1గా ఆగస్టు 7న బాధ్యతలు తీసుకున్నప్పటికీ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో లేకుండా మొత్తం యూనివర్సిటీలోనే ఉంటూ పనులను పర్యవేక్షిస్తున్నారు. వీసీ ఓఎస్‌డిగా ఉంటూ ఉస్మానియా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ఆ సందర్భంగా యూనివర్సిటీలోని లోటుపాట్లు, అభివృద్ధి చేయాల్సిన అంశాలు అన్నింటిపై అవగాహన ఉన్న నేపథ్యంలో తానే పూర్తి బాధ్యత తీసుకుని యూనివర్సిటీలో ఉంటూ న్యాక్ గుర్తింపు కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటూ అందరిని కలుపుకుపోతూ యూనివర్సిటీకి న్యాక్ నుంచి ఏ ఫ్లస్ గ్రేడ్ వచ్చేలాగా ప్రయత్నాలు చేస్తున్నారు.

17 నుంచి 19 వరకు న్యాక్ బృందం పర్యటన

యూనివర్సిటీలో ఉన్న సౌకర్యాలతోపాటు, యూనివర్సిటీ సాధించిన విజయాలు, చేస్తున్న సాజిక సేవలను దృష్టిలో పెట్టుకుని న్యాక్ యూనివర్సిటీలకు గ్రేడులను నిర్ణయిస్తుంది. న్యాక్ బృందంలోని అధికారులు 17 నుంచి 19 వరకు యూనివర్సిటీలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో యూనివర్సిటీలో ప్రశాంత వాతావరణం ఉండేలాగా చూస్తున్నారు. యూనివర్సిటీ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా, అన్నీ హాస్టల్స్‌కు, పరిపాలన భవనాలకు, ఇతర వాటిని రంగులు వేయించి నీట్‌గా ఉండేలాగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గత నాలుగు రోజులు ప్రభుత్వ సెలవులు అయినప్పటికీ అధికారులు ఇతర సిబ్బంది న్యాక్ గుర్తింపు కోసం పనిచేస్తున్నారు.

గుర్తింపుతోనే ఎక్కువ నిధులు...

యూనివర్సిటీకి మంచి గ్రేడ్ వస్తే నిధులు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీకి ఏ ఫ్లస్‌ఫ్లస్ లేదా ఏ ఫ్లస్ గ్రేడ్ వచ్చేలాగా అధికారులు ప్రయత్నిస్తున్నారు. యూనివర్సిటీకి ఏ ఫ్లస్ గ్రేడ్ వస్తే రూసా నిధులు, యుజిసి గ్రాంట్లు, కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ నుంచి వచ్చే నిధులు పెరుగుతాయి. అంతే కాకుండా కేంద్రం ఇచ్చే పరిశోధక ఫెలో షిప్స్ సంఖ్య కూడా పెరుగుతుంది. ఈ నేపథ్యంలో యూనివర్సిటీకి మంచి గ్రేడ్ రావాలని అధికారులు, ఇతర సిబ్బంది కృతనిశ్చయంతో పనిచేస్తున్నారు.

న్యాక్ గుర్తింపు విధానం ఇలా....

న్యాక్ గుర్తింపులో ఏ, బి, సి, డి గ్రేడులను ఇస్తారు. వీటిలో ఏఫ్లస్‌ఫ్లస్, ఏ ఫ్లస్, ఏ, బి ఫ్లస్‌ఫ్లస్, బి ఫ్లస్, బి, సి గ్రేడ్‌లున్నాయి. డి గ్రేడ్ వస్తే వస్తే న్యాగ్ గుర్తింపు ఉండదు. న్యాక్ గుర్తింపు కోసం 1000 మార్కుల ప్రాతిపదికగా తీసుకుంటారు. వాటిలో బోధనా అంశాలకు 150, బోధన, అభ్యాసన, మూల్యాంకనానికి 200, పరిశోధన, ఆవిష్కరణకు 250, మౌలిక వసతులకు 100, విద్యార్థుల ప్రగతి 100, సుపరిపాలన, నాయకత్వ ప్రతిభకు 100 మార్కులు, విద్యాసంస్థలో విలువలు, అవార్డులకు 100 మార్కుల చొప్పన 1000 మార్కులకు న్యాక్ బృందం పరిశీలించనుంది. 1000 మార్కులను క్యుములేటీవ్ గ్రేడ్ పాయింట్ యావరేజ్(సీజీపీఏ)గా కుదించి గ్రేడ్‌ను కేటాయిస్తారు. 3.76 నుంచి 4 పాయింట్లు సాధిస్తే ఏఫ్లస్‌ఫ్లస్, 3.51 నుంచి 3.75 పాయింట్లు సాధిస్తే ఏ ఫ్లస్, 3.01 నుంచి 3.50 పాయింట్ల సాధిస్తే ఏ గ్రేడ్ వస్తుంది. 2.76 పాయింట్ల నుంచి 3. పాయింట్లు సాధిస్తే బి ఫ్లస్‌ఫ్లస్, 2.51 నుంచి 2.75 వరకు బి ఫ్లస్, 2.01 నుంచి 2.50 వరకు బి గ్రేడ్, 1.51 నుంచి 2.00 పాయింట్లు వస్తే సి గ్రేడ్, 1.51 అంతకంటే తక్కువ పాయింట్లు వస్తే డి గ్రేడ్‌ను కేటాయిస్తారు. డి గ్రేడ్ వస్తే న్యాక్ గుర్తింపు లేనట్టే.

ఇవీ సమస్యలు....

ఉస్మానియా యూనివర్సిటీ వందేళ్ల చరిత్ర ఉంది. కానీ అది చూసి న్యాక్ గుర్తింపును ఇవ్వదు. పురానత యూనివర్సిటీల్లో దేశంలోనే ఓయూ 7వ స్థానంలో ఉంది. యూనివర్సిటీలో ప్రస్తుతం పలు సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. యూనివర్సిటీలో బోధనా సిబ్బందిలో మంజూరు పోస్టుల్లో 60 శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. యూనివర్సిటీకి 1267 మంజూరు పోస్టులు ఉంటే వాటిలో ప్రస్తుతం 700 పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. వాటిలో కొన్ని పోస్టులను భర్తీ చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. త్వరలోనే ఆచార్యుల పోస్టులను భర్తీ చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1061 ఆచార్యుల పోస్టులను భర్తీ చేయనున్నారు. అందులో సుమారు 450 వరకు ఉస్మానియా యూనివర్సిటీలోని అధ్యాపక పోస్టులే ఉండటం గమనార్హం. యూనివర్సిటీలో కాంట్రాక్ట్ లెక్చరర్లు, గెస్టు లెక్చరర్లు పనిచేస్తున్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్లు గత 10 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. వారిని రెగ్యులరైజ్ చేయాలని లేని పక్షంలో సమాన పనికి సమానవేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మొన్నటి వరకు ఆందోళనలు చేశారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. వీటికి తోడు యూనివర్సిటీలో విద్యార్థి సంఘ ఎన్నికలను కూడా నిర్వహించడం లేదు. 1985 తరువాత యూనివర్సిటీలో విద్యార్థి సంఘం ఎన్నికలను నిషేధించారు.

ఒకే కాన్పులో నలుగురు జననం

ఎర్రుపాలెం, కెఎన్ఎన్ : ఖమ్మం జిల్లా, ఎర్రుపాలెం మండలంలోని మామునూరు గ్రామానికి చెందిన దంతాల భవానీకి ఒకే కాన్పులో నలుగురు పిల్లలకు జన్మనిచ్చింది. కృష్ణా జిల్లా, తిరువూరులోని కళ్యాణి నర్సింగ్ హోం ఆసుపత్రిలో ఆమె ప్రసవించింది. ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగబిడ్డ జన్మించారు. అయితే ముగ్గురు ఆడపిల్లలు మరణించగా, మగబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. భవానీ వెంట ఆయన భర్త రామక్రిష్ణఉన్నారు. దీంతో విషయం తెలుసుకున్న మామునూరు సర్పంచి గూడూరు రమణారెడ్డి, ఎంపీటీసీ మారాబత్తుల శారమ్మ, గ్రామస్థులు ఆసుపత్రి వద్దకు వెళ్లి పిల్లల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.



2345 పోస్టులకు టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్

(మొదటి పేజీ తరువాయి)

వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్టు కమిషన్ పేర్కొంది.

పోస్టుల వివరాలు

నోటిఫికేషన్‌నంబర్	కేటగిరి	పోస్టులు
40/2017	సివిల్ అసిస్టెంట్ సర్జన్స్, వైద్య విధాన పరిషత్	205
41/2017	డెంటల్ అసిస్టెంట్ సర్జన్స్, వైద్య విధాన పరిషత్	10
42/2017	ట్యూటర్స్ ఇన్ డిఎంఈ	65
43/2017	రేడియోలాజికల్ లెక్చరర్స్ ఇన్ డిఎంఈ	06
44/2017	సివిల్ అసిస్టెంట్ సర్జన్ ఇన్ , ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్	43
45/2017	అసిస్టెంట్ ఫిజియోథెరపిస్ట్, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్	02
46/2017	ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్	67
47/2017	ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్	90
48/2017	ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్	1857

ఆర్టీసీలో నియామకాలు అవాస్తవం



•2011 తర్వాత రిక్రూట్‌మెంట్ జరగలేదు •సర్వీస్ క్రమబద్దీకరణ కొత్త ఉద్యోగం కాదు •సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా ఆందోళన •ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఆర్టీసీలో 3950 నియామకాలు జరిగాయని ప్రభుత్వం చేసిన ప్రకటనతో కార్మిక సంఘాలు తీవ్రంగా విభేదిస్తున్నాయి. 2011 తర్వాత ఆర్టీసీలో ప్రత్యక్ష నియామకాలు పూర్తిగా నిలిచిపోయాయని పేర్కొన్నాయి. 2015 మే లో జరిగిన సమ్మె అనంతరం అప్పటికే కాంట్రాక్టు డ్రైవర్, కండక్టర్లుగా పని చేస్తున్న వారి సర్వీసులను ప్రభుత్వ ఆదేశాల మేరకు క్రమబద్దీకరించడం జరిగిందని తెలిపాయి. సర్వీసుల క్రమబద్దీకరణ కొత్త నియామకాలు కాబోవని, అప్పటికే వారంతా ఆర్టీసీ సేవలో ఉన్నారని వివరించాయి. 2011 నుండి ఇప్పటి వరకు ఆర్టీసీలో ప్రత్యక్షనియామకాలు జరగలేదని, ఉద్యోగ విరమణ చేసిన వారి స్థానంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్దతిలో బయటి వారి సేవలను పొందడం జరుగుతుందని ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, ఎన్ఎంయూ ప్రధాన కార్యదర్శి హన్మంతు పేర్కొన్నారు. తెరాస ప్రభుత్వ హయాంలో ఒక్క ఉద్యోగం కూడా భర్తీ కాలేదని వెల్లడించారు. ఆర్టీసీలో గత కొంత కాలంగా అద్దె బస్సులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్‌లతోనే కాలం గడుపుతూ సంస్థను బలహీనపరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొంత మంది ఆర్టీసీ డ్రైవర్లను అగ్నిమాపక శాఖకు పంపించిన సంఘటనలను విస్మరించబోమన్నారు. ఆర్టీసీలో అద్దె బస్సులు పెరిగి, సొంత బస్సుల సంఖ్య తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది సంఖ్య కూడా 56 వేల నుండి 53 వేలకు తగ్గిందన్నారు. తెరాస ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 1400 అద్దె బస్సులను అదనంగా తీసుకున్నారని తెలిపారు. అక్రమ రవాణాను అడ్డుకోవడం లేదు. అదనంగా ఆరెంజ్ బస్సుల అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్నారు అని రాజిరెడ్డి ఆరోపించారు. గత కొంత కాలంగా సిబ్బందిపై పని భారం పెరుగుతుందని, పదోన్నతులు కల్పించడం లేదని, క్రమంగా ఆర్టీసీ క్షీణించడం జరుగుతుందని తెలిపారు. కారుణ్య నియామకాల కింద సుమారు 400ల మందిని నియమించడం తప్ప కొత్తగా నియామకాలు జరపలేదన్నారు. వేతన సవరణ తక్షణం జరపాలని, 62 శాతం ఫిట్‌మెంట్ అమలు జరపాలని,30 శాతం మేరకు తాత్కాలిక బృతి అందచేయాలని, అనుబంధ విభాగాల మూసి వేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, అన్ని ఖాళీలను రెగ్యూలర్ ప్రాతిపదికన భర్తీ చేయాలని, అర్హత గల వారందరికీ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ 16వ తేదీన అన్ని డిపోల ఎదుట ధర్నాలు, 26న సామూహిక నిరాహార దీక్షలు, 29న ఛలో రీజినల్ మేనేజర్ కార్యాలయం కార్యక్రమాలను నిర్వహించబోతున్నామని ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి తెలిపారు.

మెడికో ఆత్మహత్య

ముథోల్, కెఎన్ఎన్ : నిర్మల్ జిల్లా, ముథోల్ మండల కేంద్రంలోని మహాలక్ష్మీ కాలనీకి చెందిన డీ కవిత (26) అనే ఎంబీబీఎస్ విద్యార్థిని మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కవిత హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కాలేజీలో మత్తు డాక్టర్‌గా చదువుతుంది. ఇటీవలే ఇంటికి వచ్చిన కవిత ఎవరూ లేని సమయంలో మత్తు ఇంజక్షన్ తీసుకుంది. గమనించిన కుటుంబీకులు హుటాహుటిన భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు కవిత అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు.

డ్రగ్స్ కేసులో పోలీసులు బిజీబిజీ

•వీసా గడువు ముగిసిన నైజీరియన్ల గుర్తింపు •స్వస్థలాలకు తరలింపు • కేసులో ప్రమేయం ఉంటే అరెస్టులు



ఫైల్ ఫొటో

హైదరాబాద్, ఆంధ్రప్రభ : డ్రగ్స్ మూలాల ఛేదనలో పోలీసులు బిజీబిజీగా ఉన్నారు. వీసా గడువు ముగిసిన నైజీరియన్ల గుర్తించి స్వస్థలాలకు తరలిస్తున్నారు. ఒకవేళ డ్రగ్స్ కేసులో ప్రమేయం ఉంటే అరెస్ట్ చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా సంచలనం రేపిన డ్రగ్స్ కేసులో మూలాలు కదులుతున్నాయి. ఈ దిశగా చర్యలు ఇప్పటికే ముమ్మరమయ్యాయి. కొందరు నైజీ రియన్లు ఈ డ్రగ్స్ దందాలో కీలక భూమిక పోషిస్తున్నారని పోలీసులు గుర్తించారు. ఇటీవల కొందరు నైజీరియన్లతో పట్టుబడ్డ విజయవాడకు చెందిన లేడీ డాన్ సంగీత వెల్లడించిన వివరాల ఆధారంగా డ్రగ్స్ సరఫరాలో నైజీరియన్ల పాత్రే కీలక మని పోలీసులు గుర్తించారు. డ్రగ్స్ కేసులో పట్టుబడ్డ వివిధ డ్రగ్స్ మాఫియాలతో కొందరు నైజీరియన్లకు సత్సంబంధాలు ఉన్నాయని సైతం పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. కాగా, వీసా గడువు ముగిసి వున్న నైజీరియన్లను తక్షణమే హైదరాబాద్ విడిచి వారి స్వస్థలాలకు వెళ్లే విధంగా పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. లేడీ డాన్ సంగీత ఇచ్చిన సమాచారంతోనే నైజీరియన్‌కు చెందిన గాబ్రియేల్ పోలీసులకు చిక్కాడు. గాబ్రియేల్ ఆరుగురు వ్యక్తులకు డ్రగ్స్ విక్రయించగా..ఆ ఆరుగురు వద్దనుంచి పోలీ సులు రక్త నమూనాలు, గోళ్లు, వెంట్రుకలు సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపగా వారంతా డ్రగ్స్ తీసుకున్నట్లు వెల్లడైంది. ఆ ఆరుగురిలో ఒకరైన పవన్‌కుమార్‌రెడ్డిని డ్రగ్స్ సరఫరాదారుడిగా పోలీసులు ఆనక గుర్తించారు. దీంతో, పవన్‌కుమార్‌రెడ్డిని పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. మరోవైపు పోలీసులు గాబ్రియేల్, సంగీతలిచ్చిన సమాచారంతో తాజాగా పోలీసులు అరెస్టు చేసిన ముగ్గురి ముఠాలో నవ్యంత్ ఇంజి నీరింగ్ డ్రాపౌట్‌గా పోలీసులు గుర్తించారు. ఇంజినీరింగ్ చదువుతున్న సమ యంలోనే డ్రగ్స్‌కు బానిసయ్యాడు నవ్యంత్. అదే సమయంలో డీజే అంకిత్ పాండే నవ్యంత్‌కు పరిచయమయ్యాడు. అతడి ద్వారా గాబ్రియేల్‌తో స్నేహం చేసి థాయి లాండ్ ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా డ్రగ్స్ కొనుగోలు చేశాడు. గోవాలో పెద్ద రేవ్‌పార్టీ నిర్వహిస్తున్నామని, రావాలని నవ్యంత్‌కు కెల్విన్ సమాచార మిచ్చాడు. ఇంతలో కాల్విన్ అరెస్టు కావడంతో నవ్యంత్ గోవా పారిపోయాడు. నవ్యంత్‌ను తాజాగా పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా, నవ్యంత్ ఫోన్‌లో 50 మంది మహిళల నంబర్లు ఉన్నట్లు పోలీసులు కను గొన్నారు. పట్టుబడ్డ డ్రగ్స్ మాఫియాలకు కొందరు నైజీరియన్లకు ఉన్న సంబంధాలు వెలుగుచూశాయి. దీంతో పోలీసులు, ఇమ్మిగ్రేషన్ అధికారులు కలిసి నగరంలోని పలు ప్రాంతాలలో వీసాలు గడువు ముగిసినా ఇక్కడే తిష్టవేసి వున్న సోమాలియా, నైజీరియన్ దేశస్తులను గుర్తించేందుకు కార్డాన్ సెర్చ్ చేపట్టారు. మొత్తం 10 మంది నైజీరియన్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలా ఉండగా, ట్రై కమిష నరేట్ పరిధిలో మొత్తంగా 6 వేల మంది నైజీరియన్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కాగా, సైబరాబాద్, రాచకొండ పరి ధిలోనే మొత్తం 4000 మంది నైజీరియన్లు ఉన్నట్లు పోలీసులు ఓ నిర్ధారణకు వచ్చి నట్లు తెలుస్తోంది.

Cigniti

సిగ్నిటీ టెక్నాలజీస్ లిమిటెడ్

106 - 107, ఎంజిఆర్ ఎస్టేట్స్, ద్వారకాపురి కాలనీ, పంజాగుట్ట, హైదరాబాద్-500 082.

ప్రకటన

సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ & డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్ 2015 యొక్క రెగ్యులేషన్ 47 (1) (ఎ) అనుసరించి ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా 30.06.2017తో ముగిసిన త్రైమాసిక కాలం కొరకు ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాలను పరిశీలించుటకు మరియు ఆమోదించుటకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు సమావేశం **గురువారం 24వ రోజు ఆగస్టు, 2017**న మ॥1.00గం॥లకు 6వ అంతస్తు, ఓరియన్ బ్లాక్, "The V" (Ascendas), ప్లాట్ నెం. # 17, సాఫ్ట్‌వేర్ యూనిట్స్ లేఔట్, మాదాపూర్, హైదరాబాద్-500081, తెలంగాణ, ఇండియా వద్ద ఉన్న కంపెనీ యొక్క కార్పొరేట్ కార్యాలయం వద్ద జరగనున్నది.

సిగ్నిటీ టెక్నాలజీస్ లిమిటెడ్ తరఫున
సం/-
సి.వి.సుబ్రమణ్యం
ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్
(డిఐఎన్ : 00071378)

ప్రదేశం: హైదరాబాద్
తేది : 14.08.2017

B2B Software Technologies Limited

6-3-1112, 3rd & 4th Floor, AVR Tower, Begumpet, Hyderabad - 500 016
Phone: 040-23372522. Fax: 040-23322385. Email: Investorservice@b2bsoftech.com
CIN: L72200TG1994PLC018351, Website: www.b2bsoftech.com

జూన్ 30, 2017తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాలు (స్టాండ్‌అలోన్)

(రూ.లక్షల్లో)

వివరాలు	ముగిసిన త్రైమాసికం			ముగిసిన సంవత్సరం
	30.06.2017	31.03.2017	30.06.2016	31.03.2017
కార్యకలాపాల నుండి మొత్తం ఆదాయం	205.77	182.29	181.84	665.49
నికర లాభం / (నష్టం) కాలానికి (పన్ను మరియు మినహాయింపదగిన ఐటంలకు ముందు)	47.07	20.21	38.99	117.92
నికర లాభం / (నష్టం) కాలానికి పన్నుకు ముందు (మినహాయింపదగిన ఐటంలకు తరువాత)	47.07	20.21	38.99	117.92
నికర లాభం / (నష్టం) కాలానికి పన్ను తరువాత (మినహాయింపదగిన ఐటంలకు తరువాత)	34.11	20.21	38.99	117.92
కాలానికి మొత్తం సమగ్ర ఆదాయం (లాభం/(నష్టం) కాలానికి (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తరువాత) చేరి యున్నది)	34.11	20.21	38.99	117.92
చెల్లించిన ఈక్విటీ వాటా మూలధనం (ముఖ విలువ రూ.10/- చొప్పున)	1,158.54	1,158.54	1,158.54	1,158.54
ఇతర ఈక్విటీ (రీవాల్యుయేషన్ రిజర్వులు మినహా) గత సంవత్సరపు ఆడిట్ అప్పుల పట్టీలో చూపబడిన విధంగా)	-	-	-	(404.17)
ప్రతి వాటా బేసిక్ మరియు డైల్యూటెడ్ ఆర్జనలు (రూ.10/- చొప్పున)	0.29	0.17	0.34	1.02

పై వివరాలు సెబీ (లిస్టింగ్ మరియు ఇతర డిస్‌క్లోజర్ ఆవశ్యకతలు) రెగ్యులేషన్స్ - 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్స్ఛేంజ్‌తో దాఖలుపర్చిన త్రైమాసిక ఆర్థిక ఫలితాల వివరణాత్మక నమూనా యొక్క సారాంశం. త్రైమాసిక ఆర్థిక ఫలితాల యొక్క పూర్తి నమూనా స్టాక్ ఎక్స్ఛేంజ్ www.bseindia.com వెబ్‌సైట్‌పై లభిస్తుంది. కంపెనీ యొక్క వెబ్‌సైట్ www.b2bsoftech.com లో ఫలితాలు ఉంచబడినవి.

By Order of the Board of Directors
V Bala Subramanyam, Executive Director
DIN: 06399503


Place: Hyderabad
Date:14th August, 2017

Andhraprabha business 2017

బిజినెస్

టీఎస్‌ట్రాన్స్‌కో మొబైల్ అప్లికేషన్ తెలంగాణ విద్యుత్‌శక్తి యాప్

హైదరాబాద్ : టీఎస్ ట్రాన్స్‌కో అంతర్గతంగా మొబైల్ అప్లికేషన్.. తెలంగాణ విద్యుత్ శక్తి ని అభివృద్ధి చేసింది. ఆండ్రియాడ్, ఐఓస్ ఆధారిత మొబైల్ ఫోన్‌లలో ద్వారా వినియోగించుకోవచ్చు. టీఎస్‌ట్రాన్స్‌ఓ సీఎండీ డి ప్రభాకర్‌రావు నేతృత్వంలో కొత్త అప్లికేషన్ రూపుదిద్దారు. తెలంగాణ విద్యుత్ శక్తి అప్లికేషన్ ఫీచర్లు ఇలా ఉన్నాయి. (1) రియల్ టైం పవర్‌డిమాండ్ (మెగావాట్లు) తెలంగాణ రాష్ట్రంతో పాటు, విద్యుత్ వినియోగించిన రోజు గరిష్ఠంగా ఎంత డిమాండ్ ఉందో ఇట్టే తెలిసిపోతోంది. (2) డిస్కం, జిల్లా ప్రాతిపదికన విద్యుత్ డిమాండ్ ఎంతో ఇట్టే తెలుసుకోవచ్చు (మెగావాట్ల)లో (3) విద్యుత్ డిమాండ్ రాష్ట్రంలో డిస్కం, జిల్లాలో గత ఏడాది క్రితం రోజు ఎంత విద్యుత్ డిమాండ్ ఉందో తెలుసుకోవచ్చు. ఈ కొత్త అప్లికేషన్‌ను ప్రపంచంలోని మారుమూల ప్రాంతంలో కూర్చొని సమాచారం తెలుసుకోవచ్చు. తెలంగాణలో ఎంత విద్యుత్ డిమాండ్ ఉందో తేలిగ్గా తెలుసుకోవచ్చు. దీనికి యూజర్ చేయాల్సింది గూగుల్ ప్లేస్టోర్‌కు వెళ్లి మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడమేనని ట్రాన్స్ మిషన్‌కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ఒక ప్రకటనలో తెలిపింది.



స్టాక్ మార్కెట్ల దుర్వినియోగానికి చెల్లుచీటీ

•మనీలాండరర్స్ ఇక కష్టకాలమే •మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి వార్షిక నివేదికలో వెల్లడి...

న్యూఢిల్లీ : ఇటీవల కాలంలో మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి తీసుకున్న కొన్ని కఠిన నిర్ణయాలు డొల్ల కంపెనీల యాజమానులకు, అనుమానిత బ్రోకర్లకు నిద్రపట్టకుండా చేస్తోంది. తాజాగా సెబి ఇక నుంచి స్టాక్‌మార్కెట్ల దుర్వినియోగానికి అనుమతించమని స్పష్టం చేసింది. స్టాక్ మార్కెట్లోకి మనీలాండరింగ్ డబ్బుతో పాటు నల్లధనాన్ని అనుమతించమని, గట్టి నిఘా పెడతామని పేర్కొంది.

సెబి దేశీయ దర్యాప్తు బృందాలతో పాటు విదేశాల్లో ఉన్న దర్యాప్తు బృందాల సహకారం తీసుకుని స్టాక్ మార్కెట్లో నల్లధనం రాకుండా నిరోధిస్తాయని తెలిపింది. తాజా వార్షిక నివేదికలో ఇటీవల సెబి చేపట్టిన దర్యాప్తు వివరాలను తెలియజేసింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో కేసుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపింది. దీనికి కారణం ఆదాయపు పన్నుశాఖ నుంచి కొంత సమాచారం లభించిందని తెలిపింది. కొన్ని షేర్లలో దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్స్/ స్వల్పకాలిక క్యాపిటల్ నష్టం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆయా కంపెనీల దర్యాప్తు చేపట్టడం జరిగిందని పేర్కొంది.



గత ఆర్థిక సంవత్సరం అంటే 2016-17లో కొత్తగా 245 కేసులను చేపట్టడం జరిగిందని, వాటిలో 155 కేసులను పూర్తి చేయడం జరిగిందని తెలిపింది. అంతకు ముందు ఆర్థికసంవత్సరం అంటే 2015-16తో పోల్చుకుంటే మొత్తం 133 కొత్త కేసులను చేపడితే వాటిలో 123 కేసులను పూర్తి చేయడం జరిగిందని వివరించింది. కేసుల విచారణకు అత్యంత నైపుణ్యం కలిగిన సాంకేతికపరిజ్ఞానాన్ని వాడుకుంటున్నామని.. దీంతో పాటు కొత్తగా వచ్చిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతో పాటు విచారణ టూల్స్‌ను విరివిగా వినియోగించామని తెలిపింది.

గత ఏడాది మార్కెట్లపై నిఘాను పెంచడం జరిగిందని, దీంతో పాటు స్టాక్ ఎక్స్ఛేంజీలతో పాటు డిపాజిటరీలతో తరచూ సమావేశాలు ఏర్పాటు చేసి మార్కెట్లో జరుగుతున్న పరిణామాలపై దృష్టి పెడుతున్నట్లు పేర్కొంది. అదే సమయంలో బలహీనంగా ఉంటే కంపెనీల షేర్లు ధరలు అమాంతంగా ధరలు పెరిగితే దానిపై చర్యలు తీసుకున్నామని, ఒక వేళ స్టాక్ ఎక్స్ఛేంజీని దుర్వినియోగం చేసుకొని పన్ను ఎగ్గొట్టాలనుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎప్పటికప్పుడూ నిఘా పెంచడంతో పాటు అనుమానిత బ్రోకర్లు, డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌పై దృష్టి పెడతామని వెల్లడించింది. అలాగే ఇటీవల కాలంలో పెద్దమొత్తంలో ఇన్వెస్టర్లకు మోసపూరిత ఎస్ఎంఎస్‌లు పంపే వారిపై కూడా చర్యలు తీసుకున్నామని, అలాగే డిపాజిటరీ అలర్ట్ సిస్టమ్‌ను మరింత బలోపేతం చేశామని పేర్కొంది.

ఒక కేసులో కంపెనీకి చెందిన క్లయింట్ తరపున ఒక టెలీమార్కెటర్ బల్క్ ఎస్ఎంఎస్‌ల ద్వారా కంపెనీకి వ్యతిరేకంగా తప్పుడు సమాచారం అందించారని, దీనికి గాను క్లయింట్ నుంచి టెలిమార్కెటలర్ డబ్బు వసూలు చేశారని, ఇలాంటి వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. లిస్టెడ్ కంపెనీలపై వస్తున్న పుకార్లపై కూడా వివరణ అడిగినట్లు తెలిపింది.



ఖాతాపుస్తకాలతో పాటు రికార్డులు, ఇతర డాక్యుమెంట్లను పరిశీలించడం జరగుతోందని, ఉదాహరణకు వెంచర్ క్యాపిటల్ ఫండ్స్, పోర్టుపోలియో మేనేజర్స్, మ్యూచువల్‌ఫండ్స్, ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్స్‌ల కూడా తరచూ పరిశీలించడం జరుగుతుందని తెలిపింది. యాంటీ మనీ లాండరింగ్, ఫైనాన్సింగ్ టెర్రరిజం, కెవైసీ నిబంధనలను తరచూ గమనిస్తుంటామని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల ఆర్థిక వ్యవస్థలోకి మనీలాండరింగ్ జాడ్యం వెంటాడుతోందని, అదే సమయంలో టెర్రరిస్టు ఫైనాన్స్ ఇటీవల కాలంలో బాగా పెరిగిపోయిందని,, ఇది రాజకీయగా, ఆర్థికంగా దేశానికి పెద్ద దెబ్బ అని తెలిపింది. గతంతో పాటు 2016-17 ఆర్థిక సంవత్సరంలోనూ సెబి స్టాక్ మార్కెట్లో మనీలాండరింగ్ డబ్బుతో పాటు టెర్రరిస్టు ఫైనాన్సింగ్‌ను అడ్డుకోవడానికి నిబంధనలు కఠినతరం చేసిందని వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరంలో స్టాక్ బ్రోకర్ల నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని పరీక్షలు చేపట్టింది. ఇప్పటి వరకు నిబంధనలు పాటించని కంపెనీలపై బీఎస్ఈ 195 కంపెనీల చర్యలు తీసుకుందని, సీడీఎస్ఎల్ 236, ఎంసీఎక్స్ 59, ఎన్ఎస్ఈ 27 సంస్థలపై చర్యలు తీసుకుందని సెబి తెలిపింది. అలాగే బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు వరుసగా 152, 24 కంపెనీలకు హెచ్చరిక నోటీసులు జారీ చేసిందని పేర్కొంది.

డొల్ల కంపెనీలపై సెబి అతి చేసింది: మార్కెట్ నియంత్రణా సంస్థ సెబి డొల్ల కంపెనీలపై అతి చేసిందని.. ఆ కంపెనీలు తమ వాదను వినిపించుకునేందుకు అవకాశం కూడా ఇవ్వకుండా ట్రేడింగ్ నిషేధించిందని ఆర్థికమంత్రిత్వశాఖలో కీలక అధికారి ఒకరు చెప్పారు. వాటిలో కొన్ని డొల్ల కంపెనీలు ఉండవచ్చునని, అయితే ట్రేడింగ్ రద్దు చేసిన కంపెనీలకు తమ వాదన వినిపించుకునే అవకాశం ఇవ్వాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కంపెనీలపై దివాలాచట్టం అమలు చేసి ఉండవచ్చు కానీ.. అవన్నీ డొల్ల కంపెనీలని చెప్పలేం కదా అని ఆయన ప్రశ్నించారు. ఇదిలా ఉండగా గత సోమవారం నాడు సెబి తక్షణమే 331 కంపెనీల షేర్ల ట్రేడింగ్‌ను రద్దు చేయాలని స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది.

డొల్ల కంపెనీలు అంటే ఎలాంటి వ్యాపార లావాదేవీలుకానీ ఆస్తులు కానీ లేకుండా ఉండే కంపెనీగా చెప్పవచ్చు. సెబి విడుదల చేసిన జాబితాలో కొన్ని వ్యాపారాలు చేస్తున్నాయి. కనీసం ఐదు కంపెనీల మార్కెట్ క్యాపిటల్ చెరో కంపెనీది రూ.500 కోట్ల వరకు ఉంటుందని ఆయన అన్నారు. ఈ కంపెనీలపై నెలకు ఒకసారి ట్రేడింగ్‌కు అనుమతిస్తున్నారని ఆయన అన్నారు. డొల్ల కంపెనీలు బ్యాలెన్స్‌షీట్లను విడుదల చేస్తాయి కానీ ఎలాంటి వ్యాపార లావాదేవీలు నిర్వహించవని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా సెక్యూరిటి అప్పిలేట్ ట్రిబ్యునల్ సెబి ఆర్డర్‌పై ఎనిమిది కంపెనీలపై స్టే ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు.

రిలయన్స్, బీపీలకు రూ.1700 కోట్ల జరిమానా ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోకపోవడమే

న్యూఢిల్లీ : కేంద్రప్రభుత్వం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, దాని భాగస్వామి బ్రిటిష్ పెట్రోలియంపై 264 మిలియన్ డాలర్లులేదా రూ.1700 కోట్లు జరిమానా విధించింది. దీనికి కారణం 2015-16లో కేజీ డీ6 చమురు క్షేత్రం నుంచి ప్రభుత్వానికి హామీ ఇచ్చిన విధంగా చమురు సహజవాయువును ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోకపోవడమే. తాజా జరిమానాతో కలుపుకుంటే గత ఆరు సంవత్సరాల నుంచి అంటే ఏప్రిల్ 1, 2010 నుంచి 3020 కోట్ల డాలర్లను చెల్లించాల్సి ఉంటుందని చమురుమంత్రిత్వశాఖ అధికారి ఒకరు తెలియజేశారు. ప్రొడక్షన్ షేరింగ్ కాంట్రాక్టు (పీఎస్‌సీ) ప్రకారం రిలయన్స్ ఇండస్ట్రీస్ దాని భాగస్వాములు బీపీ పీఎల్‌సీ, కెనెడాకు చెందిన నైకో రిసోర్సెస్‌లు సహజవాయువు విక్రయించిన తర్వాత మూలధనం, నిర్వహణా ఖర్చులు తీసేసుకుంటాయి. దాని కంటే ముందు గ్యాస్ అమ్మకం ద్వారా వచ్చే లాభాలను ప్రభుత్వంతో పంచుకుంటాయి. ఒక వేళ పైన తెలిపిన కంపెనీలు తమ ఖర్చులు వెనక్కి తీసుకోకపోతే ప్రభుత్వానికి లాభాల వాటా పెరుగుతుంది. ప్రభుత్వానికి సుమారు 175 మిలియన్ డాలర్ల వరకు లాభాల వాటా కింద రావాల్సిఉందని ప్రభుత్వం చెబుతోంది. కేజీ-6 బ్లాక్‌లోని ధీరూబాయి -1,3 చమురు క్షేత్రం నుంచి రోజుకు 80 మిలియన్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల సహజవాయువు ఉత్పత్తి చేయాల్సి ఉండగా.. 2011-12లో వాస్తవానికి కేవలం 35.33 ఎంఎంఎస్‌సీఎండీ మాత్రమే ఉత్పత్తి చేయగలిగింది. అటు తర్వాత 2012-13లో 20.88 ఎంఎంఎస్‌సీఎండీ, 2013-14లో 9.77 ఎంఎంఎస్‌సీఎండీ ఉత్పత్తి జరిగింది. అటు నుంచి క్రమంగా ఉత్పత్తి తగ్గుముఖం పడుతూ 4 ఎంఎంఎస్‌సీఎండీకి దిగిపోయింది. జరిమానాపై రిల్, బీపీలను ప్రశ్నించగా వాటి నుంచి సమాధానంలేదు. రెండు కంపెనీలు గతంలోనే అంతర్జాతీయ అర్బిట్రేషన్ ముందు కాస్ట్ డిస్ అలవెన్స్‌పై సవాలు చేశాయి. ఇదిలా ఉండగా ప్రభుత్వం 2010-11 457 మిలియన్ డాలర్లు, 2011-12లో 548 మిలియన్ డాలర్లు,2012-13లో 792 మిలియన్ డాలర్లు 2013-14లో 579 మిలియన్ డాలర్లు, 2014-15లో 380 మిలియన్ డాలర్లు చెల్లించాలని కోరింది. తాజాగా 264 మిలియన్ డాలర్లు జరిమానా రుద్దింది. 2015-16లో అనుకున్న లక్ష్యంగా ఉత్పత్తి చేయనందుకు ఈ డబ్బు కట్టాల్సిందేనని చెబుతుండగా.. కంపెనీలు మాత్రం 2016-17 జరిగే ఉత్పత్‌పై వచ్చే సంవత్సరం నుంచి లెక్కగట్టి జరిమానా విధించుకోవచ్చునని చెబుతున్నాయని అధికారులు తెలియజేశారు.

మారుతి సీఈవో వేతనం రూ.4.2 కోట్లు

న్యూఢిల్లీ : మారుతి సుజుకి ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో కెనీచి అయుకావా గత ఆర్థిక సంవత్సరం మొత్తం రూ.4.2 కోట్లు వేతనం తీసుకున్నారు. అంతకు క్రితం ఏడాదితో పోల్చుకుంటే ఆయన వేతనం 6.32 శాతం పెరిగింది. కంపెనీ వార్షిక నివేదిక ప్రకారం చూస్తే అయుకావా మొత్తం రూ.4,20,67,808 కోట్ల వేతనం పొందారు. వాటిలో బోనస్ రూ.1,50,39,000 కోట్లుగా ఉంది. అదే 2015-16 ఆర్థికసంవత్సరంలో ఆయన మొత్తం వేతనం రూ.3,95,44,573 కాగా, దాంట్లోనే బోనస్ రూ.1,27,45,000 కోట్లు కూడా కలుపుకొని ఉంది. కంపెనీలో కీలకమైన వ్యక్తుల్లో చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆర్‌సీ భార్గవ గత ఆర్థిక సంవత్సరం రూ.99 లక్షలు వేతనం తీసుకున్నారు. వాటిలో రూ.91.5 లక్షల కమిషన్ రూ.7.5 లక్షలు బోర్డు సమావేశాల్లో పాల్గొన్నందుకు రుసుముగా లభించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఆయన వేతనం రూ.87.5 లక్షలు కాగా .. కమిషన్ రూ.77.5 లక్షలు, బోర్డు సమావేశాలకు హాజరైనందుకు రూ.10 లక్షలు రుసుముగా లభించింది.

జీవిత బీమా ప్రీమియం రూ.20,428 కోట్లు

• జులైలో ఏకంగా 47 శాతం వృద్ధి


న్యూఢిల్లీ : జీవిత బీమా కంపెనీల కొత్త వ్యాపార ప్రీమియంలు జులై నెలలో ఏకంగా 47.4 శాతం పెరిగి రూ.20,427.68 కోట్లకు చేరాయని బీమా నియంత్రణా సంస్థ ఐఆర్‌డీఐ తాజా గణాంకాలను బట్టి తెలుస్తోంది. దేశంలో మొత్తం 24 జీవిత బీమా కంపెనీలున్నాయి. క్రితం ఏడాది ఇదే జులై నెలలో రూ.13,854.44 కోట్లు ఆర్జించాయి. దేశంలోనే అతి పెద్ద జీవిత బీమా కంపెనీ(ఎల్ఐసీ) ప్రీమియం గత నెలలో ఏకంగా 51.4 శాతం పెరిగి రూ.16,254.91 కోట్లకు చేరింది. అంతకు ముందు జులై 2016లో రూ.10,737.92 కోట్లుగా ఉంది. మిగిలిన 23 బీమా కంపెనీల మొత్తం వ్యాపారం జులై నెలలో 34 శాతం పెరిగి రూ.4,172.76 కోట్లకు ఎగబాకింది. క్రితం ఏడాది ఇదే నెలలో రూ.3,116.52 కోట్లని ఐఆర్‌డీఐ తెలిపింది. వివరాల్లోకి వెళితే ఎస్‌బీఐ లైఫ్ ప్రీమియం 25.3 శాతం పెరిగి రూ.847.91 కోట్లు, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ కొత్త ప్రీమియం ఆదాయం రూ.759.08 కోట్లు, 2016 జులైతో పోల్చుకుంటే 34.2 శాతం పెరిగింది. హెచ్‌డీఎఫ్‌సీ స్టాండర్డ్ లైఫ్ ప్రీమియం 68.8శాతం పెరిగి రూ.880.29 కోట్లు కాగా అంతకు క్రితం ఏడాది రూ.521.43 కోట్లు, బిర్లా సన్ లైఫ్



ప్రీమియం ఆదాయంలో 57.2శాతం పెరిగి రూ.195.61 కోట్లు కాగా, కెనెరా హెచ్ఎస్‌బీసీ ఓబీసీ లైఫ్ రూ.99.57 కోట్లు కాగా.. క్రితం ఏడాదితో పోల్చుకుంటే 75 శాతం పెరిగింది. సహారా లైఫ్ ప్రీమియం లో ఎలాంటి మార్పు లేదు. జులై 2016లో సాధించిన రూ.2.27 కోట్ల ఆదాయమే ఈ ఏడాది కూడా కొనసాగింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జులై కాలానికి చూస్తే జీవిత బీమా కంపెనీల మొత్తం ప్రీమియం వసూళ్లు 18 శాతం పెరిగి రూ.53,659.66 కోట్లకు చేరుకోగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.45,247 కోట్లు నమోదైందని ఐఆర్‌డీఐ విడుదల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తోంది.

పీఎస్‌యు బ్యాంకులకు ఉద్దేశపూర్వక ఎగవేతదారుల బకాయి రూ.92వేల కోట్లు

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులకు చెల్లించాల్సిన బకాయిలదారుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతోంది. ఈ ఏడాది మార్చి చివరి నాటికి వీరి సంఖ్య 20 శాతం పెరిగి 9,000కు చేరుకుంది. వీరంతా ప్రభుత్వరంగానికి చెందిన బ్యాంకులకు 2016-17 చివరి నాటికి రూ.92,376 కోట్లు చెల్లించాల్సి ఉంది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం చివరి నాటికి రూ.76,658 కోట్లు బకాయి పడ్డారు. ఈ లెక్కన చూస్తే 20.4 శాతం పెరిగింది. సంవత్సరం ప్రాతిపదికన చూస్తే



ఏడాదికేడాది ఉద్దేశపూర్వక ఎగవేత దారుల సంఖ్య పదిశాతం చొప్పున పెరుగుతూ పోతోంది. ఈ ఏడాది మార్చి చివరి నాటికి ఉద్దేశపూర్వక ఎగవేతదారుల సంఖ్య 8,915 కాగా అంతకు ముందు ఏడాది 8,167గా ఉందని ఆర్థికమంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తోంది.

మొత్తం 8,915 ఉద్దేశపూర్వక ఎగవేతదారుల్లో 1914 కేసుల్లో బ్యాంకులు ఎఫ్ఐఆర్ కూడా దాఖలుచేశాయి. వీరి బకాయి రూ.32,484 కోట్లుగా తేలింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 27 ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకులు వాటిలో ఎస్‌బీఐ.. దాని అనుబంధ బ్యాంకులు కూడా కలుపుకుంటే రూ.81,683 కోట్లు రైటాఫ్ చేశాయి. గత ఐదు ఆర్థిక సంవత్సరాలతో పోల్చుకుంటే ఇదే అత్యధికం. అంతకు ముందు ఆర్థికసంవత్సరంలో పోల్చుకుంటే 41 శాతం అధికం. ఎస్‌బీఐ దాని అనుబంధ బ్యాంకులే 2016-17లో ఎన్‌పీఏ కింద ఏకంగా రూ.27,574 కోట్లు రైటాఫ్ (మాఫీ) చేశాయి. ఇదిలా ఉండగా ఎస్‌బీఐ ఈ ఏడాది ఏప్రిల్‌లో ఐదు అనుబంధం బ్యాంకులను విలీనం చేసుకున్న విషయం తెలిసిందే. మార్చి 2017 చివరి నాటికి ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకుల్లో మొండి బకాయిలు రూ.6.41 లక్షల కోట్లకు పేరుకుపోయాయి. అంతకు ముందు ఏడాది ఇదేకాలంలో ఇవి రూ.5.02 లక్షల కోట్లుగా తేలాయి. బ్యాంకుల్లో మొండిబకాయిలు పేరుకుపోవడంతో రిజర్వు బ్యాంకు నిబంధనలు కఠినతరం చేశాయి. డిఫాల్ట్ కంపెనీ ప్రమోటర్ హోల్‌టైం డైరెక్టర్ కాకపోయినా.. బాధ్యతల నుంచి తప్పించుకోకుండా కట్టుదిట్టమైన నిబంధనలను తీసుకొచ్చింది.

గతంలో గైడ్‌లైన్స్ ప్రకారం కంపెనీ నాన్ హోల్‌టైం డైరెక్టర్‌ను బ్యాంకులు ఉద్దేశపూర్వక ఎగవేతదారునిగా ప్రకటించడానికి వీల్లేకుండా ఉండేది. ఉద్దేశపూర్వక ఎగవేతదారునిగా ప్రకటించాలంటే దానికి తగ్గట్లు గట్టి సాక్ష్యాలు చూపించాల్సిఉంటుంది. ఉద్దేశపూర్వక ఎగవేతదారునిగా ముద్ర వేయడానికి కొన్ని కారణాలు చూపించాల్సి ఉంటుంది. వాటిలో ప్రధానంగా బ్యాంకు నుంచి రుణం తీసుకునేటప్పుడు ఏదైతే హామీ ఇస్తారో దానికి కట్టుబడి ఉండాల్సి ఉంటుంది. బకాయిలు చెల్లించే స్తోమత ఉన్నా చెల్లించకుండా తప్పించుకోవడం, బ్యాంకుకు తెలియకుండా ఆస్తులను విక్రయించి సొమ్ము చేసుకుని పారిపోవడం తదితర అంశాలు ఉద్దేశపూర్వక ఎగవేదదారునిగా ముద్రవేయడానికి దారి తీస్తాయి. అలాగే బ్యాంకుల నుంచి పెద్దమొత్తంలో రుణం తీసుకుని ఎగ్గొట్టే వారి పేర్లను, ఫోటోలను వార్తాపత్రికల్లో ప్రచురించి వారి పరువును బజారుకీడ్చడానికి కూడా బ్యాంకులకు రిజర్వుబ్యాంకు అనుమతి ఇచ్చింది.

ఎస్‌బీఐలో బదలీలాట!


● బ్రాంచీల మూత ● ఉద్యోగుల అనుమతితోనే బదలీలు: యూనియన్లు



చెన్నై : దేశంలోనే అతి పెద్ద ప్రభుత్వ రంగానికి చెందిన బ్యాంకు ఏదంటే సామాన్యుడిని అడిగిన ఠక్కును స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అని చెబుతారు. ఈ ఆర్థికసంవత్సరంలోనే ఐదు అనుబంధ బ్యాంకులను విలీనం చేసుకొని గ్లోబల్ బ్యాంకుగా అవతరించింది. దీంతో బ్యాంకు సిబ్బంది సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయింది. అదే సమయంలో బ్రాంచీల సంఖ్య కూడా పెరిగిపోయాయి. విలీనం తర్వాత ఉద్యోగుల్లో కోత ఉంటుందని చాలా మంది ఆందోళన వ్యక్తం చేయడం.. అలాంటిదేమీ లేదని బ్యాంకు యాజమాన్యం సర్దిచెప్పడం జరిగిపోయాయి. అయితే ఉద్యోగులు వ్యక్తం చేసిన ఆందోళన ప్రస్తుతం నిజమైంది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి బ్యాంకుల్లో వేలాది మంది ఉద్యోగులను బదలీ చేయడం జరిగిపోయింది. అయితే ఆశ్చర్యం ఏమిటంటే బ్యాంకు యూనియన్‌లు మాత్రం దీనిపై ఎలాంటి నిరసన వ్యక్తం చేయకపోవడమని బ్యాంకుకు చెందిన ఉన్నతాధికారులే చెబుతున్నారు. అయితే యూనియన్‌లు మాత్రం ఉద్యోగుల అనుమతితోనే బదలీలు జరుగుతున్నాయని చెబుతున్నాయి.

రాబోయే నెలలో వందలాది బ్రాంచీలు మూతపడతాయి. అదే సమయంలో వేలాది మంది ఉద్యోగులను పొమ్మనలేకపొగపెట్టినట్లు భారీ ఎత్తున బదలీ చేయడం జరుగుతుందని ఉన్నతాధికారులే చెబుతున్నారు.

దేశంలోని అతి పెద్ద బ్యాంకుల్లో ఇంత పెద్దెత్తున రాద్ధాంతం జరుగుతుంటే సిబ్బంది నుంచి ఎలాంటి ఫిర్యాదులు కానీ, నిరసనలు కానీ వినిపించలేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అదేసమయంలో ట్రంప్‌దెబ్బకు దేశీయ ఐటి రంగం కుదేలవడం.. ఇక్కడ ఐటి కంపెనీల్లో ఉద్యోగులను సాగనంపితే ఉద్యోగులు లేబర్ కమిషన్ కార్యాలయాల చుట్టూ తిరిగి యాజమాన్యాలకు నిద్రలేకుండా చేశాయి. ఉదాహరణకు టెక్ మహీంద్రా, కాగ్నిజెంట్‌లను చెప్పుకోవచ్చు.



ఎస్‌బీఐలో ఆరు అనుబంధ బ్యాంకుల విలీనం (భారతీయ మహిళా బ్యాంకు)తో కలుపుకొని జరిగాయి... సాధారణంగానే విలీనానికి యూనియన్‌లు తీవ్రంగా వ్యతిరేకించాయి. అక్కడ వరకు బాగానే ఉన్నా, ప్రస్తుతం బ్యాంకు యాజమాన్యం ఉద్యోగులతో వ్యవహరిస్తున్న తీరుపై నోరు యూనియన్‌లు నోరు మెదపకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోందని, ఎస్‌బీఐ యాజమాన్యం మాత్రం ఇప్పటి వరకు ఉద్యోగులపై ఎలాంటి కక్షసాధింపు ధోరణి చేపట్టలేదని చెబుతోంది. అయితే ఉద్యోగులను బదలీ చేయడం, బ్రాంచీలను ఎందుకు మూసివేస్తున్నారో అర్థంకావడం లేదని అధికారులే చెబుతున్నారు.

విలీనంతో పెరిగిన సిబ్బంది: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో దాని అనుబంధ బ్యాంకులు ..(స్టేట్ బ్యాంకు ఆఫ్ బీకానీర్ అండ్ జైపూర్); స్టేట్ బ్యాంకు ఆఫ్ మైసూరు (ఎస్‌బీఎం), స్టేట్ బ్యాంకు ఆఫ్ ట్రావెన్‌కోర్ (ఎస్‌బీటి), స్టేట్ బ్యాంకు ఆఫ్ పటియాలా (ఎస్‌బీపీ), స్టేట్ బ్యాంకు ఆఫ్ హైదరాబాద్ (ఎస్‌బీహెచ్), భారతీయ మహిళా బ్యాంకులు విలీనం అయ్యాయి. మొత్తం 70వేల ఉద్యోగులు ఎస్‌బీఐకి జత అయ్యారు. వారిలో 40వేల మంది క్లాస్ -3, క్లాస్4, 30వేల మంది ఆఫీసర్లు ఉన్నారు.

ఎస్‌బీఐలో ఉద్యోగుల విలీనం ప్రక్రియ మాత్రం ఎలాంటి ఇబ్బంది లేకుండా నల్లేరుమీద నడకలా ముగిసింది. అయితే కేరళలో మాత్రం కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఉద్యోగులను బదలీ చేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయని తమ దృష్టికి వచ్చిందని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సీ హెచ్ వెంకటాచలం చెప్పారు. దీనిపై బ్యాంకు యాజమాన్యాలు సంతృప్తికరమైన వివరణ ఇవ్వాలని ఆయన అంటున్నారు.

అయితే ఇక్కడ బ్యాంకు ఉద్యోగులను ఆశ్చర్యానికి గురిచేస్తున్న అంశం ఏమిటంటే సాధారణంగా ఉద్యోగులపై యాజమాన్యం కక్షసాధింపు చర్యలకు పాల్పడితే బ్యాంకు యూనియన్‌లు ముక్తకంఠంతో దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిస్తుంటాయి. వాస్తవంగా బ్యాంకు యూనియన్‌లు బలంగానే ఉన్నాయి. యాజమాన్యం యూనియన్‌తో బదలీలకు సంబంధించి కుదర్చుకున్న ఒప్పందాన్ని దాటి బదలీచేయడానికి వీల్లేదని అఖిల భారత స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా స్టాఫ్ ఫెడరేషన్ (ఏఐఎస్‌బీఐఎస్ఎఫ్) ప్రధాన కార్యదర్శి సంజీవ్‌కుమార్ బాండ్లీస్ అంటున్నారు.

బ్యాంకుల్లో అధికారులతో పాటు అవార్డు సిబ్బందని బదలీ చేసే విధానం ఒకటి ఉందని, దాని ప్రకారమే జరగాలని.. అయితే పెద్ద సంఖ్యలో బదలీలు చేయరాదని తాము యాజమాన్యాన్ని కోరామని, అఖిల భారత స్టేట్ బ్యాంకు ఆఫీసర్స్ ఫెడరేషన్ (ఐఏబీఓఎఫ్) డీ థామస్ ఫ్రాంకో రాజేంద్రదేవ్ చెప్పారు. అయితే యూనియన్ నాయకులు మాత్రం సిబ్బందిని బదలీ చేసే ముందు వారితో సంప్రతింపులు జరిపి వారు కోరుకున్న ప్రాంతానికి బదలీ చేయడం జరుగుతుందని చెబుతున్నారు. ఉద్యోగులను వారు ఇంతకుముందు పనిచేసిన బ్యాంకు బ్రాంచీలకు సమీపంలోనే బదలీ చేయడం జరుగుతుందని, దీంతో ఎస్‌బీఐలో చేరిన ఉద్యోగుల్లో లేనిపోని భయాలు తగ్గుతాయని, నీరజ్ వ్యాస్, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ చెబుతున్నారు. ఎవరైతే కేరీర్ ప్రోగ్రేసివ్ ప్లాన్ (సీపీపీ) ప్రకారం బ్యాంకు బాధ్యతలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నారో కంపెనీ విధానాల ప్రకారం వారిని ఇతర ప్రాంతాలకు బదలీ చేయడం జరుగుతోందని ఆయన వివరించారు.

విలీనం ప్రతిపాదన వచ్చినప్పుడు అనుబంధ బ్యాంకులో పనిచేసే అధికారులతో ఇబ్బంది లేదనుకున్నామని.. అయితే క్లరికల్ కేడర్‌లో మాత్రం ఎస్‌బీఐ.. అనుబంధ బ్యాంకుల మధ్య తీవ్రమైన విభేదాలు వచ్చాయని వ్యాస్ వివరించారు. సీపీపీ విధానం ప్రకారం కొత్తగా ఎస్‌బీఐలో వచ్చిన చేరిన క్లరికల్ సిబ్బంది పెద్దమొత్తంలో బాధ్యతలు మోస్తామని ముందుకు వస్తే వారి అదనపు అధికారాలతో పాటు అలవెన్స్‌లు కూడా ఇస్తున్నామని వ్యాస్ అన్నారు. అదే ఎస్‌బీఐ అనుబంధ బ్యాంకుల్లో ఇలాంటి స్కీంలు లేవని.. ఈ స్కీంకు బ్యాంకు అతి పెద్ద యూనియన్ ఐబాక్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆయన అన్నారు. అయితే ఎస్‌బీఐలో కొత్తగా చేరిన అనుబంధ బ్యాంకుల ఉద్యోగులు మాత్రం సీపీపీకి ఆకర్షితులవుతున్నారని వ్యాస్ పేర్కొన్నారు. స్వచ్ఛంద పదవీ విరమణకు ముందు అనుబంధ బ్యాంకు సిబ్బందిలో భారీ మొత్తంలో బదలీలు జరగలేదని ఆయన అన్నారు. మొత్తం 3,569 ఉద్యోగులు స్వచ్ఛంద పదవి విరమణ (వీఆర్ఎస్)కు దరఖాస్తు చేసుకున్నారని వ్యాస్ పేర్కొన్నారు. తాము అంచనా వేసిన విధంగానే వీఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయన్నారు.

ఇక బ్యాంకు అధికారుల విషయానికి వస్తే అధికారులను బదలీ చేస్తే వారికి ప్రమోషన్ ఇవ్వడం జరుగుతోందని, లేదా మూడు సంవత్సరాల పాటు ఒక బ్రాంచీలో పదవీ కాలం పూర్తి చేస్తే వారిని బదలీచేయడం జరుగుతుందని ఆయన వివరించారు.ఇక బ్యాంకు సిబ్బంది నియామకాల గురించి ప్రస్తావిస్తూ.. వాస్తవంగా ఎస్‌బీఐలో పనిచేసే సిబ్బందితో పాటు అనుబంధ బ్యాంకు సిబ్బందిని కలిపి నియమిస్తున్నామని దీంతో వారు ఎస్‌బీఐ సంస్కృతిక అలవాటుపడతారని ఆయన అన్నారు.కేరళలో పెద్దెత్తున బదలీలపై వస్తున్న ఫిర్యాదుల గురించి ప్రస్తావిస్తే... వ్యాస్ సమాధానమిస్తూ.. మొత్తం 4,300 ఉద్యోగుల్లో స్టేట్ బ్యాంకు ఆఫ్ ట్రావెన్‌కోర్ (ఎస్‌బీటి)లో కేవలం 25 మంది ఉద్యోగులు మాత్రమే ఫిర్యాదులు చేస్తున్నారని, మిగిలిన వారంతా కేరీర్ ప్రోగ్రెస్ ప్లాన్ ఆమోదం తెలిపారని ఆయన అన్నారు. విలీనానికి ముందు ఎస్‌బీఐ యూనియన్‌లు సీపీపీని తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. కొత్తగా ఎస్‌బీఐలో చేరిన అనుబంధ బ్యాంకుల సిబ్బందిలో 80 శాతం, సీపీపీవైపు మొగ్గుచూపారన్నారు.

బ్యాంకుల మూత గురించి : బ్యాంకులను ఏ ప్రాతిపదికన మూసి వేస్తున్నారని ప్రశ్నించగా.. దీనికి పలు ప్రాతిపదికలను పరిగణనలోకి తీసుకుంటామని, ప్రధానంగా బ్యాంకు లాభాలను ఆర్జిస్తుందా లేదా, దీర్ఘకాలంలో అయినా లాభాల్లోకి వచ్చే అవకాశం ఉందా... లీజ్ కాలం పూర్తయితే.. బ్యాంకులో జరిగే ఆర్థిక లావాదేవీలను పరిగణనలోకి తీసుకుంటామని వ్యాస్ అన్నారు. అనుబంధ బ్యాంకులను మూయడం లేదన్నారు. ఒక వేళ ఎస్‌బీఐ బ్రాంచీలు కూడా లాభాలను ఆర్జించలేకపోతే మూసివేస్తామన్నారు. అదే సమయంలో అద్దెకున్న బ్యాంకు బ్రాంచీలనుంచి వీలైనంత వరకు సొంత భవనాలకు మారుతామన్నారు. మొత్తం 1400 బ్రాంచీలను హేతుబద్ధం చేయాలనుకున్నామని, వాటిలో 594 పూర్తి చేశామన్నారు. మిగిలిన బ్రాంచీలను భవిష్యత్తులో పూర్తి చేస్తామని, అదే సమయంలో అవసరం అనుకుంటే కొత్త బ్రాంచీలను ప్రారంభిస్తామని ఆయన వివరించారు.

బోరుబావిలో బాలుడు

గుంటూరు జిల్లాలో దారుణం • యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు • రంగంలోకి దిగిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు • ఘటనా స్థలికి కలెక్టర్, రూరల్ ఎస్పీ • ఘటనపై ఏపీ సీఎం ఆరా



బోరు బావి వద్ద సహాయక చర్యలు. (ఇన్‌సెట్‌లో బోరుబావిలో పడ్డ చిన్నారి)

అమరావతి, ఆంధ్రప్రభ: తెలంగాణాలోని చేవెళ్ల ఘటన మర్చిపోకముందే నవ్యాంధ్రప్రదేశ్ గుంటూరు జిల్లా వినుకొండ మండలం, ఉమ్మడివరం గ్రామంలో రెండేళ్ల చంద్రశేఖర్ అనే బాలుడు మంగళవారం సాయంత్రం బోరుబావిలో పడ్డ ఘటన విషాదం నింపింది. పొలంలో బోరు బావి తవ్వి నీరు పడకపోవడంతో పూడ్చకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన అనుమలమూడి మల్లిఖార్జునరావు ఏడాది క్రితం పశువుల మేత కోసం 60 సెంట్ల సొంత భూమిలో బోరు బావి తవ్వించాడు. సుమారు 200 అడుగులు తవ్వినా నీరు పడకపోవడంతో అలాగే వదిలివేశారు. మంగళవారం సాయంత్రం 5 గంటల సమయంలో మల్లిఖార్జునరావు భార్య అనూష పశువుల మేత కోసం వెళ్తూ కుమారుడు చంద్రశేఖర్‌ను వెంట తీసుకెళ్లింది. పొలంలో బాలుడ్ని వదిలి గడ్డి కోస్తున్న సమయంలో చంద్రశేఖర్ ఆడుకుంటూ వెళ్లి బోరు బావిలో పడిపోయాడు. ఈ విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు తక్షణమే అధికారులకు సమాచారం అందించడంతో యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టారు. బాలుడు సుమారు 15 అడుగుల లోతులో ఉన్నట్లు గమనించారు. తక్షణమే వైద్య, ఆరోగ్యశాఖ, రెవెన్యూ, పోలీసు యంత్రాంగం రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టింది. వైద్యారోగ్యశాఖ బృందం బోరు బావిలో పడిన బాలునికి ఆక్సిజన్ అందిస్తున్నారు. అలాగే మూడు ప్రొక్లెయిన్లు బోరు బావికి సమాంతరంగా గోతిని తవ్వడం మొదలుపెట్టారు.

ఈ విషయం తెల్సిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్ కోన శశిధర్‌తో మాట్లాడి బాలుడ్ని కాపాడేందుకు సహాయ చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశించారు. సీఎం ఆదేశాలతో కలెక్టర్ శశిధర్, రూరల్ ఎస్పీ సీహెచ్ అప్పలనాయుడు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. తెలంగాణాలో అనుభవాలను దృష్టిలో పెట్టుకుని బాలుడ్ని కాపాడేందుకు బోరు బావికి సమాంతరంగా ప్రొక్లెయిన్లతో రాత్రి 8.30 గంటల సమయంలో 20 అడుగుల లోతు గోతిని తవ్వారు. విజయవాడ నుంచి ఎన్డీఆర్ఎఫ్ బృందంలోని నిపుణులు ఘటనాస్థలికి చేరుకోగానే బోరుబావికి సమాంతరంగా తవ్విన గోతి నుంచి బాలుడ్ని కాపాడేందుకు ప్రయత్నాలు సాగించారు. రాత్రి 9 గంటల వరకు బాలుడు సజీవంగా ఉన్నట్లు గుర్తించారు. పై నుంచి బాలుడికి ఆక్సిజన్‌తోపాటు గాలి కోసం విసనకర్రలు, చాటలతో విసరడం కనిపించింది. తమ కుమారుడు తాము తీయించిన బోరు బావిలోనే పడిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తమ కుమారుడ్ని రక్షించాలంటూ అధికారుల వద్ద వాపోతున్నారు. బోరు బావిలో బాలుడు పడ్డ విషయాన్ని తెల్సుకున్న పరిసర గ్రామస్థులు తండోపతండాలుగా ఘటనా స్థలికి చేరుకున్నారు. ఘటనా స్థలి వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేసి సహాయక చర్యలు ముమ్మరం చేశారు.

బోరు బావిలో బాలుడు పడ్డ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతో మాట్లాడారు. అదేవిధంగా వైద్య ఆరోగ్యశాఖామంత్రి కామినేని శ్రీనివాస్ సహాయక చర్యలపై వైద్యశాఖాధికారులతో చర్చించారు. బాలుడ్ని సజీవంగా బయటకు తీసే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు.



తుర్కెమెనిస్థాన్ మంత్రితో సుష్మా భేటీ

టీఏపీఐ పైప్‌లైన్ ప్రాజెక్ట్‌పై మంతనాలు

న్యూ ఢిల్లీ: తుర్కమేనిస్థాన్ విదేశాంగ శాఖ మంత్రి రషీద్ మేరేదేవ్‌తో మంగళవారం భారత విదేశాంగశాఖ మంత్రి సుష్మా స్వరాజ్ భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు మరింత బలోపేతమయ్యేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఇరువురు మంతనాలు జరిపారు. గత రెండు దశాబ్ధాలుగా పెండింగ్‌లో ఉన్నటువంటి టీఏపీఐ (తుర్కమేనిస్థాన్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్, ఇండియా) పైప్‌లైన్ ప్రాజెక్ట్‌పై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పైన పేర్కొన్న నాలుగు దేశాల ఇంధన వనరుల సరఫరా కోసం ఈ పైప్‌లైన్‌ను ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే. పాకిస్థాన్ భూభాగంలో కూడా పైప్‌లైన్ ప్రాజెక్టు ఉన్నందున ఇరు దేశాలు కలసి పని చేయాల్సిన అవసరం ఉంది. కానీ, ప్రస్తుతం భారత్, పాకిస్థాన్ల మధ్య దౌత్యసంబంధాలు దెబ్బతినడంతో కొంత ఇబ్బందికర పరిస్థితి ఉండే అవకాశం ఉందని నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ ప్రాజెక్టు కేవలం భారత్, పాక్ మధ్య మాత్రమే కాదని తుర్కమేనిస్థాన్ మంత్రి వ్యాఖ్యానించారు. టీఏపీఐ ప్రాజెక్ట్ వాడకంలో వస్తే యావత్ మధ్య ఆసియా దేశాలకు లబ్ధి ఉంటుందని అభిప్రాయపడ్డారు. పైప్‌లైన్ ప్రాజెక్ట్ అమలు కోసం ఇరు దేశాలు విబేధాలు పక్కనబెట్టి పనిచేయాలన్నారు. ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితీన్ గడ్కరీ, పెట్రోలియం శాఖ మంత్రి ధరేంద్ర ప్రదాన్ తదితరులను కూడా రషీద్ మెరేదేవ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

సాగునీటి ప్రాజెక్టులకు రూ.17వేల కోట్లు

కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి: ఈ ఏడాది రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులపై 17వేల కోట్లు వ్యయం చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. గత మూడేళ్ళలో తమ ప్రభుత్వం కేవలం సాగునీటి ప్రాజెక్టులపై రూ.44వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. 2019నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికంకితం ఇస్తామని ఆయన పునరుద్ఘాటించారు. దేశంలోనే మరెక్కడా లేనిస్థాయిలో ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి పథకాల్ని పెద్దసంఖ్యలో పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో నూతనంగా నిర్మించిన పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం జగ్గంపేటలో నిర్వహించిన బహిరంగసభలో ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. రాబోయే మూడుమాసాల్లో 13వేల కోట్ల విలువైన 28సాగునీటి ప్రాజెక్టుల్ని పూర్తి చేస్తున్నట్లు ఈ సందర్భగా ఆయన పేర్కొన్నారు. స్వాతంత్రమొచ్చి 70ఏళ్లు పూర్తయిన సందర్భంగా మెట్టప్రాంత రైతాంగ నాలుగుదశాబ్ధాలచిరకాల వాంఛను నెరవేర్చడం సంతోషంగాఉందన్నారు. ఏలేరు కాలువకు నీరివ్వడం ద్వారా అదనపు ఆయకట్టు సాగులోకొస్తోందన్నారు. తూర్పులో 31,02,852ఎకరాల వీస్తీర్ణం ఉంటే 13,67,362ఎకరాల వ్యవసాయయోగ్య భూమి ఉందన్నారు. చాగల్నాడు, పుష్కర ఎత్తిపోతల పథకాల్ని తానే ప్రారంభించానన్నారు. ఈ ఏడాది 12,07,966ఎకరాల ఆయకట్టుకు సాగునీరందిస్తున్నామన్నారు. పోలవరం ఇతర నీటిపారుదల ప్రాజెక్టులు, గోదావరి డెల్టా ఆధునీకరణ ద్వారా ప్రతిఎకరాకు సాగునీరందించే బాధ్యత తీసుకున్నానన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా సాగునీరందిస్తామన్నారు. పురుషోత్తపట్నం పథకాన్ని జనవరిలో ప్రారంభించామన్నారు. యుద్ధప్రాతిపదికన 8మాసాల్లోపే పూర్తి చేశామన్నారు.దీనిద్వారా 2.15లక్షల ఎకరాల అదనపు ఆయకట్టుకు సాగునీరందుతుందన్నారు. పురుషోత్తపట్నం, పట్టిసీమ ప్రాజెక్టుల ద్వారా 11జిల్లాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. పట్టిసీమ ద్వారా 33టిఎమ్‌సిల నీటిని కృష్ణాడెల్టాకు తీసుకెళ్తామన్నారు. శ్రీకాకుళం, విజయనగరం మినహా అన్ని జిల్లాల్లోనూ ఆయనకట్టు విస్తృతికి ఈ ప్రాజెక్టులు ఉపకరిస్తాయన్నారు. పోలవరం ప్రాజెక్ట్‌ను ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడిగా అభివర్ణించారు. దీన్నిప్రగతికి చిహ్నంగా పేర్కొన్నారు. గోదావరిజలాల్తో రాష్ట్రాన్ని పునీతం చేయమంటూ పుష్కర సమయంలో పూజలు చేశామన్నారు. అనంతరం గోదావరి, కృష్ణాల అనుసంధానం చేసామన్నారు.

ఇంటింటికీ వంట గ్యాస్

రాష్ట్ర విభజన సమయంలో 25.5మిలియన్ల యూనిట్ల విద్యుత్ కొరతుంటే 2016నాటికే దీన్ని అధిగమించి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని చంద్రబాబు వివరించారు. అలాగే ఈ ఏడాది అన్ని ఇళ్ళకు వంటగ్యాస్ కనెక్షన్లు అందించామన్నారు. 2018నాటికి అన్ని గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. ఎస్‌సి, బిసి సబ్‌ప్లాన్లు అమలు చేస్తామన్నారు. వెయ్యి కోట్లతో కార్పొరేషన్ ద్వారా కాపులకు పథకాలు అమలు చేస్తున్నామన్నారు.

రాయలసీమలో నీటిభద్రత

రాయలసీమలో కరవును జయించేందుకు నీటిభద్రత అత్యవసరమని చంద్రబాబు చెప్పారు. కోస్తాంధ్రలో తుపాలను అధిగమిస్తామన్నారు. సాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూస్తామన్నారు. ఈ నెల్లో జలసిరికి హారతులిస్తామన్నారు. రైతులందరూ ఈ హారతికి హాజరుకావాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు 38కోట్ల విలువైన 680ట్రాక్టర్లను 50శాతం సబ్సిడీపై ముఖ్యమంత్రి అందించారు. ఈ కార్యక్రమంలో హోమ్‌మంత్రి నిమ్మకాయల చినరాజప్ప, ఇన్‌చార్జిమంత్రి కిమిడి కళావెంకట్రావు, జలవనరుల మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ రెడ్డిసుబ్రహ్మణ్యం, ఎమ్‌పి నరసింహం, జడ్‌పిచైర్మన్ నవీన్‌కుమార్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఆకులసత్యనారాయణ, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, తదితరులు పాల్గొన్నారు.



పోలవరం హెడ్‌వర్క్స్‌పై 3,600కోట్లు

పోలవరం హెడ్‌వర్క్స్‌పై ఇంతవరకు తాము 3,603కోట్లు ఖర్చుచేశామని చంద్రబాబు చెప్పారు. అలాగే కుడి ప్రధాన కాలువపై 3,379కోట్లు, ఎడమప్రధాన కాలువపై 1684కోట్లు, పట్టిసీమపై 1645కోట్లు, వంశధారకు 2కోట్లు ఖర్చు చేశామని చెప్పారు.

రెండు పంపులు ప్రారంభం

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకానికి సంబంధించి రెండు పంపుల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఇందుకోసం ఆయన ప్రత్యేకంగా పురుషోత్తపట్నం విచ్చేశారు. ఈ పంపుల ద్వారా నీటిని పోలవరం ప్రాజెక్టు ఎడమకాలువకు పంపింగ్ చేస్తారు. తొలుతప్రాజెక్ట్ నిర్మాణ పంప్‌హౌస్ శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం జలసిరి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పురుషోత్తపట్నాన్ని ఒక చరిత్రగా ఆయన అభివర్ణించారు. జనవరి 5న శంఖుస్థాపన చేసి 8 మాసాల్లోనే జాతికంకితం చేయడం ఓ రికార్డుగా పేర్కొన్నారు. ప్రాజెక్ట్ భూసేకరణలో 90శాతం రైతులు సహకరించారన్నారు. పదిశాతం సేకరణలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా 24టిఎమ్‌సిల నీటిని ఏలేరులో నిల్వ ఉంచుతామన్నారు. మరో పదిటిఎమ్‌సిలు విశాఖకు పంపిస్తామన్నారు.

గ్వామ్‌పై దాడిలో మెత్తబడ్డ ఉత్తర కొరియా



గువామ్: అమెరికా ద్వీపం గువామ్‌పై దాడి విషయంలో ఉత్తర కొరియా మెత్తబడింది. అమెరికా భూభాగంపై తాము ఎటువంటి దాడి చేపట్టబోమని కొరియా ప్రకటించింది. ఈ మేరకు ఉత్తర కొరియా ఉన్నతాధికారులు మంగళవారం ప్రకటించారు. గత కొద్దిరోజుల క్రితంపై గువామ్ అణు దాడి చేసి ఆ ప్రాంతాన్ని ధ్వంసం చేస్తామని కొరియా ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా కొరియాను గట్టిగా హెచ్చరించారు. దీంతో ఇరు దేశాల మధ్య ప్రతిష్టంభన నెలకొంది. అయితే, తాము అమెరికాలోని ఏ భూభాగంపై దాడి చేయటం లేదని కొరియా ప్రకటించడంతో గువామ్‌కు చెందిన భద్రతాధికారులు హర్షం వ్యక్తం చేశారు.

అమెరికా ఖైదీల విషయంలో తగ్గేది లేదు

ఉత్తర కొరియాలో బందీలుగా ఉన్నటువంటి ముగ్గురు అమెరికా ఖైదీలకు సంబంధించిన అంశంపై తాము ఇప్పుడే ఆ దేశంతో మాట్లాడేది లేదని కొరియా అధికారులు ప్రకటించారు. గత 15వ సంత్సరాలుగా ఖైదీలుగా ఉంచిన ముగ్గురు ఖైదీల విషయం రెండు దేశాల మధ్య గల దౌత్యసంబంధాలపై ఏ విధమైన ప్రభావం ఉండదని సెంట్రల్ కొరియన్ ఏజెన్సీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ అంశం తమ అంతర్గత వ్యవహారమని ప్రకటించింది. అయితే అణు పరీక్షల విషయంలో ఇరు దేశాల మధ్య సందర్భంగా ఇబ్బందికర వాతావరణ నెలకొన్న విషయం తెలిసిందే.

ఘనంగా అరబిందో జయంతి వేడుకలు

పుదుచ్చేరీ: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు అరబిందో 145వ జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. దేశవ్యాప్తంగా స్వాతంత్య దినోత్సవ వేడుకలతో పాటు ఆయన జయంతి వేడుకలు కూడా జరిగాయి. ఈసందర్భంగా ఆయనకు నివాళి అర్పించారు. పుదుచ్చేరిలోని ఆయన స్మారక స్థూపానికి స్థానిక ప్రజానీకం పెద్ద సంఖ్యలో హాజరై ఘనంగా నివాళ్ళర్పించారు. పలు కేంద్రాల్లో మెడిటేషన్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. విప్లవవాదిగా ఉన్నటువంటి అరబిందో తాత్వికవేత్తగా మారి 1926లో యోగాను పెద్ద ఎత్తున ప్రచారం మొదలుపెట్టారు. ఆయన స్థాపించిన ఆశ్రమంతో దేశంలో ఎంతోమంది యోగా గురువులు తయారయ్యారని ఆశ్రమ నిర్వహకులు తెలిపారు. కాగా, ఆయన 1950 డిసెంబర్ ఐదో తేదీన మృతి చెందిన విషయం తెలిసిందే.

కేసీఆర్ వర్క్‌ఫ్రం హోం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి. గత ముఖ్యమంత్రులంతా సచివాలయంలోనే ఉదయం నుంచి సాయంత్రం దాకా అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించడం, ప్రముఖులను కలవడం, సామాన్య ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించే క్రమంలో రోజంతా తీరిక లేకుండా గడిపేవారు. కానీ మారిన పరిస్థితులకు అనుగుణంగా ఇప్పుడు ప్రతి సమస్యపై ఆన్‌లైన్ ద్వారా పరిష్కారం చేసుకునే క్రమంలో ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చే పద్ధతి కొంతమేరకు తగ్గిందని చెప్పవచ్చు. అయినా క్షేత్రస్థాయి అధికారులు సమస్యలపై స్పందించకపోవడంతో ముఖ్యమంత్రి, మంత్రులను కలిసి తమ వ్యక్తిగత సమస్యలపై విజ్ఞాపన పత్రాలు ఇచ్చేందుకు ప్రజలు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కూడా అధికారిక నివాసాలకే పరిమితం కావడంతో వారు కూడా వర్క్ ఫ్రం హోం దిశగా అడుగులు వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు గ్రీన్‌ల్యాండ్స్‌లోని గత సీఎం క్యాంపు కార్యాలయాన్ని తన మంత్రిత్వ శాఖకు అనుగుణంగా మార్చుకుని అక్కడి నుంచే విధులు నిర్వర్తిస్తున్నారని సమాచారం. వర్క్ ఫ్రం హోం అమలుచేస్తే సమయం ఆదా అవుతుందని, సిబ్బందిపై కంపెనీ పెట్టే ఖర్చు తగ్గుతుందని అమెరికా సంస్థలు భావిస్తున్నాయి. అదే తరహాలో సచివులు కూడా తమ అధికారిక విధులను ఇంటినుంచే చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. పరిపాలనా కేంద్రంగా ఉన్న రాష్ట్ర సచివాలయం తెలంగాణ ఏర్పడిన తర్వాత దాని స్వరూపాన్నే కోల్పోవలసి వచ్చింది. గత ముఖ్యమంత్రులంతా సచివాలయం నుంచే పరిపాలన సాగించగా, కేసీఆర్ మాత్రం సచివాలయంకన్నా అతిపెద్దగా ప్రగతి భవన్ నిర్మించి అక్కడి నుంచే పరిపాలనా సాగించడం తెలంగాణలో అతిపెద్ద మార్పునకు శ్రీకారం చుట్టారు. 3 అయితే వాస్తుసరిగా లేదంటూ కేసీఆర్ గత రెండేళ్ళుగా సచివాలయానికి రావడం మానేశారు. ఆధునిక భవన సముదాయాలతో కొత్త సచివాలయ భవనాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం కల్పించడంతో ప్రస్తుత సచివాలయానికి ఉనికి కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. నూతన సచివాలయం నిర్మించినప్పటికీ ముఖ్యమంత్రి మాత్రం ప్రగతి భవన్ నుంచే పరిపాలనా కొనసాగించే అవకాశాలు ఉన్నాయని పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి. కేసీఆర్ తన ఆకాంక్షకు అనుగుణంగా ప్రగతి భవన్‌ను నిర్మించుకోవడంతో భవిష్యత్తులో కూడా దాన్నే ముఖ్యమంత్రి కార్యాలయంగా ఆయన కొనసాగించనున్నారు.

కాంగ్రెస్ జవసత్వాలు కుంతియాకు సాధ్యమేనా?

ఉత్తమ్‌కు జానా, కోమటిరెడ్డి మద్దతు ఎంత వరకు?

కాంగ్రెస్ శ్రేణుల్లో భిన్నాభిప్రాయాలు



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ: గత ఎన్నికల్లో పరాజయం పాలైన రాష్ట్ర కాంగ్రెస్‌కు జవసత్వాలు కల్పించడం కొత్తగా నియమితులైన రాష్ట్ర పార్టీ ఇంచార్జీ డాక్టర్ రామచంద్రకుంతియాకు సాధ్యమేనా ? తలపండిన నాయకులను ఏకతాటిపై తేవడం ఆయనతో అవుతుందా? 2019 ఎన్నికల్లో పార్టీని గెలిపించే స్థాయిలో ఆయన ఉన్నారా? తన స్వరాష్ట్రంలో పాదయాత్ర కోసం పార్టీ ఇంచార్జీ బాధ్యతల నుంచి డిగ్గీరాజాను తప్పించిన తర్వాత కాంగ్రెస్ అధిష్టానం ట్రేడ్ యూనియనిస్ట్ పార్టీ సహ ఇంచార్జీగా ఉన్న కుంతియాకే పూర్తి స్థాయి ఇంచార్జీ బాధ్యతలను అప్పగించింది. ఆయనతో పాటు కర్నాటకకు చెందిన మాజీ మంత్రి సతీష్ సహాయకుడిగా నియమించింది. వారి నియామకంపై పార్టీ నేతలు బహాటంగా స్పందించనప్పటికీ, ఇద్దరి నేతృత్వంలో పార్టీ రాష్ట్రంలో పూర్వవైభవం సంతరించుకుంటుందా లేదా అనే విషయం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నందున ఇతర పార్టీలు, ప్రజాసంఘాలు,ప్రజలు సైతం ఇంచార్జీలపై ప్రధానంగా దృష్టి సారిస్తారు. ప్రజాకర్శక పథకాలతో దూసుకువెళుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను నిలువరించడం సాధ్యంకాకపోతే వచ్చే ఎన్నికల్లో మరోమారు టీఆర్ఎస్ పార్టీ గెలిచే అవకాశం ఉంది. అందువల్ల ప్రజల్లో ఆయనకు చెక్‌పెట్టేందుకు కుంతియాను ప్రబల శక్తిగా భావించి అధిష్టానం ఇంచార్జీగా నియమించింది. ఇంచార్జీగా నియమితులైన తర్వాత తొలిసారిగా శనివారం కుంతియా హైదరాబాద్ వచ్చారు. తొలిరోజు గోల్కొండ హోటల్‌లో ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. రెండోరోజైన ఆదివారం అధికార ప్రతినిధులు, పీసీసీ ఆఫీస్ బేరర్ల సమావేశంలో పాల్గొన్నారు. మూడో రోజు టీపీసీసీ అనుబంధ సంఘాలతో సమావేశమయ్యారు. ఈ సమావేశాల్లో మాట్లాడిన సందర్భంలోనూ, విలేఖరులతో ముచ్చటించిన సందర్భంగా కూడా వచ్చే ఎన్నికల వరకు ఎన్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా కొనసాగుతారని, అదే విధంగా తమ టీం కూడా కొనసాగుతోందని తేల్చిచెప్పారు. ఉత్తమ్‌ను సుప్రీం కేప్టెన్‌గా కితాబిచ్చారు.ఆయన సారథ్యంలో రాష్ట్రంలో పార్టీ చాలా బలంగా ఉందని, ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలను చేపడుతోందని ప్రశంసించారు. అంతేగాక సోనియాగాంధీ, రాహుల్ గాంధీ కూడా అదే అభిప్రాయంతో ఉన్నారని స్పష్టంచేశారు. పీసీసీ అధ్యక్ష పదవిలో మార్పుండదని ఆయనే చెప్పడంతో వచ్చే ఎన్నికల వరకు ఉత్తమ్ కొనసాగుతారనే సంకేతాన్ని ప్రజలకు ఇచ్చారు. దీంతో ఆయన ప్రజల్లోఉన్న అనుమానాలు, సంశయాలకు నివృత్తి చేసినట్లయింది. ఉత్తమ్ కూడా తన పదవికి ఢోకా లేదని దూసుకుపోయే అవకాశం కల్పించారు. ఉత్తమే పీసీసీ చీఫ్‌గా కొనసాగుతారని ప్రకటించడం ద్వారా ఆయన పార్టీ పరమైన అంశాల్లో కఠినంగా వ్యవహరిస్తారనే చెప్పారు. మూడేళ్లపాటు దిగ్విజయ్ సింగ్‌కు సహాయకుడిగా ఉన్నప్పుడు ఆయన అంత ముక్కుసూటిగా వ్యవహరించే వ్యక్తి అని ఎవరు కూడా అనుకోలేదు.అందరు కూడా ఆయన్ను దిగ్విజయ్‌కు పార్టీ పరంగా సహకరించే వ్యక్తి అనుకున్నారే తప్ప.., అవసరమైతే కఠిన నిర్ణయాలు తీసుకుంటారని అనుకోలేదు..కాకపోతే ఆయనకు సత్తా చాటుకునే అవకాశం గతంలో రాలేదనుకోవచ్చు. కానీ, ఇంచార్జీగా మారిన తర్వాత తనలోని నాయకత్వ లక్షణాలను, కార్మిక నాయకుడిగా అనుభవాలను ఒక్కొక్కటిగా నాయకులు, కార్యకర్తలకు సూచిస్తున్నారు. అధికార ప్రతినిధుల సమావేశంలో సాధారణంగా వేదికపై ఉన్న వాళ్లు లెక్చర్లు దంచుతారు. అదే విధానాన్ని పీసీసీ నేత ఒకరు కొనసాగించేందుకు ప్రయత్నించగా...,కుంతియా జోక్యం చేసుకుని నో..నో... దట్స్‌నాట్ కరెక్ట్ ...ముందుగా అందరు అధికార ప్రతినిధులు మాట్లాడి తర్వాత, వారి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత వాటిని పరిగణలోకి తీసుకుని మనం మాట్లాడదామని వేదికపై ఉన్న నాయకులకు చెప్పడంతో అందరు కూడా అవాక్కయినట్లు తెలిసింది. అదే విధంగా అనుబంధ సంఘాల సమావేశాల్లో సైతం సభ్యుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చి వారి సలహాలు, సూచనలు తీసుకునేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. మూడురోజుల పర్యటనను విజయవంతంగా ముగించినప్పటికీ, ఉత్తమ్‌ను ఎన్నికలకు సుప్రీం కమాండర్ అని ప్రకటించడంతో కాంగ్రెస్‌లో ఉన్న ఉత్తమ్ వ్యతిరేకులు, పీసీసీ అధ్యక్ష పదవిని కోరుకున్న వారిని ఏ విధంగా సంతృప్తిపరుస్తారనే అంశం పార్టీలో చర్చనీయాంశమైంది. పీసీసీ సారథ్యాన్ని సీఎల్పీ నాయకుడు కె జానారెడ్డి,వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోదరులు, ఎమ్మెల్యే డీకే అరుణ కోరుకున్నారు. కోమటిరెడ్డి సోదరులైతే దిగ్విజయ్ సింగ్‌తో లాబీయింగ్ చేశారనే ప్రచారం ఉంది. అదే విధంగా జానారెడ్డి కూడా ఢిల్లీవెళ్లి తనకు పీసీసీ బాధ్యతలు అప్పగిస్తే వచ్చే ఎన్నికల్లో పార్టీని గెలిపిస్తామనే భరోసా ఇచ్చారు. భట్టి విక్రమార్క అయితే , ఢిల్లీలో తనకున్న పరిచయాలతో ప్రయత్నాలు చేశారని చెబుతున్నారు. డీకే అరుణ లాబీయింగ్ చేయనప్పటికీ, ఒకవేళ ఉత్తమ్‌ను మారిస్తే మాత్రం మహిళగా తనకు ఇవ్వాలని అధిష్టానాన్ని కోరతానని చెప్పారు.అధిష్టానం నిర్ణయం మేరకు ఉత్తమ్ సారథ్యాన్ని డీకే అరుణ, భట్టి విక్రమార్క అంగీకరించవచ్చు కానీ, జానారెడ్డి,కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోదరులను ఒప్పించగలరా అనే విషయం ఆసక్తికరంగా మారింది. ఈ ఇద్దరు బడా నాయకులను ఒప్పించగలిగితే వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యమని పార్టీ నాయకులే కాదు, ఇతర పార్టీల నాయకులు సైతం అంగీకరిస్తున్నారు. ఈ విషయంలో కుంతియా జానా, కోమటిరెడ్డిని ఒప్పించగలరా ?లేదా? అనేది తేల్చాల్సి ఉంటుంది. వారిని ఒప్పిస్తే మాత్రం ట్రబుల్ షూటర్ గా కుంతియాకు పేరు రావడంతో పాటు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచితీరుతుందని పార్టీ నాయకులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

రోహింగ్య శరణార్థులపై భారత్ చర్యకు ఐరాస ఆందోళన



న్యూఢిల్లీ: రోహింగ్య శరణార్ధులపై భారతదేశం తీసుకొనే చర్యలపై ఐక్యరాజ్యసమితి ఆందోళన చెందుతుంది. మయన్మార్ నుంచి వలస వచ్చిన శరణార్థులను తిరిగి ఆ దేశానికి పంపేయాలని కేంద్ర ప్రభుత్వం సంచలనాత్మక నిర్ణయం తీసుకుంది. సుమారు 40 వేల మందిని చొరబాటులుగా పేర్కొంటూ తక్షణమే తమ దేశం నుంచి పంపించేందుకు కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. ఈ విషయంలో ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గట్టర్స్ భారత అధికారులతో చర్చిస్తున్నారు. మయన్మార్‌లో రోహింగ్యాలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో పొరుగు దేశాలైన భారత్, బంగ్లాదేశ్‌లకు వారు వలస వెళ్తున్నారు. వీరిని రక్షించేందుకు చర్యలు చేపట్టిన ఐక్యరాజ్యసమితి శరణార్థుల విభాగం పేరిట ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి వారికి ఆశ్రయం కల్పించింది. ఈ విధంగా భారతదేశంలో ఉన్న సుమారు 16,500 మందికి ఐక్యరాజ్యసమితి గుర్తింపు కార్డులను మంజూరు చేసింది. అయితే ఈ కార్డులు చెల్లవని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిరెన్ రిజుజు తెలిపారు. మయన్మార్ లోని రఖీనే రాష్ట్రంలో స్థిరపడిన రోహింగ్య ముస్లింలను చొరబాటుదారులుగా పేర్కొనడమే కాకుండా, అల్లర్లకు కారణమౌతున్నారని సైన్యం వారిపై దాడులకు పాల్పడుతోంది. రోహింగ్య యువకులను కాల్చిచంపడమే కాకుండా మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడటంతో పొరుగు దేశాలకు వలస వెళుతున్నారు.

శరణార్థుల విషయంలో ఐక్యరాజ్యసమితి చర్యలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి రిజుజు సమర్థిస్తూనే.. అక్రమ చొరబాటుదార్లను ఇక్కడ జీవించేందుకు అనుమతించమన్నారు. అలాగని వారిపై హింసాత్మక చర్యలకు పాల్పడమని, చట్ట ప్రకారంగా వారి దేశాలకు పంపుతామన్నారు. ఇప్పటికే మయన్మార్, బంగ్లదేశ్‌లతో సంప్రదింపులు జరుపుతున్నామని రిజుజు తెలిపారు. దీనిపై స్పందించిన ఐక్యరాజ్యసమితి అక్కడ రక్షణ కరువైందని వలస వచ్చిన వారిని తిరిగి అక్కడికే పంపడం సరికాదని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తోంది.

నవ్యాంధ్ర నిర్మాణానికి ఉద్యోగులు పునరంకితం కావాలి: అశోక్‌బాబు

అమరావతి, ఆంధ్రప్రభ : దేశస్వాతంత్ర్యం కోసం ఆనాడు అనేక త్యాగాలు చేసిన మహానుభావుల స్ఫూర్తితో నవ్యాంధ్ర నిర్మాణానికి ఉద్యోగులు పునరంకితం కావాలని ఎపిఎన్‌జివో రాష్ట్ర అధ్యక్షులు పి. అశోక్‌బాబు పిలుపునిచ్చారు. 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని ఎపిఎన్‌జివోహోం, రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎన్‌జివో నేత అశోక్‌బాబు మాట్లాడుతూ నవ్యాంధ్ర నిర్మాణంలో అటుపోట్లను సమర్ధవంతంగా ఎదుర్కొని ప్రభుత్వ సంకల్పాన్ని ప్రజలకు చేర్చే గురుతర బాధ్యత ఉద్యోగులపైనే ఉందని అన్నారు. స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతి ఒక్కరు అందిపుచ్చుకోవాలని, రాష్ట్రాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపిఎన్‌జివో అసోసియేషన్ నాయకులు ఎండి ఇక్బాల్, డి. సత్యనారాయణరెడ్డి, కోనేరు రవి, డి. సుజాత, హేమకళ్యాణి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. దాలినాయుడు, మాజీ అధ్యక్షులు నారాయణరావు, రాజారావు, పలువురు ఉద్యోగులు , పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీ రాజధాని ప్రాంత నిరుపేదలకు నివాసాలు..

• 29 గ్రామాల్లో 5024 ఇళ్ళు... • రేపటితో ముగియనున్న దరఖాస్తు గడువు • 24న తుది జాబితా విడుదల చేయనున్న సీఆర్డీప

అమరావతి, ఆంధ్రప్రభ : రాజధాని అమరావతి ప్రాంతంలో నివాసం ఉంటున్న నిరుపేదలకు ఇళ్ళు కట్టించేందుకు ప్రభుత్వం కార్యాచరణను రూపొందించింది. ఇప్పటికే రాజధాని పరిధిలో ఉన్న 29 గ్రామాల్లో రైతులకు, వ్యవసాయ కూలీలకు , అర్హులైన వారికి నెలకు రూ. 2500 సామాజిక భద్రతా పింఛన్‌తోపాటు ప్రత్యేక ఆరోగ్యశ్రీ కార్డులను మంజూరు చేసింది. తాజాగా రాజధాని పరిధిలో ఉంటున్న నిరుపేదలకు పక్కా ఇళ్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. మొత్తం 29 గ్రామాల్లో లక్షా 32వేల నివాసాలు ఉన్నాయి. రాజధాని నిర్మాణానికి ఈ గ్రామాల రైతులు 33వేల ఎకరాలు ప్రభుత్వానికి ఇచ్చారు. దీంతో వ్యవసాయంపై ఆధారపడ్డ చాలా మంది భృతిని కోల్పోయారు. వీరి సంక్షేమంపై దృష్టి సారించిన ప్రభుత్వం రాజధాని పరిధిలో ఏర్పాటవుతున్న కంపెనీలు, సంస్థల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడంతోపాటు సామాజిక పింఛన్‌లను అందిస్తోంది. తాజాగా ఈ ప్రాంత నిరుపేదలకు 5024 ఇళ్ళను మంజూరు చేసింది. అర్హులైన ప్రతి ఒక్కరికి జీ ప్లస్ 3 విధానంలో ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించింది. రాజధాని ప్రాంతంలో ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ నిర్మాణ బాధ్యతలను సీఆర్డీఏకు ప్రభుత్వం అప్పగించింది.

దీనికి సంబంధించి ప్రజలు సీఆర్డీఏకు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. ఈ మేరకు సీఆర్డీఏ అధికారులు రాజధాని ప్రాంత నిరుపేదల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ గడువు ఈ నెల 17తో ముగియనుంది.

మత్స్యకారుల జీవనోపాధి...

సంక్షేమానికి కృషి

- మత్స్యశాఖకు రూ. వెయ్యి కోట్ల బడ్జెట్
- ఈ ఏడు అందుబాటులో 74 కోట్ల చేప పిల్లలు
- రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు



సిద్దిపేట, కెఎన్ఎన్ : గత ప్రభుత్వాల హయాంలో నిర్లక్ష్యానికి గురై కుదేలైన మత్స్యశాఖను బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని కోమటి చెరువు వద్ద మత్స్య శాఖ ఏర్పాటు చేసిన మత్స్యకారుల అవగాహన సదస్సులో మంత్రి పాల్గొని ప్రసంగించారు. సొంతగా మార్కెటింగ్ చేసి తమ కాళ్లపై తాము నిలబడాలనీ వంద శాతం ఉచితంగా చేపపిల్లలను అందిస్తున్నామని వెల్లడించారు. 75శాతం స బ్సిడీతో నిధులు ఇప్పిస్తున్నామనీ, రూ. 25 లక్షలతో ఐస్ ఫ్యాక్టరీలు కడితే సబ్సిడీగా రూ. 20 లక్షలు, వలలు, తెప్పలకు రూ. 5వేలు కడితే ప్రభుత్వం రూ. 15వేల సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు.

మత్స్యకారులు ప్రమాదవశాత్తు చనిపోతే రూ. 4లక్షల నుంచి రూ. 6 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. మత్స్యశాఖను బలోపేతం చేసేందుకు సిబ్బంది నియామకం, కరీంనగర్, మహబూబ్‌నగర్ లో విద్యార్థుల కోసం రెండు మత్స్యకారుల కళాశాలలు మంజూరు చేశామని చెప్పారు.

సంపద పెరిగితే ఆదాయం పెరుగుతోందనీ, చేప విత్తనాలు ఆంధ్ర నుంచి తెచ్చి నష్టపోతున్నామనీ, సీడ్ విత్తనం తయారు చేసుకునేలా విత్తన అభివృద్ధి కేంద్రాలను నిజాం సాగర్, కడెం ప్రాజెక్టు, సింగూరులో ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వంద శాతం విత్తనాలు సొంతంగా తయారు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు పోతుందని అన్నారు. ఏడాదిలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి జిల్లాకు గోదావరి నీళ్లు పారిస్తామనీ, అనంతగిరి, రంగనాయకసాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లతో జిల్లా రిజర్వాయర్ల ఖిల్లాగా మారుతోందన్నారు. ఇకనీళ్ల బాధ ఉండదనీ, కోట్ల చేప పిల్లను ఉత్పత్తి చేసేందుకు ఈ రిజర్వాయర్లు దోహదపడుతాయని అన్నారు. చెరువు జీవనాధారమనీ, పల్లెలకు కల్పతరువనీ, చెరువుపై ఆధారపడి ఎన్నో జీవరాశులు బ తుకుతాయని తెలిపారు.ా సంఖ్యలో వస్తున్నారన్నారు. విద్యతో పాటు వైద్యారంగాన్ని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు.

'శౌర్య' వీరులకో వెబ్‌సైట్

ప్రారంభించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేదికగా శౌర్య పతక విజేతలకు మరో గౌరవం దక్కింది. స్వాతంత్ర్య వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకూ శౌర్య అవార్డులు సాధించిన వారి ఫొటోలు, పతకాలు, వివరాలుండే http://gallantryawards.gov.inవెబ్ సైట్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఢిల్లీలో ప్రారంభించారు. ఈ వెబ్‌సైట్ లో 1947 నుంచి ఇప్పటి వరకూ పతకాలు సాధించిన వారి వివరాలన్నీ ఉంటాయి. మనదేశ సాధారణ పౌరులు, పోలీసులు, ఆర్మీ, వైమానిక, పారా మిలటరీ, నేవీ వంటి సాయుధ బలగాల సిబ్బంది సాధించిన ధైర్య సాహసాలను ఈ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చని మోదీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఈ ఇంటర్నెట్ పోర్టల్‌లో భద్రపరచడం వల్ల ఎప్పటికీ వారి గాథలు సజీవంగా ఉంటాయని ఆయన ట్వీట్ చేశారు. అలాగే భారత దేశానికే గర్వకారణమైన శౌర్య పతకాలు సాధించిన హీరోల జ్ఞాపకంగా ఈ వెబ్ సైట్ ఉంటుందనీ అన్నారు. ఈ ప్రక్రియలో ప్రజలూ పాల్గొనవచ్చని ఆయన పిలుపునిచ్చారు. శౌర్య పతక విజేతలకు సంబంధించి ఏదైనా సమాచారం మీ దగ్గర ఉన్నా, వెబ్‌సైట్‌లో పొరపాటున మిస్సైనా వెబ్‌సైట్‌లోని ఫీడ్ బ్యాక్ లింక్ ద్వారా తెలియజేయవచ్చని ప్రధాని కోరారు. విధి నిర్వహణలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన, అత్యుత్తమ సేవలందించిన వారికి కేంద్ర ప్రభుత్వం వారు సాధించిన విజయాన్ని బట్టి పరమ్ వీర్ చక్ర, మహా వీర్ చక్ర, వీర్ చక్ర, అశోక్ చక్ర, కీర్తి చక్ర, శౌర్య చక్ర అవార్డులను అందజేస్తుంది. ఏడాదికి రెండు సార్లు అంటే జనవరి 26న గణతంత్ర దినోత్సవం, ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి చేతుల మీదుగా విజేతలకు ఈ అవార్డులు అందజేస్తారు. ఇప్పటివరకూ 21 మంది పరమ్ వీర్ చక్ర, 218 మంది మహా వీర్ చక్ర, 1322 మంది వీర్ చక్ర, 83 మంది అశోక్ చక్ర, 453 మంది కీర్తి చక్ర, 1997 మంది శౌర్య చక్ర అవార్డులు అందుకున్నారు. ఏయే అవార్డు ఏ ఆకారంలో ఉంటుంది..? ఎలాంటి విజయం సాధించిన వారికి ఏ అవార్డు ఇస్తారు..? వంటి వివరాలనూ గ్యాలంట్రీ అవార్డ్స్ వెబ్ సైట్‌లో పొందు పరిచారు. వెబ్ సైట్ లింక్‌ను ఓపెన్ చేసి సెర్చ్ ఆప్షన్‌లో సదరు సిబ్బంది, అధికారి లేదా పౌరుడి పేరు, ఫలానా ఏడాది, ఏ బలగాలకు చెందిన వారు అనేది టైప్ చేస్తే వారికి సంబంధించిన ఫొటోలు, సాధించిన అవార్డుకు సంబంధించిన వివరాలన్నీ ప్రత్యక్షమవుతాయి. ఇకపై ఈ వెబ్‌సైట్‌లో అవార్డ్ విజేతలు, వారి కుటుంబసభ్యులు ఎప్పుడంటే అప్పుడు తాము సాధించిన విజయాలను చూసుకుని ఉప్పొంగిపోవచ్చు.



దశలవారీగా పోస్టుల భర్తీకి

సీఎం కేసీఆర్ హామీ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు చేసిన ప్రకటన మేరకు వివిధ విభాగాల వారీగా పోస్టుల వివరాలు ఇలా ఉన్నాయి. వీటిని దశల వారీగా భర్తీ చేసేందుకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా దశగా వారీగా ఈ పోస్టుల భర్తీకి సీఎం హామీ ఇచ్చారు.

విభాగాలు	పోస్టులు
పోలీసు	37,820
ఎలక్ట్రిసిటీ	12,961
టీచర్లు	12,005
రెసిడెన్సియల్ స్కూళ్ళు	8,511
మెడికల్, హెల్త్	8,347
సింగరేణి	7,485
ఆర్టీసీ	3,950
కొత్త రెసిడెన్సియల్ స్కూళ్ళు	3,925
రెవెన్యూ	2,506
వ్యవసాయ, ఉద్యానం	2,435
అటవీ	2,033
పురపాలక, పట్టణాభివృద్ధి	1,952
ఉన్నత విద్య	1,678
ఇరిగేషన్	1,058
ఆర్థిక	720
స్త్రీ, శిశు సంక్షేమ	587
రోడ్లు, భవనాలు	513
ఎక్సైజ్	340
ట్రాన్స్‌పోర్ట్	182
పంచాయతీరాజ్	3,528
ఈ పోస్టుల్లో ఇప్పిటికే భర్తీ అయినవి -	27,660
రిక్రూట్‌మెంట్ ప్రాసెస్‌లో ఉన్నవి -	36,806
కొత్తగా నోటిఫికేషన్లు జారీ చేయాల్సినవి -	48,070
ప్రభుత్వం ప్రకటించిన మొత్తం పోస్టులు -	1,12,536.

ట్రంప్‌నకు తాలిబన్ల బహిరంగ లేఖ

కాబూల్: ముస్లిం తీవ్రవాద సంస్థ తాలిబన్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు బహిరంగ లేఖ రాసింది. గత 16 సవంత్సరాలుగా ఆఫ్ఘనిస్తాన్‌లో తిష్టవేసిన అమెరికాతన బలగాలను వెనక్కు తీసుకోవాలని లేఖలో పేర్కొంది. గత అమెరికా అధ్య క్షుడు ఆఫ్ఘనిస్తాన్ విషయంలో తీ సుకున్న నిర్ణయాలను పునః సమీ క్షతో అమెరిక తప్పు చేసిందని అం గీకరించినట్లయిందని తాలిబన్ అధికార ప్రతినిధి జబీముల్లా ముజాహిద్ లేఖలో పేర్కొన్నారు. ఆఫ్ఘనిస్తాన్ లోని బలగాలను ఉపసంహరించుకొనే విషయంలో ట్రంప్ ఏక పక్షంగా వ్యవహరించనప్పటికి బలగాల పెంపు నిర్ణయాన్ని వాయిదా వేసుకోవడమో, లేక ఉపసంహరించుకోవడమో చేయాలన్నారు.

చిన్నమ్మకు అవే రాచమర్యాదలు



బెంగళూరు: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి శశికళ(చిన్నమ్మ) ఇప్పుడు కర్నాటక పౌరుల (జైలు అధికారుల)కు సోదరి అయ్యారు. ఎలాగంటారా... సాధారణ ఖైదీగా ట్రీట్ చేయాల్సిన జైలు అధికారులు ఆమెకు అసాధారణ రీతిలో సకల సౌకర్యాలు అందిస్తూ, పరప్పన అగ్రహారం కేంద్ర కారాగార జైలు అధికారులు, సిబ్బందితో సిస్టర్ అని పిలిపించుకునే స్థాయికి ఎదిగారు. ఈ విషయాన్ని బెంగళూరుకు చెందిన సామాజిక కార్యకర్త నరసింహమూర్తి ఈ వివరాలను బైటపెట్టారు. నాలుగేళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న శశికళ జైలు జీవితం గురించి సమాచార హక్కు చట్టం ద్వారా ఆయన సేకరించిన వివరాలను తమిళ సాయంకాల దినపత్రిక 'తమిళ్ మురసు' ప్రచురించింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. సాధారణ ఖైదీగా జీవనం గడపాల్సిన శశికళ జైలు నిబంధనలకు ఏమాత్రం లోబడకుండా వ్యవహరిస్తున్నట్లు నరసింహమూర్తి సమాచారం సేకరించానని తెలిపారు. ప్రత్యేక దుస్తులు, ఐదు గదుల్లో వసతులు, ప్రత్యేక వంటగది, పనివారలు, బయట నుంచి మందులు, కాళ్లు, చేతులు మసాజ్ చేసేందుకు పనివారు. ఇంకా అనేక సౌకర్యాలు పొందుతున్నట్లు కర్నాటక జైళ్ల శాఖ మాజీ డీఐజీ రూప మౌద్గిల్ లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేసిన సంగతి ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. జైళ్ల శాఖ ఉన్నతాధికారులకు శశికళ రూ.2 కోట్లు ముడుపులు చెల్లించి ఆ సౌకర్యాలు పొందుతున్నట్లుగా డీఐజీ రూప చేసిన ఆరోపణలపై కర్నాటక ప్రభుత్వం రిటైర్డు ఐఏఎస్ వినయ్‌కుమార్ విచారణ జరుపుతున్నా, ఆ విచారణలో పురోగతి ఏమాత్రం లేదని తెలుస్తోంది. కానీ, శశికళ దర్జా జీవితాన్ని కొనసాగిస్తున్నారని ఆయన అన్నారు.

2018 జూన్ 3న సివిల్స్ సర్వీసెస్

ప్రిలిమ్స్ షెడ్యూల్ విడుదల చేసిన యూపీఎస్సీ

న్యూఢిల్లీ: ప్రతి ఏడాది ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్ ప్రిలిమ్స్ పరీక్షల షెడ్యూల్‌ను యూనియన్ పబ్లిక్ సర్వీసెస్ కమిషన్(యూపీఎస్‌సీ) విడుదల చేసింది. వచ్చే ఏడాది నిర్వహించబోయే సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష 2018 షెడ్యూల్ ప్రకారం జూన్ 3న నిర్వహించనున్నట్లు తెలిపింది. యుపీఎస్‌సీ రికార్డుల ప్రకారం ఈ ఏడాది జూన్ 18న ప్రిలిమ్స్ పరీక్ష జరిగింది. 2015, 2016 సంవత్సరాల్లో ఆగస్టు నెలలో ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించారని, అయితే, 2013లో మాత్రం మే 26న ప్రిలిమ్స్ నిర్వహించామని యుపీఎస్‌సీ పేర్కొన్నది. వచ్చే సంవత్సరం యుపీఎస్‌సీ నిర్వహించే పరీక్షల షెడ్యూల్ ప్రకారం సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షను జూన్ 3న ఖరారు చేసినట్లు బోర్డు తెలిపింది. దీనికి సంబంధించి నోటిఫికేషన్ వచ్చేఏడాది ఫిబ్రవరి 7న ప్రకటించనుందని, అభ్యర్థులు దరఖాస్తు చేసుకొనుటకు మార్చి 6, 2018 ఆఖరు తేదీగా నిర్ణయించినట్లు తెలిపింది. ఇండియన్ అడ్మినిస్ట్రేషన్ సర్వీసెస్ (ఐఏఎస్), ఇండియన్ ఫారెన్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్), ఇండియన్ పోలీస్ సర్వీసెస్ (ఐపీఎస్), ఇతర పరీక్షలను యూపీఎస్‌సీ ప్రతి సంవత్సరం మూడు స్టేజీల్లో నిర్వహిస్తుంది. అవి ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ ద్వారా ఆయా పరీక్షల్లో ఫలితాలు సాధించిన అభ్యర్థులను ఎంపిక చేస్తుంది.

UPSC

నంద్యాలలో నువ్వా నేనా?



- మునిసిపల్‌లో సామాజిక'రణం'
- స్థానిక నేతలే కీలకం
- టౌన్‌లో పట్టు కోసం పకడ్బందీ ప్రచారం
- మొత్తం ఓటర్లు 1.36.743
- పోలింగ్ స్టేషన్లు 149





నంద్యాల, ఆంధ్రప్రభ: వర్తక, వాణిజ్య, రాజకీయ, విద్యా, ఆధ్యాత్మిక, పారిశ్రామిక కేంద్రంగా విరాజిల్లుతున్న నంద్యాల ఉప ఎన్నికల నేపథ్యంలో మరోసారి రాష్ట్ర, దేశ ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. ఒకప్పుడు నందల్లూరు పేరుతో పిలువబడిన ఈ పట్టణం శివుడి వాహనమైన నంది ద్వారా నంద్యాలగా రూపాంతరం చెందింది. చుట్టూ కొండలు, పడమర కుందూ నది, తూర్పున నల్లమల అటవీ ప్రాంతం, దక్షిణాన గ్రానైట్ ఖనిజ ప్రాంతాన్ని కలిగి వుంది. రాజకీయంగానూ ఎంతో ప్రాచుర్యం కలిగి చైతన్యవంతమైన ప్రాంతంగా పరిగణింపబడుతున్న నంద్యాలలో నీటి వనరులకు పెట్టిందిపేరు. 1890 లోనే మొట్టమొదటి సారిగా రైల్వే సౌకర్యం ఏర్పడిన అనంతరం శరవేగంగా ఏర్పడిన నంద్యాల ప్రాంతం 1900 సంవత్సరంలోనే మునిసిపాలిటీగా అవతరించింది. భారత జాతిపిత మహాత్మాగాంధి, తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ వంటి నేతలు నంద్యాలను సందర్శించినవారిలో వున్నారు. 2011 లెక్కల ప్రకారం నంద్యాల పట్టణంలో 2,69,368 మంది జనాభా వున్నారు. అయితే 2017 గణాంకాల ప్రకారం నంద్యాలలో 2,89,571 జనాభా వుంది. వీరిలో పురుషులు 1,35,267 మంది, మహిళలు 1,34,101 మంది వున్నారు. నంద్యాల పట్టణంలో మొత్తం 149 పోలింగ్ స్టేషన్లు వున్నాయి. నంద్యాల శాసనసభా నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,36,743 మంది కాగా, వారిలో పురుషులు 67,532 మంది, మహిళలు 69,211 మంది వున్నారు. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే నంద్యాల నియోజకవర్గంలో సామాజికవర్గాల ప్రభావం అధికం. ఎస్.సి.లు 30,103 మంది, ఎస్.టి.లు 1,314 మంది, బిసిలు 36,637 మంది, మైనారిటీలు 28,313 మంది, ఓ.సి.లు 56,542 మంది, ఇతరులు 224 మంది వున్నారు. అదే విధంగా నంద్యాల పట్టణంలో అయితే ఎస్.సి లు 8,844 మంది, ఎస్.టి.లు 724 మంది, బిసిలు 10,470 మంది, మైనారిటీలు 8,615 మంది, ఓ.సి.లు 21,782 మంది, ఇతరులు 400 మంది వున్నారు.

సమీకరణలు కీలకం

2014లో జరిగిన శాసనసభ ఎన్నికలలో ఫలితాన్ని ప్రభావితం చేసిన నంద్యాల పట్టణంపై అందరి దృష్టి మళ్ళింది. కులాల సామాజిక సమీకరణలు కీలకభూమిక పోషించే ఈ ఎన్నికలలో ఆ దిశగా అన్ని రాజకీయపక్షాలు కసరత్తు ప్రారంభించాయి.

అటు నుంచి ఇటు- ఇటు నుంచి అటు


గత సాధారణ ఎన్నికల నాటి పరిస్థితులలో మార్పు రావడంతో నాయకులు కూడా పార్టీలు మారారు. వైఎస్సార్‌సిపి చెందిన నంద్యాల అభ్యర్థి శిల్పా మోహన్ రెడ్డి 2014లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. అదే అభ్యర్థి టిడిపి నుంచి కాకుండా వైఎస్సార్‌సిపి నుంచి బరిలోకి దిగడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఫలితంగా లువురు నాయకులు కూడా పార్టీ మారారు. శిల్పా మోహన్ రెడ్డి పై విజయం సాధించిన భూమా నాగిరెడ్డి మరణించగా, తాజాగా అదే కుటుంబం నుంచి బ్రహ్మానందరెడ్డి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఉప ఎన్నికలోనూ మళ్ళీ రెండు కుటుంబాలకు చెందిన అభ్యర్థులే తలపడుతున్నారు. అయితే పార్టీలుమాత్రమే వేరు. దీంతో నంద్యాల ఉప ఎన్నికలు నువ్వా, నేనా అనే రీతిలో జరుగుతున్నాయి.

ధర్మానికి ఓటు... న్యాయానిదే గెలుపు

నంద్యాల, ఆంధ్రప్రభ: ఓటర్లు ధర్మానికి మాత్రమే ఓటు వేసి న్యాయాన్ని గెలిపించాలని వైసీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి కోరారు. ఓటరుకు 5 వేల రూపాయలు ఇచ్చి దేవుడిపై ప్రమాణం చేయించుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్ల లౌక్యంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏడవ రోజు ఆయన నంద్యాల పట్టణంలోని వివిధ ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. రోడ్‌షోలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉద్వేగంగా ప్రసంగిస్తూ చంద్రబాబు దుర్మార్గమైన పాలనకు చరమగీతం పాడాల్సిన ఆవశ్యకత వుందని పేర్కొన్నారు. ప్రత్యేక హోదాను ఢిల్లీలో తాకట్టు పెట్టారని, అయిదు, పది కాదు, పదిహేనేళ్ళ పాటు ప్రత్యేక హోదాను తెస్తామని చెప్పి ప్లేటు ఫిరాయించారని పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రంలో ఎమ్మెల్యేలను కొంటూ ఆడియో, వీడియోల్లో అడ్డంగా దొరికిపోయారని వ్యాఖ్యానించారు. రాజకీయ నేతలు మాటపై నిలబడాలని, లేదంటే కాలర్ పట్టుకుని నిలదీసే పరిస్థితి రావాలన్నారు. రాష్ట్రంలో ప్రతి సామాజికవర్గాన్ని మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని, కేంద్రంతో లాలూచీ పడి వున్న కేసుల నుంచి చంద్రబాబు రక్షణ పొందారని ఆరోపించారు. హామీల పరంపరలో భాగంగా ఇంటికో కారు, కిలో బంగారం కూడా ఇస్తానని మోసం చేస్తారని చెప్పారు. దేవుడి దయ, ప్రజల ఆశీస్సులు తనకు కావాలని కోరారు. జాబ్ రాకపోతే ఇంటింటికి రెండు వేల రూపాయల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి మాట తప్పారని విమర్శించారు. ఆ లెక్కన గత 38 నెలల కాలంలో ఒక్కొక్కరికి 76 వేల రూపాయలు బకాయి పడ్డారని గుర్తు చేశారు.

నా రాజీనామాతో మంత్రులు, ఎమ్మెల్యేలకు

కనువిప్పు కావాలి



నంద్యాల, ఆంధ్రప్రభ: తాను నైతిక విలువలకు కట్టుబడి శాసనమండలి సభ్యత్వానికి రాజీనామా చేశానని, శిల్పా కుటుంబం అంటేనే నైతికతకు మారుపేరని వైసీపీ నేత శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ పదవికి చక్రపాణిరెడ్డి చేసిన రాజీనామాను శాసనమండలి ఇన్‌చార్జి చైర్మన్ రెడ్డి సుబ్రమణ్యం కేవలం పది రోజుల వ్యవధిలోనే మంగళవారం ఆమోదించారు. ఈ నేపథ్యంలో ఆయన నంద్యాలలోని పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రభ ప్రతినిధితో మాట్లాడుతూ తన మాదిరిగానే పార్టీ ఫిరాయించిన మంత్రులు, ఎమ్మెల్యేలు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేసి సత్సంప్రదాయానికి శ్రీకారం చుట్టాలని సూచించారు. తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామాతో మంత్రులు, ఎమ్మెల్యేలు కనువిప్పు చెందాలన్నారు. ఫలితంగా భావితరాలకు మంచి సందేశాన్ని ఇవ్వాల్సిన ఇవ్వాల్సిన ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. తమ కుటుంబం నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, వాటిని రుజువు చేస్తే జైలుకు వెళ్ళడానికి సిద్దమని టిడిపి నాయకులకు సవాల్ చేశారు. తొలుత పదవులకు రాజీనామా చేసి వైసీపీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు నంద్యాలలో ప్రజలను ఓట్లు అడగాలని అన్నారు. తాను నిర్ణీతమైన ఫార్మట్‌లో రాజీనామా చేసినప్పటికీ డ్రామాలాడుతున్నానం టూ తెలుగుదేశం నేతలు ఎద్దేవా చేశారని, రాజీనామా ఆమోదించాక, ఇప్పుడు ఏమి సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. నంద్యాల ఎన్నికలలో చక్రం తిప్పుతానని, వైసీపీకి విజయం అందించడమే తన లక్ష్యమని చెప్పారు. శిల్పా కుటుంబం నిజాయితీ ఏమిటో నంద్యాలలో తాము చూపిస్తామని చెప్పారు. రాజీనామా విషయంలో తొందరపడవద్దంటూ కౌన్సిల్ చైర్మన్ తనకు తిరుపతి నుంచి ఫోన్ చేసి కోరారని, కానీ తాను పార్టీ మారినందువల్ల నైతిక విలువలకు కట్టుబడి రాజీనామా చేసినట్టు చెప్పానని, రాజీనామాను కూడా తక్షణమే ఆమోదించాల్సిందిగా కోరానని చక్రపాణిరెడ్డి తెలిపారు.

జగన్‌ సిఎంగా చూడాలనేదే తపన

వైఎస్సార్‌సిపి అధ్యక్షుడు వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చూడాలనేదే తన తపన అని చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. రాజీనామా చేసిన 21 మంది ఎమ్మెల్యేల రాజీనామాలను ఏ.పి అసెంబ్లీ స్పీకర్ ఎందుకు ఆమోదించడం లేదని ప్రశ్నించారు. పదవులు లేకుంటే కొంపలేమైనా మునుగుతాయా అని వ్యాఖ్యానించారు. కొంత మంది ఎమ్మెల్యేలలో అయినా కొంతమేరకు మార్పు వస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

విజయదశమి నుంచి అన్న క్యాంటీన్లు

71వ స్వాతంత్ర్య దినోత్సవ వేదికపై చంద్రబాబు ప్రకటన



తిరుపతి, కెఎన్ఎన్ బ్యూరో: ఈ ఏడాది విజయదశమి పర్వదినం రోజున రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణాల్లో అన్న క్యాంటిన్లను ప్రారంభించను న్నట్లు రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీయూ స్టేడియం లో మంగళవారం జరిగిన దేశ 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ దేశ స్వాతం త్ర్యం కోసం పోరాడిన మహాత్మాగాంధీ, సర్దార్ పటేల్ వంటి జాతీయ నాయకుల నుంచి అల్లూరి సీతారామరాజు, ప్రకాశం పంతులు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వంటి తెలుగువారిని మరచిపోరాదన్నారు. పొట్టి శ్రీరాములు ఆత్మత్యాగంతో దేశంలోనే తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ పాలకుల దురాగతం కారణంగా రెండుగా విడిపోయినప్పుడు తట్టాబుట్టలతో, రాజధాని నగరం కూడా లేకుండా, నెత్తిన అప్పులతో నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మిగిలిం దనే చరిత్రను ప్రతిఒక్కరూ మరచిపోకూడదన్నారు. మూడేళ్ల క్రితం దక్షిణాది రాష్ట్రాలన్నిటిలో ఆర్థికంగా వెనుకబడిన దుస్థితిలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను కోలుకునేలా చేసి దేశంలోని అగ్రగామిగా నిలపాలన్నదే తన తపనకు అందరి సహకారం అవసరమన్నారు. ఆ లక్ష్యానికి అనుగుణంగానే రాష్ట్రానికి ప్రాణప్రదమైన పోలవరం ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన చేపట్టామన్నారు. ప్రధానమంత్రిగా నరేంద్రమోడీ ప్రమాణ స్వీకారం చేసే కార్యక్రమానికి హాజరై తాను చేసిన విజ్ఞప్తి మేరకు 7 మండలాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేర్చారని పేర్కొం టూ అదే పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నాంది అయింద న్నారు.అడిగిన ప్రత్యేక హోదా లేదన్న కేంద్రం ప్రత్యేక ప్యాకేజి ద్వారా రాష్ట్రాన్ని ఆదుకుంటానన్నదన్నారు. 2018 నాటికి పోలవరం పూర్తి చేసుకోవడంతో పాటు కేంద్రం నుంచి రాష్ట్రానికి అవసరమైన నిధులు, ప్రాజెక్టులు తెచ్చుకోవడం, ఉమ్మడి రాష్ట్ర విభజన చట్టానికి సంబంధించి రావాల్సిన ప్రయోజనాలను సాధించుకోవడం తమ ముందున్న పెద్ద లక్ష్యాలని వివరించారు. విభజన తర్వాత ఇరు రాష్ట్రాల మధ్య వీడని చిక్కుముడులుగా సమస్యల విషయంలో న్యాయస్థా నాన్ని ఆశ్రయించి అయినా పరిష్కారం సాధిస్తామని చంద్ర బాబునాయుడు స్పష్టం చేశారు. ఆర్థికపరమైన సమస్యలు ఎన్నిఉన్నా వివిధ వర్గాల సంక్షేమం విషయంలో కానీ, ఎన్నికల హామీల విషయంలోకానీ రాజీపడకుండా నిధులను కేటాయిస్తామని స్పష్టం చేశారు. తనపై నమ్మకంతో రాజధాని నగరం కోసం రూ. 40 వేల కోట్ల విలువైన 35 వేల ఎకరాలు ఇచ్చిన రైతుల ఆశయానికి తగినట్టుగా అంతర్జాతీయ ప్రమాణాలతో అమరావతిని నిర్మించడానికి కృషి చేస్తున్నామన్నారు. వివిధ కులాల సంక్షేమానికి కృషి చేయడంతో పాటుఅగ్రవర్ణాలలోని నిరుపేదల సంక్షేమం కోసం కూడా ప్రత్యేకంగా నిధులు విడుదలచేస్తున్నామన్నారు. రాష్ట్రంలో నీటి ప్రాజెక్టులనుపూర్తి చేయడానికి ఇప్పటివరకు రూ. 43 వేల కోట్లు ఖర్చు చేశామని పేర్కొంటూ రూ. 13 వేల కోట్లతో మూడు నెలల్లో మూడు రోజులకొక ప్రాజెక్టు చొప్పున 28 ప్రాజెక్టులను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కృష్ణా జలాలను మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలతో పాటు తెలంగాణాతో కూడా పంచుకోవాల్సిరావడంతో శ్రీశైలం ప్రాజెక్టులో ఆశించిన స్థాయి నీళ్లు రావడం లేదన్నారు. సముద్రం పాలవుతున్న లక్షల క్యూసెక్కుల గోదావరి నదీ జలాలను కృష్ణానదితో అనుసంధానం చేయడం ద్వారా రాష్ట్రానికి నీటి సమస్య లేకుండా చేయాలన్నదే తన ఆశయమని తెలిపారు. నీళ్లు జల సంరక్షణ ప్రాధాన్యతను గురించి అందరిలో అవగాహన పెంపొందించడానికి ఈ నెల 25వ తేదినుంచి 30వతేదివరకు రాష్ట్ర వ్యాప్తంగా జలసిరికి హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొంటూ ప్రజలందరూ ఆ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్లకు తగినట్టుగా పండ్లు, కూరగాయల పెంచడంపై రైతాంగం దృష్టిని మళ్లించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటి చేస్తామన్నారు. యువకులకు నైపుణ్య అభివృద్ధి సంస్థలు ఏర్పాటు చేయడంతో పాటు అంతర్జాతీయ పరిశ్రమలను ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలను పెంచుతామన్నారు. వివిధ రకాల హామీలను అంచెల వారీగా నెరవేరుస్తున్నట్టుగానే నిరుద్యోగ యువకులకు నెలనెలా ఇస్తామన్న 2,500 నిరుద్యోగ భృతి హామీపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడదాం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: హైదరాబాద్‌లోగల వైఎస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీఅధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి జెండా ఎగురవేశారు. అనంతరం ఆ పార్టీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య విలువలను కాపాడుదన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేంద్రకార్యాలయంలో ఎంపీ మేకపాటి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహానుభావుల ఆత్మబలిదానాలతో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు.

నాడు 33 కోట్ల మంది దేశ ప్రజల సౌభాగ్యాన్ని ఆశించారన్నారు . నేడు 130కోట్ల దేశ ప్రజలకు సౌభాగ్యఫలాలు అందాలన్నారు. విలువలతో కూడిన గొప్ప ప్రజాస్వామ్య దేశంగా ముందుకు సాగాలన్నారు. ఏపీలో అరాచక పాలన సాగుతోందన్నారు. ప్రజలే ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని మేకపాటి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వైకాపా అధ్యక్షుడు గట్టు శ్రీకాంత్ రెడ్డి, వాసిరెడ్డి పద్మ ,పీఎన్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులతో ప్రధాని మోడీ కరచాలనం


బీఎస్ఎఫ్ జవానుల జెండా పండుగ


జెండావందనం తరువాత ఎర్రకోట నుంచి బయటకు వస్తున్న జనం


The New York Times.

1947 ఆగస్టు 16న న్యూయార్క్ టైమ్స్ పత్రికలో నూతన భారతదేశం

వెల్లివిరిసిన భారతీయం

మరోసారి మోడీ జనామోద ప్రసంగం చేసారు. ఎర్రకోటపై నుంచి క్రొంగొత్త భారత్‌ను నిర్మిద్దామని చెప్పి, అందుకు ఏం కావాలో వివరించారు. క్విట్ ఇండియా ఉద్యామానికి 75 ఏళ్లు పూర్తయిన నేటి నుంచి, స్వాతంత్ర్యానికి 75ఏళ్లు నిండే 2022 నాటికి అవినీతి రహిత భారత్ వస్తుందని ఆశలు రేపారు. అందుకు పునాది అన్నట్లు నోట్ల రద్దు ప్రయోజనాలు ఏకరువు పెట్టి, జీఎస్టీలో పారదర్శకతను మెచ్చుకున్నారు. సామాన్యులకు మంచి రోజులొస్తాయని చెప్పిన ఆయన మాటల్లోని సహకార ఫెడరలిజం, ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి ప్రశంసలను కూడా పొందింది. భూతల స్వర్గం లాంటి కాశ్మీర్ లక్ష్యమంటూనే, ఉగ్రవాదులను ఉపేక్షించబోమన్నారు. అలాగని బులెట్ తోనే అన్నీ జరుగుతాయని తాననుకోవడం లేదని వెల్లడించారు. యథాప్రకారం తన వేషధారణతో అందరినీ మెప్పించారు.

మోడీ ప్రసంగానికి నారాయణ మూర్తి ప్రశంసలు



బెంగళూరు: ప్రధాని నరేంద్ర మోడీ ఎర్రకోటపై నుంచి చేసిన ప్రసంగం అద్భుతంగా ఉందని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నారాయణ మూర్తి కొనియాడారు. పోటీతత్వ సహకార సమాఖ్య(కాంపిటీటివ్ కోఆపరేటివ్ ఫెడరలిజమ్) ఆలోచన ఎంతో గొప్పదని కీర్తించారు. పంద్రాగస్టు సందర్భంగా మోడీ ప్రసంగిస్తూ.. 'నేను గతంలో ముఖ్యమంత్రిగా కూడా పనిచేశాను. దేశాభివృద్ధిలో రాష్ట్రాలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. రాష్ట్రాల మధ్య సహకార సమాఖ్య వ్యవస్థపై మేం దృష్టి పెట్టాం.కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అన్నదమ్ముల మాదిరిగా పరస్పర సహకా రంతో ప్రగతి పథంలో ముందుకు సాగుతున్నాయి. జీఎస్టీ, స్మార్ట్ నగరాల ప్రాజెక్టు, స్వచ్ఛభారత్, వాణిజ్య అనుమతుల సరళతరం వంటికార్యక్రమాల అమలుకు ప్రభుత్వాలు పరస్పర సహకారంతో ముందుకు వెళ్తున్నాయి' అని అన్నారు. ఈ వ్యాఖ్యలను నారాయణ మూర్తి ప్రశంసించారు.

నాలుగు ప్రసంగాల్లో చిన్నది

స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంపై దేశ ప్రజలకు ఇచ్చిన హామీని ప్రధాని నరేంద్ర మోడీ నిలబెట్టుకున్నారు. 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి మోడీ ప్రసంగించారు. ముందు చెప్పినట్లే తన ప్రసంగాన్ని గంటలోపే ముగించారు. గత నాలుగేళ్ల లో మోడీ ప్రసంగం తక్కువ సమయంలో ముగియడం ఇదే మొదటిసారి. గత నెలలో 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమం సందర్భంగా మోడీ.. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంపై ప్రజల నుంచి సూచనలు, సలహాలు కోరారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం ఎక్కువ సమయం కొనసాగుతోందని పలువురు తనకు ఉత్తరాల ద్వారా ఫిర్యాదు చేశారని మోడీ ఈ సందర్భంగా తెలిపారు. ఈసారి తన ప్రసంగాన్ని గంటలోపే ముగిస్తానని హామీ ఇచ్చారు. చెప్పినట్లుగానే తన ప్రసంగాన్ని 54 నిమిషాల్లో ముగించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా మోడీ 2014లో 65 నిమిషాలు ప్రసంగిస్తే.. 2015లో 86 నిమిషాలు, గత ఏడాది 94 నిమిషాల పాటు ప్రసంగించారు. ఈ సారి మోడీ ప్రసంగంపై ప్రజల నుంచి 8 వేలకుపైగా సూచనలు, సలహాలు అందినట్లు ప్రధాని కార్యాలయం తెలిపింది.

గాలిపటం కలకలం

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్రమోడీ జాతినుద్దేశించి ప్రసంగిస్తున్న సమయంలో ఓ గాలిపటం కలకలం రేపింది. మోడీ ప్రసంగిస్తున్న పోడియం వద్ద నల్లటి గాలిపటం ఎక్కడి నుంచో ఎగురుకుంటూ వచ్చి పడింది. అయితే, ప్రధాని మాత్రం తన ప్రసంగాన్ని యథావిధిగా కొనసాగించారు. ప్రధాని ప్రసంగం ముగింపు దశకు చేరుకున్న దశలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్వాతంత్ర్య దినోత్సవం, కృష్ణాష్టమి నేపథ్యంలో దేశ రాజధాని దిల్లీలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. వేలాది మంది భద్రతా సిబ్బంది గస్తీ నిర్వహించారు. 9100 మంది ఢిల్లీ పోలీసులతో సహా వేలాది మంది పారామిలటరీ సిబ్బంది మొఘల్ గార్డెన్‌కు పహారాగా నిలిచారు.

ముఖ్యంగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మంత్రులు, అధికారులు, విదేశీ ప్రతినిధులు, హాజరవుతున్న నేపథ్యంలో ఎర్రకోట వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎర్రకోటకు వెళ్లే రహదారిలో పోలీసు, పారామిలటరీ దళాలు మోహ రించడంతో పాటు, వందలాది సీసీ కెమెరాల ద్వారా శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

భద్రతా వలయంలో ఎర్రకోట

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎర్రకోటను భద్రతా బలగాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఉగ్రాదాడులు జరగొచ్చని నిఘా వర్గాలు హెచ్చరించడంతో ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, ఢిల్లీ పోలీసులు..కేంద్ర బలగాలు ఎర్రకోట చుట్టూ రక్షణ కవచంలా నిలిచాయి. ఎర్రకోట చుట్టు పక్కల దాదాపు 500 ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎర్రకోట లోపల 50 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.కోట పరిసరాలను మంగళవారం నాన్ ఫ్లైజోన్ గా ప్రకటించారు. 6వేలకు పైగా పోలీసులను భద్రత కోసం వినియోగించారు. హెలికాప్టర్ల ద్వారా భద్రతను పర్యవేక్షించారు.

మోడీ ప్రసంగంపై విపక్షాల పెదవి విరుపు

ప్రధాని మోడీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంపై విపక్షాలు పెదవి విరిచాయి. మోడీ ప్రసంగంలో కొత్తేమీ లేదన్న ప్రతిపక్షాల నాయకులు... మూడేళ్ల పాలనకు ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను మోడీ ప్రభుత్వం నెరవేర్చలేకపోయిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆనంద్ శర్మ విమర్శలు గుప్పించారు.

నెహ్రూను తలపించిన మోడీ

ప్రధాని మోడీ ...దేశ ప్రథమ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూను తలపిస్తున్నారు. చిన్నపిల్లలంటే అమితంగా ఇష్టపడే చాచానెహ్రూ... సమయం దొరికితే చాలు..చిన్నారులతోనే గడిపేవారు. ఏ సభకు వెళ్లినా..చిన్నారులు కనిపిస్తే ఆప్యాయంగా పలకరించి బాగా చదువుకోవాలని చెప్పేవారు..ప్రస్తుత ప్రధాని నరేంద్రమోడీ కూడా చిన్నారులకు నెహ్రూలా కనిపిస్తున్నారు. మోడీ కూడా చిన్నారులతో గడిపేందుకు ఇష్టపడుతుంటారు. అందుకే వారి కోసం ప్రోటోకాల్‌ను సైతం లెక్కచేయరు. గతేడాది స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రసంగాన్ని ముగించుకుని వాహనంలో వెళ్తున్న మోడీ వైపు చిన్నారులు ఆసక్తిగా చూడగాన్ని గమనించిన మోడీ..తన వాహన శ్రేణి చిన్నపిల్లల దరి చేరగానే నిలిపివేసి..వారితో కరచాలనం చేశారు. ఈ స్వాతంత్ర్య దినోత్సవం రోజు చి న్నారులపై తనకున్న ప్రేమను చాటుకున్నారు. ఎర్రకోటపై జాతీయ జెండా ఎగరవేసి ప్రసంగం ముగించిన తర్వాత మోడీ బాలకృష్ణుల వేషాధారణలో ఉన్న చిన్నారుల వైపు అడుగులు వేశారు. ప్రోటోకాల్‌ను లెక్కచేయ కుండా చిన్నారులతో కలచాలనం చేశారు.

విదేశాల్లో మువ్వన్నెలు

బీజింగ్/మెల్‌బోర్న్: దేశ కీర్తిని ప్రపంచ నలువూలలకు చాటె జెండా పండుగను భారతీయులు ఎంతో గౌరవంగా భావిస్తారు. 71వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ దేశాల్లో నివసించే భారతీయులుస్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా దేశాల రాయభార కార్యాలయాల్లో, ఎన్ఆర్ఐల నివాస ప్రదేశాల్లో, విద్యాసంస్థల పరిధిలో జాతీయ జెండాను ఎగరవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. చైనా, ఆస్ట్రేలియా, జపాన్, సింగపూర్, ఈజిప్ట్, ఇజ్రాయెల్, దక్షిణ ఆఫ్రికా తదితర దేశాల్లో ఎన్ఆర్ఐలు జెండా పండుగను వైభవంగా జరుపుకున్నారు. తమకు స్వేచ్ఛ, స్వాతంత్రం, అస్తిత్వాన్ని ఇచ్చిన స్వాతంత్ర్య దినోత్సవాన్ని గుర్తు చేసుకుంటూ మిఠాయిలు పంచుకున్నారు. చైనాలోని రాయభార కార్యాలయంలో వందలాదిమంది భారతీయుల సమక్షంలో భారత జాతీయ జెండాను ఎగరవేశారు. చైనాలోని భారత రాయభారి విజయ్ గోఖలే రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింగ్ జాతినుద్దేశించి చేసిన ప్రసంగాన్ని ఎన్ఆర్ఐలకు చదివి వినిపించారు.

కాశ్మీర్ కబుర్లు

మోడీ వ్యాఖ్యలకు అఖిలపక్షం ఆనందం

శ్రీనగర్: 71వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జమ్మూ కశ్మర్‌లో నెలకొన్న ప్రతిష్టంభనపై చేసిన వ్యాఖ్యలను ఆ రాష్ట్ర రాజకీయవర్గాలు పెద్ద ఎత్తున స్వాగతించాయి. కశ్మీర్‌లో శాంతి స్థాపనకు కృషి జరగాలని మోడీ చెప్పడంపై అన్నివర్గాల ప్రజానీకం కూడా హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికార పార్టీ అయిన పీడీపీ అధినేత, ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ మోడీ వ్యాఖ్యలు స్వాగతించారు. ఎటువంటి సమస్యలైనా చర్చలతోనే పరిష్కారమవుతాయన్నారు. చర్చలే కీలక పాత్ర పోషిస్తాయని ప్రధాని గుర్తు చేసినట్టు తెలిపారు. కశ్మీర్‌లో శాంతి కోసం తాము వేర్పాటువాదులతో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మోడీ మాటలను తాము గట్టిగా నమ్ముతున్నట్లు ఈ సందర్భంగా ఆమె ప్రకటించారు. ప్రతిపక్ష నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా కూడా ప్రధానమంత్రి వ్యాఖ్యలను సమర్థించారు. ప్రభుత్వం వేర్పాటువాదులను చర్చలకు ఆహ్వానించాలన్నారు. అప్పుడు మాత్రమే కశ్మీర్ లోయలో శాంతి నెలకొంటుందన్నారు. ఈ మేరకు ఆయన ట్విట్టర్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. కాగా, సీపీఐ ఎంపీ డీ రాజా, హురియత్ స్థానిక నాయకులు కూడా మోడీ వ్యాఖ్యలను ఆహ్వానించారు.

ఆర్టికల్ 35ఏను తీయరన్న విశ్వాసం జమ్ము కాశ్మీర్ సీఎం మెహబూబా

శ్రీనగర్: భారత న్యాయ వ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని జమ్మూ కశ్మీర్ సీఎం ముఫ్తీ మెహబూబా వ్యాఖ్యానించారు. దేశ సర్వోన్నత న్యాయస్థానంలో దాఖలైన ఆర్టికల్ 35ఏపై ఈ మేరకు ఆమె స్పందించారు. జమ్మూ కశ్మీర్ ప్రజలకు గల ప్రత్యేక హక్కులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టి వేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించే అంశంలో ఏ పార్టీ భావజాలం అడ్డంకిగా మారదన్నారు. కశ్మీర్‌ను కొంతమంది 1947కు తీసుకుపోవాలని భావిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు ఎన్ని ప్రయత్నాలు చేసినా, తామందరం సంఘటితంగా కశ్మీర్‌ను కాపాడుకుంటామని పేర్కొన్నారు. ఈ విషయంలో ఇబ్బందుల్లో పడేయాలని పలువురు యత్నిస్తున్నారని ఆరోపించారు.

లడఖ్‌లో చొరబాటుకు చైనా యత్నం



శ్రీనగర్: భారత్-చైనా సరిహద్దులో గల లడఖ్ వద్ద ఇరు దేశాల సైన్యాలు ఘర్షణకు దిగాయి. వాస్తవీన రేఖ దాటి భారత భూభాగంలోకి చొరబడేందుకు పీపుల్ లిబరేషన్ ఆర్మీ సైనికులు మంగళవారం ఉదయం రెండు సార్లు ప్రయత్నించారు. లడఖ్‌లోని ప్యాన్‌గ్యాంగ్ అనే ప్రాంతంలో రెండొంతుల ప్రాంతం చైనా చేతిలో ఉండగా, ఒక వంతు భారత్ ఆధీనంలో ఉంది. మంగళవారం చైనా సైన్యం భారత భూభాగంలోని ఫింగర్-4, ఫింగర్-5 ప్రాంతాల్లో చొరబడేందుకు ప్రయత్నించగా, భారత భద్రతా బలగాలు అడ్డుకున్నాయి. ఈ క్రమంలో చైనా సైనికులు భారతసైన్యం మధ్య తొపులాట జరిగింది. దీంతో, రెచ్చిపోయిన పీపుల్ లిబరేషన్ ఆర్మీ భారత భద్రతా దళాలపైకి రాళ్ళు రువ్వారు. భారత సైనికులు కూడా ప్రతి దాడికి దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో, భారత సైనికులు బ్యానర్ డ్రిల్ చేయడంతో ఎవరి భూభాగంలో వారు వెళ్ళినట్లు సంబంధితవర్గాలు వెల్లడిస్తున్నాయి.

హిందూ మహాసముద్రంలో చైనా జలంతర్గాముల చక్కర్లు



న్యూ ఢిల్లీ: భారత్-చైనా మధ్య ఒక వైపు డొక్లామ్ ప్రతిష్టంభన కొనసాగుండగానే డ్రాగన్ జలాంతర్గాములు హిందూ మహాసముద్రంలో చక్కర్లు కొట్టాయి. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా మహాసముద్రంలోని భారత భూభాగంలో చైనా సబ్ మెరైన్లు రావడంతో కొంత ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, హిందూ మహాసముద్రంలోకి చైనా సబ్ మెరైన్లు వచ్చిన విషయాన్ని భారత నేవీవర్గాలు మంగళవారం ధృవీకరించాయి. అయితే, చైనాకు సముద్రమార్గం ద్వారా పాకిస్థాన్‌తో ప్రత్యేక సంబంధాలున్న విషయం తెలిసిందే. చైనా నుంచి నేరుగా పాకిస్థాన్‌లోని కరాచీ నగర ఓడరేవుకు రవాణా జరుగుతుంటుంది.

గతంలో శ్రీలంకతో ఉన్నప్పటికీ, ఇటీవల కాలంలో ఆ దేశంతో పెద్దగా జలమార్గం ద్వారా చైనా ఎగుమతులు, దిగుమతులు చేపట్టడం లేదు. దీంతో పాకిస్థాన్‌తో మాత్రమే జల రవాణా ద్వారా ఎగుమతులు, దిగుమతులు జరుపుతున్నాయి. అయితే, పాకిస్థాన్ వెళ్ళే సబ్‌మెరైన్ హిందూ మహాసముద్రంలోని భారత భూభాగంలో అడుగుపెట్టినట్టు అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు.


అసోంలోని ధుబ్రిజిల్లాలోని నస్కర గ్రామంలో వరద నీటి మధ్యలో జెండావందనం

ఊరు మునిగినా... జెండాపండుగ ఆగలేదు

న్యూఢిల్లీ: పీకల్లోతు వరదలో చిక్కుకున్నా అక్కడ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆగలేదు. నలుగురు ఉపాధ్యాయులు, ఇద్దరు విద్యార్థులు కలిసి వరద నీటిలో సైతం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జనగణమన గేయం పాడుతూ 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకున్నారు. అస్సాంలోని ధుబ్రి జిల్లాలో జరిగిన ఈ సంఘటనపై దేశ వ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కుండపోత వర్షాలతో అస్సాంలోని అత్యధిక ప్రాంతాలు కొద్ది వారాలుగా వరదలో నీళ్లలోనే నానుతున్నాయి. వాగులూ, వంకలూ పోటెత్తుతున్నాయి. నస్కర ప్రాథమిక పాఠశాల కూడా ఈ నెల 13 నుంచి వరద నీటిలో మునిగిపోయింది. అయినప్పటికీ ఎలాగైనా జెండా పండుగ జరుపుకోవాలని ఉపాధ్యాయులూ, విద్యార్థులు సంకల్పించడం విశేషం. ప్రధానోపాధ్యాయుడు తజెమ్ సిక్దర్.. ఆయన సహచర అధ్యాపకులు నృపేన్ రాభా, జయ్‌దేవ్ రాయ్, మిజానూర్ రహ్మాన్‌లతో పాటు మూడవ తరగతి విద్యార్థులు జియారుల్ అలీఖాన్, హైదర్ అలీఖాన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఒకరోజు ముందు నుంచే స్వాతంత్ర్య వేడుకలకు ప్లాన్ చేశామనీ... జాతీయ గీతంతో పాటు వందేమాతర గేయం ఆలపించినట్టు రహ్మాన్ పేర్కొన్నారు. పిల్లల్ని ఎక్కువ సేపు నీటిలో ఉంచకూడదు కాబట్టి అసెంబ్లీని వేగంగా ముగించినట్టు వెల్లడించారు


అసోంలోని నవగావ్ జిల్లాలోని కాజిరంగా నేషనల్ పార్కుకు కూడా వరద బాధ తప్పలేదు. పార్కు జలమయమైపోగా, సహజ శత్రువులైన ఏనుగు, ఖడ్గమృగం ఒకే చోట తల దాచుకోవడం చూడొచ్చు.

బీహార్, బెంగాల్‌లో వరద బీభత్సం

• మృతుల సంఖ్య 56కు చేరిక • పదుల సంఖ్యలో రైళ్ల రద్దు • 1.61 లక్షల మంది తరలింపు

పట్నా: బీహార్‌లో వరదల్లో మృతుల సంఖ్య 56కు చేరింది. రాష్ట్రంలో 38 జిల్లాల్లోని 13 జిల్లాల్లో వరద బీభత్సానికి 69.81 లక్షల జనం ముంపు బాధితులయ్యారు. దీంతో మంగళవారం బీహార్ సీఎం నితీశ్ కుమార్ రెండోసారి వరద బాధిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. కాగా.. విపత్తు నిర్వహణ బృందాలు 1.61లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వీరిలో 85,949 మందిని పునరావాస కేంద్రాల్లో ఉంచారు. నేపాల్ వరదల కారణంగా బీహార్లోని ఉత్తర జిల్లాల్లోనూ వరదలు ముంచెత్తుతున్నాయి. బీహార్ వరదల కారణంగా ఈశాన్య రాష్ట్రాలకు వెళ్లే రైళ్లు నిలిచిపోయాయి. మొత్తం 33 రైళ్లు రద్దయ్యాయయని తూర్పు మధ్య రైల్వే సీపీఆర్‌వో ప్రకటించారు. బీహార్‌తోపాటు పశ్చిమబెంగాల్లోనూ పలు జిల్లాలు వరద ముంపునకు గురయ్యాయి. ముఖ్యంగా బీహార్, నేపాల్‌తో సరిహద్దు జిల్లాల్లోనే ఈ సమస్య ఎక్కువగా ఉంది. ఈ రాష్ట్రంలోనూ వరద బాధిత జిల్లాలకు రైల్లు రద్దయ్యాయి. బీహార్‌కు ఆవల నేపాల్లోనూ ఇదే విధమైన పరిస్థితి ఉంది. అక్కడ 115 మంది వరదలకు బలయ్యారు. చైనా ఆ దేశానికి 10లక్షల డాలర్లు సాయం చేయగా, భారత్ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా 30 ఆంబులెన్సులను బహూకరించింది.



పశ్చిమబెంగాల్‌లో దినాజ్‌పూర్‌ను ముంచెత్తిన వరద నీరు

వైరస్ వినాశనానికి ముందడుగు

కదలికలపై త్రీడీ సినిమా తీసిన శాస్త్రవేత్తలు



వాషింగ్టన్: వైరస్ వల్ల కలిగే ఏ వ్యాధి కైనా మెరుగైన చికిత్స అందించే అవకాశాలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. వైరస్ పై మరింత శాస్త్రవేత్తలు త్రీడీ సినిమా రూపొందించడంతో దాని వినాశనానికి మూలాలు దొరికే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ సినిమా ద్వారా వైరస్ కదలికలు తెలుసుకుని దాన్ని నిలువరించేందుకు అవసరమైన మందులు, చికిత్సలను తయారుచేసేందుకు వీలుకలుగుతుంది. ఆరోగ్యవంతమైన ఇతర జీవుల కణాలపై వైరస్ ఎలా దాడి చేస్తుందో కళ్లకు కట్టినట్లు సినిమాను చూపించారు. ఆరోగ్యకరమైన కణాన్ని అంటిపెట్టుకుని వైరస్ జీవి శరీరంలో పాతుకుపోయేందుకు జరిపే జీవ ప్రక్రియ గురించి... ఈ చిత్రంలో చూపించారు. శాస్త్రవేత్తల కృషి వల్ల వైరస్‌ను ప్రారంభంలోనే కాకుండా...జీవ కణాలపై దాడి చేస్తున్న సమయంలోనూ నాశనం చేసే విధంగా మందులు తయారు చేసే వీలుకలుగుతుందని విస్కాన్సిన్ మిల్వాకీ యూనివర్సిటీకి శాస్త్రవేత్తలు తెలిపారు.మిలియన్ల వైరస్ స్నాప్ షాట్ ను సేకరించి అత్యంతవేగవంతంగాపనిచేసే కాంతివంతమైన ఎక్స్‌రే ఫ్రీ ఎలక్ట్రాన్ లేజర్ ద్వారా వైరస్ కదలికలను పరిశోధించారు. తాజా పరిశోధనలు గతంలో కంటే మెరుగైన ఫలితాలనివ్వడంతో వైరస్ కదలికలపై సినిమా తీశారు. వైరస్ వివిధ జీవ కణాలను ఏవిధంగా అంటి పెట్టుకుని ఉంటుం దనే విషయాన్ని తమ పరిశోధన ద్వారా బయటపెట్టామని...అదే విషయాన్ని త్రీడీ సినిమా ద్వారా ప్రజలకు చూపించాలనుకున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

మువ్వన్నెల జెండా ఎగురవేసిన కోహ్లి

కాండీ: శ్రీలంక పర్యటనలో ఉన్న భారత క్రికెట్ జట్టు మంగళవారం కాండీలో స్వాతంత్ర్యదిన వేడుకలు జరుపుకుంది. 70వ భారత స్వాతంత్ర్యదినాన్ని పురస్కరించుకొని కెప్టెన్ విరాట్ కోహ్లి మువ్వన్నెల జెండాను ఎగురవేశాడు. ఆటగాళ్లతో పాటు కోచ్ రవిశాస్త్రి కూడా వేడుకల్లో పాల్గొన్నాడు. తర్వాత ఆటగాళ్లు జాతీయగీతాన్ని ఆలపించారు.

అభిమానులకు విరాట్ స్వాతంత్ర్యదిన శుభాకాంక్షలు

టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి తన అభిమాలకు వీడియో సందేశం ద్వారా స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు తెలిపాడు. భారత్‌కు స్వాంతంత్ర్యం సిద్ధించిన నాడే తన తండ్రి ప్రేమ్ కోహ్లి పుట్టినరోజు కావడంతో ఆగస్టు 15 వేడుకలు తనకెంతో ప్రత్యేకమైనవన్నాడు. "ఈ వేడుకలను ఎంతో ఆస్వాదిస్తున్నాను. భారతీయుడినైనందుకు గర్వంగా ఉంది. జైహింద్" అని ఆ సందేశంలో కోహ్లి పేర్కొన్నాడు.



ధోనీకి ఆ ఛాన్సుంటుందా?



తొలి టీ20 ప్రపంచ కప్‌లోనే జట్టును విజేతగా నిలిపి.. వన్డే ప్రపంచకప్‌ను కూడా గెలిపించి... టెస్టు జట్టును ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దిన మహేంద్ర సింగ్ ధోనికి 2019 ప్రపంచకప్‌లో ఆడే ఛాన్స్ వస్తుందా? భారత జట్టుకు ఎనలేని సేవలందించిన మహికి జట్టులో స్థానం విషయంలో భరోసా ఉంటుందా? గౌరవప్రదంగా.. తనకు ఇష్టమైన రీతిలో క్రికెట్‌కు వీడ్కోలు పలికే అవకాశం దక్కుతుందా? జాతీయ సెలెక్టర్ల మాటలు వింటుంటే మాత్రం మహికి అలాంటి అవకాశం లభించేనా అన్న సందేహాలు ముసురుకుంటున్నాయి.

సెలెక్టర్ల మాటల్లో వేరే అర్థాలు గోచరిస్తున్న నేపథ్యంలో జట్టులోకి 'మిస్టర్ కూల్' ఎంపిక ఎలాంటి సందిగ్ధానికి తావు లేకుండా ఉంటుందన్న భరోసా ఏదీ కనిపించడం లేదు. వారు రొటేషన్ విధానం అనో.. విశ్రాంతి అనో అంటున్న మాటలకు అర్థాలు మరోరకంగా వినిపిస్తున్న వేళ మహికి చోటు దానికదే వస్తుందన్న నమ్మకమూ కలగడం లేదు.

ఆంధ్రప్రభ క్రీడావిభాగం

జాతీయ సెలెక్టర్ల నుంచి విస్పష్టమైన సంకేతాలు అందుతున్నాయి. ప్రపంచకప్ కోసం కొంతమంది కుర్రాళ్లను పరీక్షించి చూస్తున్నామని సెలెక్టర్లు అంటున్నారు. అందుకే సీనియర్ అయిన యువరాజ్ సింగ్‌కు విశ్రాంతినిచ్చామని కూడా చెబుతున్నారు. యువరాజ్ వయసు ఇప్పుడు 35 ఏళ్లు. ప్రపంచకప్ జరిగేది 2019 మే-జూన్ మాసాల్లో. అంటే మరో 20 నెలల్లోగాని ప్రపంచకప్ ఆరంభం కాదు. అప్పటికి యువరాజ్ వయసు సుమారుగా 37 ఏళ్లు. ఓ వైపు ఫిట్‌నెస్ మంత్రాన్ని జపిస్తున్న సెలెక్టర్లు.. వయసు మీరే యువీకి ఛాన్స్ ఇస్తారా? యువకులు అందుబాటులో ఉన్నపుడు సీనియర్లను తీసుకోవాలని భావిస్తారా? ధోనీ విషయంలో కూడా సెలెక్టర్లు ఇదే ఫార్ములాను పాటించే అవకాశాలే ఎక్కువ. 36 ఏళ్ల ధోనీ సైతం అప్పటికి కుర్రాడు కాలేడు కదా. మాజీ కెప్టెన్ విషయంలో సెలెక్టర్లు స్పష్టంగానే ఉన్నారని చీఫ్ సెలెక్టర్ ప్రసాద్ చెప్పకనే చెప్పాడు. ఓ వైపు 'ధోనీ దిగ్గజం.. అతని గురించి మేం బహిరంగంగా ఏదీ చెప్పం' అంటూనే మహి రాణించని పక్షంలో ప్రత్యామ్నాయాల గురించి ఆలోచిస్తామంటున్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్లో అతనికి బదులుగా రిషబ్ పంత్‌ను పరీక్షించి చూస్తామని కూడా చెబుతున్నాడు.

మహిపై ఒత్తిడి: యువీకి విశ్రాంతి నేపథ్యంలో ఇపుడిక జట్టులో తన స్థానాన్ని నిలుపుకునే విషయంలో ధోనీపైనే ఒత్తిడి ఉంటుంది. ధోనీకి ప్రపంచకప్ జట్టులో ఖాయంగా చోటు విషయమై చీఫ్ సెలెక్టర్ ఎలాంటి హామీనివ్వడం లేదు. లంకతో వన్డే సిరీస్ నుంచే సెలెక్టర్లు ప్రయోగాలు ఆరంభించదలిచారు. టెస్టుల్లో ఏడు వరుస అర్ధసెంచరీలతో ఆకట్టు కున్న కేఎల్ రాహుల్‌ను వన్డే జట్టులోకి తీసుకున్నది అందుకే. అతను సెకండ్ డౌన్‌లో బ్యాటింగ్ చేసే అవకాశాలున్నాయి. యువరాజ్ స్థానాన్ని రాహుల్ భర్తీ చేస్తాడు. కానీ రానన్న ప్రపంచకప్‌లో ధోనీ కీలకమవుతాడు. మూడు ప్రపంచకప్‌లో ఆడిన మహి అనుభవం జట్టు కు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. జట్టులో చోటు కోసమో.. కెప్టెన్సీ కోసమో మహి ఎప్పుడూ తాపత్రయ పడలేదు. వాటంతట అవే అతణ్ని వెదు క్కుంటూ వచ్చాయి. మిస్టర్ కూల్‌గా పేరుతెచ్చుకున్న ధోనీ.. భారత జట్టుకు ఎన్నో విజయాలు సాధించిపెట్టాడు. టెస్టులకు 2014లోనే గుడ్‌బై చెప్పినా క్రికెట్‌పై ప్రేమతో వన్డే, టీ20ల్లో ఆడుతూ వస్తున్నాడు. ఇక ఐపీఎల్‌లో కెప్టెన్‌గా అతని రికార్డులు మరొకరికి అసాధ్యం.

అలాంటి దిగ్గజం సగౌరవంగా క్రికెట్‌కు వీడ్కోలు పలికేట్టు చూడాల్సిన బాధ్యత బీసీసీఐది. అందుకే సెలెక్టర్లు ధోనీ విషయంలో పునరాలించాల్సిన అవసరం ఉంది. చివరిగా ప్రపంచ కప్ ఆడే అవకాశం మహికివ్వాలి. 'రిటైర్మెంట్ విషయంలో ధోనీకి స్వేచ్ఛ ఉండాలి. తాను ఎపుడు కావాలంటే అప్పుడు వీడ్కోలు పలికే అవకాశం కల్పించాలి' అన్న ఆస్ట్రేలియా దిగ్గజం మైక్ హసీ సూచనను ప్రసాద్ బృందం చెవికెక్కించుకోవాలని క్రికెట్ అభిమానుల ఆకాంక్ష.

మహి ఆడకుంటే ప్రత్యామ్నాయాలు ఆలోస్తాం

"ధోని ప్రదర్శన మెరుగ్గా లేకంటే మేం ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాల్సివుంటుంది. సెలెక్షన్ కమిటీ సమావేశంలో ఒక్క ధోనీ గురించి మాత్రమే కాదు.. అందరి గురించి మాట్లాడుకుంటాం. జట్టును ఎంపిక చేసేప్పుడు అన్ని అవకాశాలను పరిశీలిస్తాం. ధోనీ దిగ్గజం. అతని గురించి బహిరంగంగా మేం మాట్లాడలేం. కానీ మాకో ప్రణాళిక ఉంది. ఎవరికీ జట్టులో స్థానం విషయంలో భరోసా అంటూ లేదు. కీపర్ రిషబ్ పంత్ ప్రతిభావంతుడు. భవిష్యత్తులో అతని ప్రదర్శనను గమనించాల్సివుంది. టీ20ల్లో కూడా అతని ప్రదర్శనను విశ్లేషిస్తాం. రానున్న కొద్ది మాసాలపాటు రొటేషన్ విధానంలో దాదాపు 26 మంది ఆటగాళ్లను పరిశీలిస్తాం. 2019 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ విధానాన్ని అమలు చేయాలనుకుంటున్నాం. ఫిట్‌నెస్ అంశం కూడా చాలా ప్రధానమైంది. చాంపియన్స్ ట్రోఫీలో చూశాక ఆటగాళ్లు మరింత దృఢంగా ఉండాలని అనుకున్నాను"

- ఎమ్మెస్కే ప్రసాద్, చీఫ్ సెలెక్టర్



టాప్‌టెన్‌లో రాహుల్

- పుజారా, రహానే కూడా



న్యూఢిల్లీ: భారత్ జట్టు ఓపెనర్ కేఎల్ రాహుల్ ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో తొలిసారి మొదటి 10 స్థానాల్లో చోటు సంపాదించాడు. లంకతో సిరీస్‌లో సెంచరీలతో ఆకట్టుకున్న పుజారా, రహానే కూడా టాప్ టెన్‌లో స్థానం దక్కించుకున్నారు. వరుసగా ఏడు అర్ధసెంచరీలతో రికార్డులకెక్కిన రాహుల్ రెండు స్థానాలు మెరుగుపరచుకొని 9వ ర్యాంకును అందుకున్నాడు. పల్లెకెలెలో తొలి వికెట్‌కు రాహుల్‌తో కలిసి 188 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నమోదు చేసిన ధావన్ 10 ర్యాంకులు మెరుగుపరచుకొని 28వ స్థానానికి చేరుకున్నాడు. మెరుపు సెంచరీతో చెలరేగిన హార్దిక్ పాండ్య ఏకంగా 45 స్థానాలు ఎగబాకి 68వ ర్యాంకు చేరుకున్నాడు. ఆల్‌రౌండర్లలో పల్లెకెలె టెస్టుకు దూరమైన రవీంద్ర జడేజా మళ్లీ రెండో స్థానానికి పడిపోయాడు. ఐతే బౌలర్‌గా మాత్రం అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

కపిల్‌లో పదో వంతైనా సంతోషమే



కాండీ: దిగ్గజ ఆటగాడు కపిల్‌దేవ్‌లో తాను పదో వంతు పేరు తెచ్చుకున్నా సంతోషిస్తానని టీమ్ఇండియా ఆటగాడు హార్దిక్ పాండ్య అన్నాడు. "క్రికెట్‌పైనే నా దృష్టి. నేను ఏం కాగలనో అదే అయ్యాను. కపిల్‌లో పదో వంతు అయినా నాకు సంతోషమే. నేను జీవితంలో అంతకన్నా ఎక్కువ కోరుకోను" అని చెప్పాడు. పాండ్య.. కపిల్‌లా ఆడగలడన్న సెలెక్షన్ కమిటీ ఛైర్మన్ ప్రసాద్ వ్యాఖ్యలకు అలా స్పందించాడు. బ్యాటింగ్ చేసేప్పుడు ప్రత్యేకించి 90ల్లో ఉన్నపుడు ప్రశాంతంగా ఉండాలని ధోనీ ఇచ్చిన సలహా బాగా ఉపయోగపడిందని చెప్పాడు. "తొలిసారి నేను 90ల్లో ఎలాంటి ఆందోళన లేకుండా బ్యాటింగ్ చేశాను. లేకుంటే ఇలాంటి అమూల్యమైన సెంచరీ సాధింగలిగేవాడిని కాను. అందుకు ధోనీ సలహా ఎంతగానో ఉపయోగపడింది" అన్నాడు.

కౌంటీల్లో అశ్విన్

- వార్‌చెస్టర్‌షైర్ తరఫున బరిలోకి



లండన్: భారత స్పిన్ బౌలర్ రవిచంద్రన్ అశ్విన్ కౌంటీల్లో ఆడబోతున్నాడు. అతను కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో వార్‌చెస్టర్‌షైర్ తరఫున ఆడతాడు. 2006లో జహీర్ ఖాన్ ఈ కౌంటీ తరఫున ఆడాడు. అతని తర్వాత వార్‌చెస్టర్‌షైర్ తరఫున ఆడుతున్న భారత ఆటగాడు అశ్వినే. అశ్విన్ ఆస్ట్రేలియా బౌలర్ జాన్ హాస్టింగ్స్ స్థానంలో ఆడతాడు. గ్లూచెస్టర్ షైర్‌తో 28న జరిగే డివిజన్ టూ మ్యాచ్‌తో అశ్విన్ కౌంటీ అరంగేట్రం చేస్తాడు. "రవి అద్భుతమైన అంతర్జాతీయ క్రికెటర్. అతనిపుడు బ్రహ్మాండమైన ఫామ్‌లో ఉన్నాడు." అని వార్‌చెస్టర్‌షైర్ డైరక్టర్ స్టీవ్ రోడ్స్ అన్నాడు.

భారత్ ఏ ఓటమి

- దక్షిణాఫ్రికాతో అనధికార టెస్ట్ సిరీస్

ప్రిటోరియా: దక్షిణాఫ్రికా ఏతో జరుగుతున్న అనధికార టెస్టు సిరీస్ తొలి మ్యాచ్‌లో భారత్ ఏ 235 పరుగుల తేడాతో ఓటమి చవిచూసింది. 447 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ నాలుగో రోజు మంగళవారం రెండో ఇన్నింగ్స్‌లో 211 పరుగులకు ఆలౌటైంది. బావనే 46 పరుగులతో టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. దక్షిణాఫ్రికా ఏ బౌలర్ డాలా (5/36) ఐదు వికెట్లు దక్కించుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 346పరుగులు చేసిన దక్షిణాఫ్రికా .. రెండో ఇన్నింగ్స్‌లో 220/5 స్కోరుకు డిక్లేర్ చేసింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 120 పరుగులకే ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లో కాస్త మెరుగ్గా ఆడి 211 పరుగులు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ (120) దక్షిణాఫ్రికా ఏ ఓపెనర్ కుక్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో దక్షిణాఫ్రికా ఏ 1-0 ఆధిక్యం సాధించింది.



హాకీ జట్టు సిరీస్ విజయం

రెండో మ్యాచ్‌లోనూ నెదర్లాండ్స్ చిత్తు

న్యూఢిల్లీ: భారత హాకీ జట్టు ఐరోపా పర్యటనలో మరోసారి గెలిచింది. ఆమ్‌స్టర్‌డామ్‌లో సోమవారం రాత్రి జరిగిన పోరులో భారత జట్టు స్ఫూర్తిదాయకమైన ఆట తీరును ప్రదర్శించి 2-1తో మేటి జట్టు నెదర్లాండ్స్‌పై విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో గెలుచుకుంది. రెండు రోజుల తేడాలో భారత జట్టుకిది రెండో విజయం. ఆదివారం రాత్రి మ్యాచ్‌లో టీమ్ఇండియా 4-3తో గెలుపును సొంతం చేసుకుంది. సోమవారం పోరులో భారత్ తరఫున గుర్జంట్ 4వ నిమిషంలో, మన్‌దీప్ 51వ నిమిషంలో గోల్స్ సాధించారు. తొలి మ్యాచ్‌లో గెలిచిన విశ్వాసంతో మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని భారత యువ జట్టు ప్రపంచ నెంబర్ 4 నెదర్లాండ్స్‌తో పోరును దూకుడుగానే ఆరంభించింది. దాని ఫలితంగా 4వ నిమిషంలో పెనాల్టీ కార్నర్ ద్వారా గోల్ లభించింది. వరుణ్ కుమార్ డ్రాగ్ ఫ్లిక్ చేయడానికి ప్రయత్నించినపుడు నెదర్లాండ్స్ కీపర్ ప్యాడ్లతో అడ్డుకున్నాడు. దీంతో బంతిని దొరకబుచ్చుకున్న గర్జంట్ రివర్స్ స్టిక్ మంత్రంతో బంతిని గోల్ పోస్టులకి పంపాడు. గర్జంట్‌కిది తొలి అంతర్జాతీయ గోల్. భారత జట్టు దాడుల్ని కొనసాగిస్తూనే మరో గోల్ కోసం ప్రయత్నించింది.

అర్మన్ ఖురేషి బంతిని గోల్‌లోకి పంపడానికి ప్రయత్నించినప్పటికీ అది దూరంగా పోవడంతో భారత్‌కు మరో గోల్ అవకాశం చేజారింది. గోల్ చేసేందుకు నెదర్లాండ్స్ ఎంతప్రయత్నించినా దుర్భేధ్యమైన భారత డిఫెన్స్ అందుకు అవకాశమివ్వలేదు. చివరి 15 నిమిషాల్లో మన్‌దీప్ మరో గోల్ సాధించి భారత్ ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. ఆట 58వ నిమిషంలో శాండర్ విన్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి నెదర్లాండ్స్‌కు ఏకైక గోల్‌ను అందించాడు.

ఫుట్‌బాల్ బరిలోకి బోల్ట్



జమైకా: పరుగుల వీరుడు ఉసేన్ బోల్ట్ మళ్లీ బరిలోకి దిగుతున్నాడు. కానీ ఈ సారి వచ్చేది ట్రాక్‌పైకి మాత్రం కాదు.. ఫుట్‌బాల్ మైదానంలోకి. మాంచెస్టర్ యునైటెడ్‌ను ఎంతగానో అభిమానించే ఉసేన్ ఆ క్లబ్ తరపున ఓ స్నేహపూర్వక మ్యాచ్‌లో ఆడబోతున్నాడు. ఈ లెజెండ్స్ మ్యాచ్ సెప్టెంబరు 2న యునైటెడ్, బార్సెలోనా మధ్య జరుగుతుంది. పనిలో పనిగా ఫుట్‌బాల్ కెరీర్‌పై కూడా దృష్టిసారించబోతున్నాడు. ప్రపంచంలోనే అత్యంత ప్రాచుర్యం ఉన్న ఫుట్‌బాల్ ఆడాలన్న కోరికను బోల్ట్.. ఓ పత్రికకిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పాడు. "ఫుట్‌బాల్ ఆడాలనుందని ఎపుడూ చెబుతుంటాను. ఆ ఆట నాకు నచ్చుతుంది. కానీ ప్రస్తుతానికి కాలి కండరం నాకు ఆందోళన కలిగిస్తోంది" అన్నాడు.

హారిక గెలుపు



అబుదాబి: అబదాబి ఇంటర్నేషనల్ చెస్ ఫెస్టివల్‌లో భాగంగా జరిగిన మాస్టర్స్ టోర్నీని భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక విజయంతో ఆరంభించింది. ప్రపంచ నెంబర్ 9 హారిక తొలి రౌండ్లో భారత్‌కే చెందిన మిథిల్‌ను ఓడించింది. ఈ పోరు మూడున్నర గంటల పాటు సాగింది. "ఓపెనింగ్ దశల్లో నాకు స్పష్టమైన ఆధిక్యం లభించింది. 34 ఎత్తుల తర్వాత ఆ ఆధిక్యాన్ని గెలుపుగా మలచుకున్నాను" అని హారిక చెప్పింది. మాస్టర్స్ కేటగిరీకి చెందిన తొలి 10 మంది పోటీపడే టోర్నీలో విజేతకు భారీ ప్రైజ్‌మనీ లభిస్తుంది.



పుణెరీ - బెంగాల్ జట్ల పోరు దృశ్యం

పుణెరీ చేతిలో బెంగాల్ చిత్తు

- బుల్స్‌పై గుజరాత్ గెలుపు


అహ్మదాబాద్: ప్రొ కబడ్డీ లీగ్‌లో అంతర్ జోనల్ అంచెను పుణెరీ పల్టాన్ ఘన విజయంతో ఆరంభించింది. మంగళవారం జరిగిన తొలి పోరులో పుణెరీ 34-17 భారీ తేడాతో బెంగాల్ వారియర్స్‌ను మట్టికరిపించింది. ఏ జోన్‌లో అగ్రస్థానంలో ఉన్న పుణెరీ ముందు బి జోన్‌లో దిగువ నుంచి రెండో స్థానంలో నిలిచిన బెంగాల్ నిలువలేకపోయింది. సందీప్ నర్వాల్, జీబి మోర్ కీలక పాయింట్లు స్కోరు చేసి పుణెరీని విజయం వైపు నడిపించారు. బెంగాల్ తురుపు ముక్క జంగ్ కున్ లీ జట్టును తీవ్ర నిరాశకు గురి చేస్తూ కేవలం ఒకేఒక్క పాయింట్ సాధించాడు. మ్యాచ్‌లో ముందుగా బెంగాల్‌నే 2 పాయింట్లు సాధించి ఆధిక్యంలో నిలిచింది. మూడో నిమిషంలో ఆ పాయింట్లు మణిందర్ సింగ్ ద్వారా లభించాయి. తర్వాత 12 నిమిషలకే పుణెరీ 7-5 ఆధిక్యంలోకి దూసుకు పోయింది. బెంగాల్‌ను 15వ నిమిషంలో ఆలౌట్ చేసి పుణెరీ 12-5 ఆధిక్యం సాధించింది. 16వ నిమిషంలో సందీప్ రెండు ర్యాపిడ్ పాయింట్లు సాధిండంతో పుణెరీ ఆధిక్యం 14-6కు పెరిగింది. తొలి అర్ధం ముగిసేసరికి బెంగాల్ 10-17తో వెనుకబడింది. రెండో అర్ధం 25వ నిమిషంలో బెంగాల్ ఇద్దరు ఆటగాళ్లకు పరిమితమై పోయింది. తర్వాత పుణెరీనే పూర్తి ఆధిపత్యం చెలాయించి మ్యాచ్ ముగిసేసరికి 34 పాయింట్లతో తిరుగులేని ఆధిక్యంలో నిలిచింది. మరో అంతర్ జోనల్ పోరులో సమవుజ్జీలైన గుజరాత్ ఫార్చూన్ జయంట్స్, బెంగళూరు బుల్స్ హోరాహోరీగా తలపడ్డాయి. చివరకు 27-24 పాయింట్లతో బెంగళూరుపై గుజరాత్ గెలిచింది. ఈ అంతర్ జోనల్ అంచె 22వ తేదీ వరకు జరుగుతుంది.

యుఎస్ ఓపెన్‌లో షరపోవాకు వైల్డ్‌కార్డ్



మాస్కో: అందాల టెన్నిస్ భామ మరియా షరపోవాకు యుఎస్ ఓపెన్‌లో మెయిన్ డ్రాకు వైల్డ్‌కార్డ్ ప్రవేశం లభించింది. 18 మాసాల సుదీర్ఘ విరామం తర్వాత ఆమె తిరిగి బరిలోకి దిగుతోంది. షరపోవా ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడాలని అనుకున్నా ఆ గ్రాండ్‌స్లామ్ నిర్వాహకులు ఆమెకు వైల్డ్‌కార్డ్ ఇచ్చేందుకు నిరాకరించారు. యుఎస్ ఓపెన్ మాజీ విజేత షరపోవా డోపింగ్ నేరం ఆరోపణలపై 15 మాసాల పాటు నిషేధానికి గురైంది.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.



విజయ్‌పథ్ సింఘానియా

- ఆస్తి కావాలి..అమ్మానాన్నలు వద్దంటున్న పిల్లలు
- రేమాండ్స్ అధినేతకే రేపు లేకుండా చేసిన కొడుకు
- డబ్బే ప్రేమకు ప్రతిరూపమనుకున్న పెద్దలకు... వారసులు
- ఆస్తిపరులకు...పిల్లలే పరులైపోతున్న ప్రమాదం
- పిల్లల మధ్య చూపించే వివక్ష...కక్షగా మారుతున్న వైనం

అంతా ఇచ్చేస్తే... ఇంతే సంగతులా!


గౌతమ్ సింఘానియా

రేమాండ్స్ దుస్తుల బ్రాండ్‌తో పారిశ్రామిక దిగ్గజంగా పేరు, డబ్బు సంపాదించిన విజయ్‌పథ్ సింఘానియా పేరు... ఈ మధ్యకాలంలో మరోలా మారుమోగింది. కొడుకు చేసిన మోసంతో ఆయన అద్దెఇంట్లో అనామకుడిగా జీవిస్తున్నారనే కథనాలు మీడియాలో విస్తృతంగా వచ్చాయి. కొడుకు గౌతమ్ సింఘానియా చేతిలో వెయ్యి కోట్లకు పైగా ఆస్తిని, 36 అంతస్తుల జెకె హౌస్‌ని పెట్టి...ఇప్పుడు సింఘానియా చేతిలో చిల్లిగవ్వ కూడా లేకుండా రోడ్డున పడ్డారు. తనకు రావాల్సిన డ్యూప్లెక్స్ హౌస్, నెలకు ఏడులక్షల రూపాయల డబ్బుని తనకు ఇప్పించమంటూ ఆయన కోర్టుకెక్కారు....కంపెనీ ఖర్చుతో ఆయనకు ప్రత్యామ్నాయ నివాస వసతిని కల్పించాలని కూడా సింఘానియా తరపు న్యాయవాది కోర్టుని కోరారు. ఆస్తి ఇచ్చాకే..కొడుకు అసలు స్వరూపం తెలిసిందని సింఘానియా ఆవేదన చెందారు. కోట్ల ఆస్తి ఉన్న వ్యక్తిని ఇలా రోడ్డునపడేయడం సాధ్యమేనా అంటే...సాధ్యమేనని గౌతమ్ సింఘానియా నిరూపించాడు. కోటీశ్వరుడి పరిస్థితే అలా ఉంటే...ఇక మామూలు తండ్రుల పరిస్థితి ఏమిటి...పిల్లలను నమ్మే విషయంలో తల్లిదండ్రులు తమ ప్రేమకు బ్రేకులు వేసుకోవాల్సిందేనా! పిల్లలకు ప్రేమను పంచడం అంటే చాలామంది తల్లిదండ్రులు కేవలం డబ్బుని పంచడమే అనుకుంటారు. కానీ అది నిజం కాదని...ప్రేమని డబ్బుని కూడా విచక్షణతో పంపకాలు చేయాలని విజయ్‌పథ్ ఉదంతం...మనకు కళ్లకు కట్టినట్టుగా వెల్లడించింది.

తన రక్తం..తన వారసత్వం, తన వంశాకురం, తన ప్రాణం...అనిపించే చిన్నారిని మొట్టమొదట చేతుల్లోకి తీసుకున్నపుడు తల్లిదండ్రులకు కలిగే ఆనందాన్ని మాటల్లో చెప్పలేము. కనీసం ఏడవటం కూడా సరిగ్గా రాకముందే పిల్లలు చేసే మ్యాజిక్ అది. అప్పటినుండి ఆ మ్యాజిక్ ప్రతిరోజు జరుగుతుంటుంది. పిల్లలు గుండెలపై తన్నినా, తలపై కెక్కి నాట్యంచేసినా, తమకు సాధ్యం కాని కోరికలు కోరినా...తల్లిదండ్రులు వాటన్నింటినీ తమ ప్రేమ ఖాతాలోనే వేసుకుంటారు. కష్టపడి సంపాదించి పిల్లలకు కోట్లు కూడబెట్టి ఇవ్వడమే ధ్యేయంగా ఈ ప్రపంచంలో చాలామంది నాన్నలు బతికేస్తున్నారు. అందుకే అమ్మానాన్నలుగా మారాక చాలామందికి ప్రత్యేక లక్ష్యాలు ఉండవు. ఇవన్నీ సరే...పువ్వుల్లాంటి పసివాళ్లకు తల్లిదండ్రుల నుండి ఆ మాత్రం ప్రేమను పొందే అర్హత ఉంది. అయితే...పెద్దయ్యాక ఆ పూలే...ముళ్లుగా మారి...తల్లిదండ్రుల పాలిట ముళ్లకిరీటంగా మిగిలితేనే సమస్య.

ప్రేమ అంటే...డబ్బేనా!

మనకు ప్రేమను డబ్బుతో కొలవటం అలవాటే. ఆడపిల్లకు ఎంతకట్నమిచ్చారు..మగపిల్లవాడికోసం ఎంత కూడబెట్టారు...ఇవే తల్లిదండ్రులు సాధించే విజయాలు. ఎంత డబ్బుని పిల్లలకు ఇవ్వగలిగితే...తల్లిదండ్రులుగా అంత విజయం సాధించినట్టు. అలా చేయలేకపోతే...మాకేమిచ్చావు...అని పిల్లలు నేరుగా అడిగే పరిస్థితి. డబ్బు సంపాదన చాలా ముఖ్యమే. అంతకంటే ముఖ్యం...వ్యక్తిగా మనిషిగా మనమేంటో నిరూపించుకుని...మన కాళ్లమీద మనం నిలబడటం. చాలా కొద్ది మంది తప్ప ఈ కాన్సెప్టుని ఫాలో అవుతున్న వారు తక్కువే. తల్లిదండ్రుల నుండి వచ్చే ఆస్తికి ఆశపడని పిల్లలు చాలా చాలా అరుదు. దీన్ని ఒక రకంగా పెంపకంలో లోపంగానే చెప్పాలి. తమ పెంపకానికి తామే బలవుతున్నట్టుగా ఉంది...నేటి తల్లిదండ్రుల పరిస్థితి. అయితే వారి దృష్టిలో డబ్బుని ఇవ్వటం అంటే ప్రేమను ఇవ్వడమే. కానీ పిల్లలు మాత్రం డబ్బుని తీసుకోవడమంటే...తల్లిదండ్రుల బాధ్యతలను తీసుకోవటంగా భావించడం లేదు. పిల్లలకోసం సంపాదించి ఇవ్వటం వారి బాధ్యత కనుక చ్చారు...దట్సాల్...అనుకుంటున్నారు. అందుకే విజయ్‌పథ్ సింఘానియా లాంటి తండ్రులు మన సమాజంలో ఎంతోమంది కనబడుతున్నారు.

నా కొడుకు అందరిలాంటివాడు కాదు...!

ఇది ఎంతోమంది తండ్రుల నమ్మకం. ఎప్పటికప్పుడు కొడుకుల చేత మోసగించబడుతున్న తల్లిదండ్రులు తెరపైకి వస్తున్నా.....చాలామంది



తండ్రులు ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవటం లేదు. 'నా కొడుకు అలా కాదులే...నేనంటే చాలా ప్రేమ' అనేవారే ఎక్కువ. అందుకే చిట్టచివరి రూపాయి వరకు కొడుకులకు, కూతుళ్లకు పెట్టి చివరికి రోడ్డున పడుతున్నారు. ప్రేమలు బంధాలు మమకారాలు లాంటివి ఎంత మంచివో...అంతచెడ్డవి. అవి విచక్షణను దగ్గరకు రానివ్వవు. అంతేకాదు....ఇక్కడ ఒక స్వార్థాన్ని కూడా మనం చూడాల్సిందే. నేను సంపాదించినదంతా నా పిల్లలే అనుభవించి తీరాలి...అనే ఆశ, కోరిక....చాలామంది మనసుల్లో రాయని శాసనంలా ముద్రించుకుపోయి ఉంటుంది. దాంతో ఎప్పటికైనా...ఇదంతా వాడిదే కదా...అనే భావం ఒకటి...ముందువెనుకా ఆలోచించనీయకుండా చేస్తుంది. మనకు మరో ఆప్షన్ లేదు. పిల్లలు ఎంత పెద్దయినా, వారికి డబ్బు అవసరం లేకపోయినా...తమ వద్ద ఉన్నది ఇచ్చి...వాళ్ల ఆనందాన్ని చూడాలనుకుంటున్నారు తల్లిదండ్రులు. చిన్నతనంలో చాక్‌లెట్ ఇచ్చి...పిల్లల ఆనందాన్ని చూసిన అలవాటే అది. 'పిల్లలు నీ ద్వారా ఈ భూమ్మీదకు వచ్చారు...నీ నుండి రాలేదు' అనేది ఒక సామెత. వాళ్లకు జీవితాన్ని ఇవ్వటం అంటే...తమ వద్ద ఉన్న చివరి రూపాయి వరకు ఇచ్చేయటం కాదని తల్లిదండ్రులు అర్థం చేసుకుంటే ...వృద్ధాప్యంలో రోడ్డున పడకుండా రాజాలా జీవించే అవకాశం ఉంటుంది. పిల్లలు మోసం చేశారే అనే బాధా తప్పుతుంది. అయితే పిల్లలకు ఆస్తి ఇవ్వక పోతే.. ఎదురయ్యే విమ ర్శలూ చాలానే ఉంటాయి. అయితే ఆస్తి పిల్లలకు ఎంత ఇవ్వాలి...ఎప్పుడు ఇవ్వాలి..అసలు ఇవ్వాలా వద్దా...అనేవి సాధారణీకరించి చెప్పలేని విషయాలు. ఎవరి ఇంటి పరిస్థితులను బట్టి, ఆ పిల్లల మనస్తత్వాలను బట్టి, వారికున్న అవసరాలను బట్టి...ఆలోచించి తీసుకోవాల్సిన నిర్ణయాలు ఇవి. అయితే...తల్లిదండ్రులు జీవితమంతా ఎవరిమీదా ఆధారపడకుండా బతికే శక్తిని మాత్రం....తమ వద్దే ఉంచుకోవాలి. ఆశక్తి ఆరోగ్యమైనా..డబ్బైనా...మరేదైరా సరే.

ప్రేమ పంపకాల్లో...తేడాలున్నా చివరికి తిప్పలే

తల్లిదండ్రులు - ఆస్తి పంపకాలు...అనే విషయానికి చాలా కోణాలున్నాయి. పిల్లలు ఒక్కరే కాకుండా, ఒకరికి మించి ఇద్దరు ముగ్గురు నలుగురు ఇలా ఇప్పుడు...కూడా తల్లిదండ్రులకు చివరిరోజులు చేదుగా మారే అవకాశాలు ఉన్నాయి. పిల్లలందరూ తల్లిదండ్రులకు సమానమే. కానీ...బాపుగారి భాషలో చెప్పాలంటే...కొందరు పిల్లలు ఇంకాస్త ఎక్కువ సమానం అవుతారు. అంటే తన పిల్లల్లోనే ఒకరి పట్ల మరింత ఆపేక్షని చూపించి మరొకరిని కాస్త తక్కువగా చూడటం అన్నమాట. ఇలా జరుగుతున్నపుడు పిల్లల మధ్య సహజంగానే మనస్పర్థలు వచ్చేస్తాయి. కారణమేదైనా చాలా సార్లు తల్లిదండ్రులు అలాంటి పక్షపాతం చూపుతుంటారు. ఉన్నదంతా ఆడపిల్లలకు ఊడ్చిపెట్టేసి...కొడుకులను రోడ్డున పడేసేవారు....లేదా కొడుకులకోసం దాచిపెట్టి కూతుళ్లను సరిగ్గా పట్టించుకోనివారు మనకు చాలామంది తారసపడుతుంటారు. ఇలాంటప్పుడు ఎవరిమీదైతే ప్రేమని చూపించారో..ఎవరికైతే ఎక్కువ ఆస్తిని ముట్టచెప్పారో వాళ్లవద్దకే వెళ్లండి...అనేమాట మిగిలిన పిల్లల నోటివెంట వస్తుంది. ఆ



సమయంలో ఆస్తిని, అధిక ప్రేమని పొందిన పిల్లలు పట్టించుకోకపోతే ఆ తల్లిదండ్రుల గతి అధోగతే అవుతుంది. కారణమేదైనా పిల్లల పట్ల పక్షపాతం చూపితే...అది చివరికి వారిని దూరం చేసుకోవటంగా మారుతుందని మర్చిపోకూడదు. నిజానికి బాధ్యతలన్నీ తీరిపోయిన మలిదశలో మనిషి నేను...నేను అని మాత్రమే అంటాడని ఆధ్యాత్మికం అంటుంది. ఒకరకంగా ఇది కరెక్టే. బాధ్యతలన్నీ తీరాయి ...అన్నీ పిల్లలకు అప్పచెప్పేద్దాం...అనుకునేవారు...స్వీయ బాధ్యతని మనిషి ఏ దశలోనూ మర్చిపోకూడదని గుర్తుంచుకోవాల్సిందే.

చట్టాలు చెబుతున్నాయి..మారాల్సింది మనుషులే

ఇవన్నీ చెప్పుకున్నాక...అయితే కన్నపిల్లలను కూడా నమ్మవద్దా...అనే ప్రశ్న ఉదయిస్తుంది. అది మరింత దారుణం కదా...అనిపిస్తుంది కూడా. కానీ దాన్ని అపనమ్మకం...అనాల్సిన పనిలేదు. గుడ్డి నమ్మకాన్ని వదిలేయటం అనవచ్చు. ప్రకృతి నుండి మనకు అందిన సామాన్య ధర్మాలకు మనమెవరం అతీతులం కాదు. దాన్ని బట్టి చూస్తే...తమ వృద్ధాప్యం గురించి ఆలోచించకుండా ఉన్నదంతా పిల్లలకు ఊడ్చిపెట్టే తల్లిదండ్రులు...రెక్కలు వచ్చిన పిల్లలకు తల్లిపక్షి తన రెక్కలను ఇచ్చినట్టుగా ఉంటుంది. పిల్లలు చూడటం లేదు...అనేది ఇక ఇప్పుడు అరిగిపోయిన వాదన...చూడకపోవడానికి కావాలసినన్ని సామాజిక మార్పులు, కారణాలు ఉన్నాయి. అవన్నీ కరెక్ట్ కాకపోయినా అనివార్యం. అందుకే ఇప్పటి తల్లిదండ్రులు పిల్లలు చూడనక్కర్లేదు...అనే స్థితికి రావాలి. చట్టాలు కూడా అదే చెబుతున్నాయి. తల్లిదండ్రులు సంపాదించుకున్న ఇంట్లో తనను ఉండనివ్వటం లేదంటూ...సచిన్ అనే వ్యక్తి కోర్టుకి ఎక్కగా...ఢిల్లీ హైకోర్టు....తల్లిదండ్రులకు అనుకూలంగా తీర్పునివచ్చింది. తల్లిదండ్రులు ప్రేమతో పిల్లలను ఇంట్లో ఉండనిస్తే...జీవితాంతం తల్లిదండ్రులే పిల్లలను పోషించాలని కాదని కోర్టు పేర్కొంది.

గౌరవం నిలుపుకుంటే...జీవితం నిలుస్తుంది

ఆఖరి క్షణం వరకు గౌరవం నిలుపుకోవాలి...అనుకునే వారు ఎవరూ...చివరి రూపాయి వరకు పిల్లలకు పెట్టరు. అది స్వార్థం కాదు...ఎవరి బతుకుని వారు నిలబెట్టుకోవటం...ప్రతి ప్రాణికి సహజధర్మం మరి. తల్లిదండ్రులను వదిలేయటం వెనుక పిల్లలు చెప్పే కారణాలు చాలానే ఉంటాయి...కానీ వారు మనకు జన్మనిచ్చారు...అనే ఒక్క కారణం చాలు...వారిని ప్రేమించడానికి. ఏదిఏమైనా...మనుషులకంటే డబ్బుని ఎక్కువగా చూసే పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాల్సిందే...అలాంటి భావాన్ని పిల్లల్లో పెరగనీయకుండా పెంచగలిగితే మరింత మంచిది.

- వడ్లమూడి దుర్గాంబ

అలోవెరా రసం... అలా చేయదట!

అలోవెరాలో ఉన్న ఔషధ గుణాలను గురించి ఈ మధ్యకాలంలో ఎక్కువగా వింటున్నాం. అందులో ఒకటి ఇది శరీరంలోని విషాలను తొలగిస్తుందని. ఈ నేపథ్యంలో డ్రగ్స్ కేసులో పోలీసుల విచారణని ఎదుర్కొంటున్నవారిలో కొందరు కలబంద రసాన్ని తీసుకుని తమ కడుపుని శుద్ధి చేసుకుంటున్నారనే వార్తలు వచ్చాయి. దీనిపై వివరణ ఇచ్చిన ఆయుర్వేద వైద్యులు అది సాధ్యం కాదంటున్నారు.

శరీరంలో విషాలను తొలగించే లక్షణం కలబందలో ఉన్నప్పటికీ... ఆ రసం తీసుకున్న వెంటనే రక్తంలో డ్రగ్స్ ప్రభావం తగ్గుతుందని చెప్పలేమంటున్నారు ఆయుర్వేద నిపుణులు. నిజంగా కలబంద రసం కడుపును అంత బాగా శుద్ధి చేసేస్తుందని శాస్త్రీయంగా నిరూపితమైతే కాలేదని... కానీ సప్త ధాతువుల్లో రెండో ధాతువైన రక్తాన్ని శుద్ధి చేసే గుణం కలబందలో కొంత వరకు ఉన్నదని...అయితే దాని ఫలితం కనిపించడానికి 35 నుంచి 45 రోజుల వరకు పడుతుందని వారు చెబుతున్నారు.
ఏళ్ల తరబడి డ్రగ్స్ తీసుకోవడం వలన రక్తంలో కలిసిపోయిన అవశేషాలు.... ఇలా కేసుల నుంచి బయట పడటం కోసం... కలబంద జ్యూస్ తీసుకున్నం త మాత్రాన కేవలం నాలుగైదు రోజుల్లో బయటకు కనిపించ కుండా పోతాయను కోవడం అపోహనని ఆయుర్వేద నిపుణులు గట్టిగా చెబుతున్నారు. కలబంద చర్మంపై చూపినంత గొప్ప ప్రభావం రక్తంపై చూపుతుందని చెప్పలేమం టున్నారు.
అయితే కలబందలో చాలా బలమైన యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఉన్నాయని చెబుతు న్నారు వారు. తెగిన గాయాలకు, కీటకాలు కుట్టినప్పుడు వచ్చే నొప్పికి దీన్ని ఔషధంగా వాడవచ్చని, మొక్క నుంచి వచ్చే రసాన్ని గాయంపై పూస్తే... అది గాయాలపై చేరే బ్యాక్టీరియాతో పోరాడుతుందని అంటు న్నారు.



ఇంకా... దీనిని సేవించడం వలన... శరీరంలోని చిన్న ప్రేగులు పోషకాల ను గ్రహించే శక్తి పెరుగుతుంది. అలాగే కలబంద జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అయితే ఈ ప్రయోజనాలున్నంత మాత్రాన అది.... రక్తంలో ఉన్న డ్రగ్స్ తాలూకూ అవశేషాలను బయటకు పంపిం చేస్తుంది... అనుకోవడం మాత్రం అపోహనని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.


విదేశాల్లోనూ మువ్వన్నెల వెలుగులు!

మంగళవారం మనదేశంలో 71వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జరుపుకున్న సందర్భంలో విదేశాల్లోనూ ఆ కాంతివెలుగులు కనిపించాయి. వివిధ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలను మనజెండాలోని మూడు రంగుల... వెలుగులతో అలంకరించారు. భవనం మొత్తం కాషాయం, తెలుపు ఆకుపచ్చ రంగుల్లో మెరిసిపోయేలా లైటింగ్‌ని ఏర్పాటు చేశారు. అమెరికా, వియత్నాం, ఖతార్, బెల్జియం, సౌదీ అరేబియా...ఇలా చాలాదేశాల్లో భారత రాయబార కార్యాలయాలు మువ్వన్నెల జెండా రంగుల్లో మెరిసిపోతూ...ఏడు దశాబ్దాల స్వేచ్ఛా భారతాన్ని నిండుగా ప్రతిబింబించాయి.


అమెరికా



సౌదీ అరేబియా


బెల్జియం

చింతన


సింహ సంక్రమణం



సూర్యుడు కర్కాటక రాశి నుంచి సింహ రాశిలోకి ప్రవేశించేకాలాన్ని సింహ సంక్రమణం అంటారు. ఈ ఏడాది సంక్రమణ ప్రవేశ కాలం 16వ తేదీ రాత్రి 12.45కు కాగా పుణ్యకాలం గురువారం ఉదయం సూర్యోదయం మొదలు మధ్యాహ్నం 12.20 వరకు ఉన్నట్టు చెబుతున్నారు సంక్రమణ ప్రవేశానంతరం 16 ఘడియలు పుణ్యకాలం. ఘడియ అంటే సుమారుగా 24 నిముషాలని చెప్పవచ్చు. ఈ కాలంలో స్నాన దాన అర్చన జపాదులు విశేష ఫలితాన్నిస్తాయి. రెండు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్నాటక, కేరళల్లోని ఆలయాల్లో ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సంక్రమణం సందర్భంగా సూర్యునికి విష్ణువుకు, నరసింహస్వామికి భక్తులు పూజలు చేస్తారు. ఇవి సుఖ జీవనాన్ని ప్రసాదిస్తాయని భావిస్తారు. కొబ్బరి నీటితో అభిషేకాలు వంటివి కొన్ని ప్రాంతాల్లో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాలు ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లోనే జరుగుతుండగా ఉత్తర భారతంలో ఒక్క కుమావోన్ ప్రాంతంలో మాత్రం విశేష కార్యక్రమాలు జరగడం కనిపిస్తుంది. అక్కడి చాంద్ వంశస్థుల పాలనలో చేతివృత్తుల నిపుణులు అక్కడి రాజభవనంలో తమ వస్తువులను ప్రదర్శించేవారని తెలుస్తోంది. ప్రతిభ చూపిన వారికి రాజులు బహుమతులు కూడా ఇచ్చేవారు.

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

తనను తాను తెలుసుకోవడమే బ్రహ్మనిష్ఠ



శ్రీ రమణాశ్రమం
16-8-46

జ్ఞా: ఆకాశం కనపడకుండజేయుటకు తాము కన్నులు మూయక దుప్పటి చేత ఆకాశాన్ని కప్పదలచినట్లు , చిన్న పిచ్చుక తన చిన్న కాళ్ళతో పిడుగునాపదలచినట్లు , దుష్కర్మలు చేస్తూ ధర్మాన్ని వెదుకుతున్నట్టు, కఠినుడు ఈశ్వర దర్శనాన్ని ఆశించినట్లు, ఉన్నది నగరమని, అడవి అని భేద భావంతో మీరు బ్రహ్మ నిష్ఠను సాధించడం అభేద నిష్ఠలో భేదభావాలు ఉండవచ్చునా?

వి: మమకారం ఉన్న పర్యంతం అహంకారం గాని అది ఇది అనే ద్వైత భావం గాని పోదు . ఈ భేద భావనలు పోగొట్టేది నిర్వికల్ప నిష్ఠే. ఈ నిర్వికల్ప నిష్ఠనిస్సంకల్పంలోను, నిస్సంగత్వంలోను లభిస్తుంది. అందువల్ల కాననమే మౌన నిష్ఠకు సరైనదని ఆ స్థలంలో ఉంటాను.

జ్ఞా: తన్ను తెలిసి తానుగా ఉండుటే బ్రహ్మ నిష్ఠగాని అడవిలో ఒంటరిగా నివసించడం బ్రహ్మ నిష్ఠ కాదు .

వి: సద్గురు సన్నిధిని తన్ను తాను తెలుసుకున్నా, తానుగా నిలిచేందుకు ఏకాంత స్థానంలోనే ఉండవద్దా?

జ్ఞా: అడవిలో ఏకాంతంగా తపస్సు చేస్తేనే అజ్ఞాన నివృత్తి కాదు, అహంకార మమకారాలు వీడవు అని ఆత్మజ్ఞానులు అడవని, నగరమని, సన్యాసమని , సంసార మని తలచక దృఢచిత్తులై నిర్వికల్ప సమాధి పొందుతుండగా మీరు మాత్రం సంసారం కూడదని ఈ అడవిలో ఉండటానికి కారణం ఏమిటి?

వి:సాక్షిని తెలిసి సర్వ సాక్షిలో ఐక్యమైన వారు సంసారంలో ఉంటే సమాధి సాధనకు విఘ్నం కలిగి సాక్షాత్కారం తప్పిపోతుంది. అందువల్ల సమజానం తానుభూతిపరులు సంసారాపేక్షను స్వప్నంలోనైనా చింతింపరు.

జ్ఞా: ఇది వలయుననే సంకల్పాన్ని , వలదు అనే వికల్పం లేకుండా ఉంటే సమజ నిష్ఠగాని ఈ అడవినపేక్షించి, నగరాన్ని ఉపేక్షించి ఉండటం నిష్ఠ అవుతుందా?

వి: సంకల్ప వికల్పరహితులకు వ్యాపారమెలా సాగుతుంది. వ్యవహారానికి ఉపయోగించనివాడు నగరంలో ఉన్నా ప్రయోజనం ఏమిటి? శవానికి వివాహం చేసినట్టు అనృత జడ దుఃఖాత్మకమైన ఈ దేహ పోషణకై అనేక కష్టాలకు అవకాశమున్న నగరంలో ఉండటం కూడనే కూడదు.

జ్ఞా: వ్యాపారంపై కోరిక లేదు. సమాధిని అభ్యసిస్తున్నారు. ఆ సాధనా ఒక వ్యాపారమే కదా?ఈ వ్యాపారంలో ఉన్న వారికి సంసార వ్యాపారాన్ని ఉండనిద్దాం.

వి: సమాధి ఒక వ్యాపారమైనా సమస్త సంకల్ప చాంచల్యాలను నాశనం చేస్తుంది. సంసార వ్యాపారమే అన్ని చాంచల్యాలను సమకూర్చి సదా కష్టాలను ఇస్తుంది కదా.

జ్ఞా: సచ్చిదానంద స్వరూపమే తాను. ఇక నిష్ఠా సాధన ఎందుకు చేయాలి?

వి: జాగ్రదవస్థలో సుషుప్తి పొందటమే బ్రహ్మనిష్ఠయని ఉత్తములంటారు. అట్లుండని సమాధిచేత అడ్డులేని ఆనందము కలుగుతుందా

జ్ఞా: జాగ్రదవస్థలో ఇంద్రియ చేష్టలు, స్వప్నావస్థలో మనోవ్యాపారము, సుషుప్త్యవస్థలో శుద్ధ శూన్యాన్ని సాక్షివలె చూసి సంతోషపడడమే ఆనందమని, శ్యేన (గ్రద్ధ)చ్ఛాయవలె దేనికి అంటీ అంటక ఉండటమే జాగ్రత్సుషుప్తియని వేదాంత శాస్త్రములు ఘోషిస్తుండగా, శుద్ధశూన్యమైన సుషుప్తి యందుండటమే ఆనందమని తలచతగునా?

వి: జాగ్రత్తును, స్వప్నమును లోకవ్యాపారమందు ముంచి ఇంద్రియ మృగములకు ఆహారముగ జేసి మిక్కిలి వేదన పాలగునట్లు చేస్తుంది. అందువలన లోకవ్యాపార రహితమై శుద్ధ శూన్యమైన సుషుప్త్యవస్థకు సాటియైన సమాధియే ఉత్తమ సమాధిగాని వేరేదీగాదు.

జ్ఞా: తస్కరునకు దుష్కరుడే గురువయినట్లు జగద్వ్యాపారము నుంచి వచ్చే విషయ మృగాలను దృఢజ్ఞానమనే ఖడ్గంతో నరికి సుఖదుఃఖాలను లెక్క చేయక నిశ్చలంగా నిలుచుటయే పరమ సమాధిగాని శూన్యముగ ఉండటం సమాధిగాదు.


- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

పారాయణతో ముక్తిమార్గం

మోక్షం ఉత్కృష్టం. దాన్ని మించిన స్థితి లేదు. మోక్షం సాధిస్తే మళ్ళీ మళ్ళీ జనన, మరణ చక్రంలో పడాల్సిన అవసరం లేదు. ఎన్నో జన్మల్లో ఎంతో పుణ్యం ఉంటే గాని అది సాధ్యం కాదు. పురాణాల్లో పరమాత్మ చాలా మందికి ముక్తినిచ్చిన సందర్భాలు ఉన్నాయి. అటువంటి మోక్ష ప్రాప్తికి భగవద్గీతలోని ఆరవ అధ్యాయం తోడ్పడుతుందని పురాణ వచనం. దాన్ని వివరించే పద్మ పురాణాంతర్గత కథ ఇది



పూర్వం గోదావరి నదీ తీరాన ప్రతిష్ఠానం అనే నగరం ఉండేది. ఆ నగర పాలకుడు జానశ్రుతి మహారాజు. అతను గొప్ప ధర్మాత్ముడు. ఆ రాజు ధర్మ ప్రవర్తనకూ, ప్రజాహిత కార్యాలకూ దేవతలు సంతృప్తి చెంది అతడిని అనుగ్రహించాలని హంసల రూపం ధరించి ఆ మహారాజు రాజ భవనం మీదుగా ఎగురుతూ వెళ్ళాలని బయలుదేరారు. వారు ఆ నగరాన్ని సమీపిస్తున్నంతలో మరో హంసల గుంపు కనబడింది. వాటిలో భద్రాశ్వుడు అనే హంస మరి కొన్ని హంసలు మిగిలిన వాటి కంటె ముందుకు ఎగురుతూ వెళ్ళాయి. అది గమనించిన వెనుక ఉన్న మిగిలిన హంసలు 'ఓ మిత్రులారా! మీరు జానశ్రుతి మహారాజు వద్ద కూడా ఇలా దుందుడుకుగా ప్రవర్తిస్తారా. తప్పు మెల్లగా ఎగరండి. రెక్కల శబ్దం కూడా రాకూడదు సుమా!' అన్నాయి. దానికి సమాధానంగా ముందు వెడుతున్న హంసలు 'జానశ్రుతి మహారాజు, బ్రహ్మ వేత్త అయిన రైక్వుని తేజాని కంటె గొప్ప తేజస్సు కలవాడా ఏం?' అన్నాయి. పక్షుల భాష తెలిసిన జానశ్రుతి మహారాజు ఆ పక్షుల మాటలు విన్నాడు. వెంటనే తన సారథిని పిలిచి రైక్వుడనే వ్యక్తి ఎక్కడున్నా వెతికి తీసుకు రమ్మన్నాడు. ఆ సారథి రైక్వుని కోసం దేశమంతా గాలించి, పుణ్య క్షేత్రాలన్నీ తిరిగి చిట్టచివరకు కాశ్మీర దేశంలో మాణిక్యేశ్వరాలయపు ముఖ మంటప సమీపంలో ఒక బండిలో కూర్చుని ఉన్న రైక్వుని చూశాడు. అతడికి వినయంగా నమస్కరించి, 'మహానుభావా! మీరిక్కడ ఇలా ఒక బండిలో ఒదిగి ఉండటానికి కారణం ఏమిటి. మా మహారాజు మిమ్మల్ని సగౌరవంగా తీసుకురమ్మని రథాన్ని పంపారు' అని చెప్పాడు.

దానికి సమాధానంగా రైక్వుడు, నేనెక్కడికీ రాను. నాకు ఏ మర్యాదలూ అవసరం లేదు. గౌరవాగౌరవాలు నేను పట్టించుకోను. నన్ను చూడాలనుకున్న వారు ఎవ రైనా నా దగ్గరకే రావాలి' అని చెప్పాడు. ఆ రథ సారథి తిరిగి వెళ్లి జానశ్రుతి మహారాజుకు ఆ విషయం తెలిపాడు. జానశ్రుతి మహారాజుకు అటువంటి మహాత్ముని దర్శించి తీరాలని అతడికి సమర్పించేందుకు వెయ్యి గోవులు, చీని చీనాంబరాలు, ముత్యాల హారాలూ, అమూల్య ఆభరణాలూ వెంట తీనుకుని బయల్దేరాడు. రైక్వుని సమీపించి ఆ వస్తు సంపదనంతా స్వీకరించమని కోరాడు. దానికి రైక్వుడు కోపించి, 'ఓ మహారాజా! నా విషయం తెలియక నీవు ఈ వస్తు సంపదనంతా తెచ్చినట్టున్నావు. వీటన్నింటినీ నీవు వెంటనే తీసికెళ్లు. నాకు ఏవీ అవసరంలేదు' అని చెప్పాడు.

జానశ్రుతి రైక్వుని పాదాలు పట్టుకుని క్షమించమని కోరి, మహానుభావా మీ ఈ వైరాగ్యానికీ, మహత్వానికీ, వస్తు సంపద పట్ల ఏమాత్రం ఆశలేని మీ గుణ సంపదకూ కారణమేమిటి? ఏ విధంగా మీరీ అద్భుత స్థాయిని అందు కోగలిగారు? అని ప్రశ్నించాడు. దానికి రైక్వముని, 'మహారాజా! నేను ప్రతిదినం భగవద్గీతలోని ఆరవ అధ్యాయాన్ని పారాయణ చేస్తుంటాను. దాని వలన నాకీ వైరాగ్యం ప్రాప్తించింది' అని చెప్పాడు. జానశ్రుతి మహారాజు భక్తితో చాలా కాలం రైక్వ మునిని సేవిస్తూ శుశ్రూషలు చేసి అతని నుంచి భగవద్గీత ఆరవ అధ్యాయాన్ని నేర్చుకుని పారాయణ చేసి చివరకు దేహ త్యాగం చేసి ముక్తిని పొందాడు.

గీతానాం షష్ఠమాధ్యాయం జపామి
ప్రత్యహం నృప
తేనైవ తేజోరాశిర్మే సురానామపి
దుస్సహః కనుక భగవద్గీత ఆరవ ఆధ్యాయాన్ని పారాయణ చేసే వారికి మోక్షం సిద్ధిస్తుందని పద్మ పురాణం చెబుతోంది.

- సేకరణ, రచన : ఆదూరి హైమావతి
(చికాగో నుంచి)

పరోపకారార్థమిదం శరీరం

అసత్యం ఎక్కడ ఉంటుందో ఎక్కడ అత్యాశ ఉంటుందో అక్కడ అధర్మం రాజ్యమేలుతుంది. పూర్వకాలంలో మహర్షులు, సాధువులు అరణ్యాల్లో కేవలం తపస్సు చేసుకొంటూ కాలం గడిపేవారు. కాని వారు అవసరమైనప్పుడల్లా రాజ్యాల్లో సంచారం చేసి ప్రజల బాగోగులను చూసి రాజుకు రాజ్యాభివృద్ధి కోసం, రాజ్య సుభిక్షం కోసం తగిన సలహాలనిచ్చేవారు.



'ధర్మ సంస్థాపన నిమిత్తం ప్రతి యుగంలో నేను జన్మిస్తుంటాను అని భగవానుడు అర్జునునితో భగవద్గీతలో అనడం మనకు కనిపిస్తుంది. అయితే ఇలా ఎందుకు అధర్మం ప్రజ్వరిల్లుతుంది. అసత్యం ఎక్కడ ఉంటుందో ఎక్కడ అత్యాశ ఉంటుందో అక్కడ అధర్మం రాజ్యమేలుతుంది. పూర్వ కాలంలో మహర్షులు, సాధువులు అరణ్యాల్లో కేవలం తపస్సు చేసుకొంటూ కాలం గడిపేవారు. కాని వారు అవసరమైనప్పుడల్లా రాజ్యాల్లో సంచారం చేసి ప్రజల బాగోగులను చూసి రాజుకు రాజ్యాభివృద్ధి కోసం, రాజ్య సుభిక్షం కోసం తగిన సలహాలనిచ్చేవారు. అట్లాంటి మహర్షుల్లో అగస్త్యులు ఒకరు.

అగస్త్య మహర్షి ఓసారి నిర్జనారణ్యంలో తిరుగుతున్నాడు. అతడికి ఓ చోట తలకిందులుగా వేలాడుతూ కొంత మంది అవస్థపడుతూ కనిపించారు. వారి దగ్గరకు వెళ్లి మీరెందుకు ఇలా అవస్థపడుతున్నారని అడిగాడు. దానికి వారు మా వంశంలో అగస్త్యుడనేవాడు ఉన్నాడు. వాడు వివాహం చేసుకొని వంశాభివృద్ధి చేయకుండా ఉన్నాడు. వానివల్లనే మాకీ స్థితి వచ్చింది అని చెప్పారు. అపుడు మహర్షి వగచి 'నేనే మీ అగస్త్యుడిని. మీ కోరిక ప్రకారం నేను వివాహం చేసుకొని వంశాన్ని అభివృద్ధి చేసి మీ ఈ దురవస్థను దూరం చేస్తాను' అని చెప్పి అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

అలా వెళ్లిన అగస్త్యుడు ఓ నిర్ణయం తీసుకొన్నాడు. (ఇక్కడ తలకిందులుగా ఉన్న వారు పితృ దేవతలు. వంశం అంతరించిపోతే పితృ దేవతలు సరిగా ఉండలేరనే ఉద్దేశంతోనే దానికి ప్రతీకగా అతని పితృదేవతలు తలకిందులుగా ఉన్నారని ప్రతీకాత్మకంగా వర్ణించి ఉంటారని భావించవచ్చు).

ఆ సమయంలోనే విదర్భరాజు సంతానం కోరి అగస్త్యుని అనుగ్రహం కోసం వచ్చాడు. అగస్త్యుడు రాజు కోరిక విని అభీష్ట సిద్ధిరస్తు అని అనుగ్రహించాడు.

''ఓ విదర్భరాజా! నీకు త్వరలో ఓ కుమార్తె కలుగుతుంది. కాని ఆ అమ్మాయిని పెంచి పెద్దచేసి నాకిచ్చి వివాహం చేయగలవా''అని అగస్త్యుడు ఆ రాజును అడిగాడు. సంతానలేమితో బాధపడే ఆ రాజు 'దానిదేముంది మునివర్యా! మీరు నాకు సంతానం అనుగ్రహించండి. మీరు చెప్పినట్లే నా కూతురుని మీకిచ్చి వివాహం చేస్తాను' అని చెప్పాడు.

కొన్నాళ్లకు విదర్భరాజుకు ఓ అమ్మాయి పుట్టింది. ఆ అమ్మాయికి లోపాముద్ర అని పేరు పెట్టారు. ఆ అమ్మాయి దినదినాభివృద్ధి చెందుతూ యుక్తవయస్కురాలు అయింది. పెళ్లి చేయాల్సిన వయస్సు వచ్చింది. రాజుకు తాను మహర్షికి ఇచ్చిన మాట గుర్తుకు వచ్చింది. అగస్త్యుని తలుచుకుని అడవుల్లో తపస్సు చేసుకొనేవానికి అపురూపంగా పెంచుకున్న అమ్మాయిని ఇచ్చి పెళ్లి చేయడానికి మనస్కరించలేదు. ఏ విధంగా అగస్త్యునితో మాట్లాడాలా అని అనుక్షణం వేదన చెందేవాడు. వేదన చెందే తండ్రిని చూచి లోపాముద్ర నేను మహర్షిని వివాహం చేసుకోవడానికి మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను. నాకు ఆ మహర్షితోనే వివాహం జరిపించండి ఇది నా కోరిక' అని చెప్పింది.

కూతురు కూడా కోరుకుంటోందని అగస్త్యునికి లోపాముద్రనిచ్చి అంగరంగ వైభవంగా వివాహం చేశాడు విదర్భ

భారతంలో చిన్న కథలు

రాజు. అయితే మహర్షి వెంట రావడానికి బయలుదేరిన లోపాముద్రను చూచి అగస్త్యుడు 'నీ రాజలాంఛనాల్నీ, రాజ వైభోగాన్ని వదలి నాతో రా' అని చెప్పాడు.

లోపాముద్ర చిరునవ్వుతో మహర్షి చెప్పినట్లే రాజభోగాలన్నింటిని విడిచి నారచీరలు కట్టుకుని మహర్షి వెంట వెళ్లింది. చాలారోజులు వారిద్దరూ అగస్త్యుని ఆశ్రమంలో కాపురం చేశారు. కొన్నాళ్ల తరువాత లోపాముద్ర 'నాథా! మీరు కూడా సాధారణ పౌరునిలాగా అన్ని సౌకర్యాలతో కూడిన ఇంటిని నాకు ప్రసాదించండి. మీరు నాతో సర్వసౌభాగ్యాలతో ఉండే రాజులాగా ఉండండి. మనిద్దరం సౌభాగ్యాలతో కాలం గడపాలని నాకు అనిపిస్తోంది. నాకో కుమారుడిని ప్రసాదించండి'' అని అడిగింది. దానికి అగస్త్యుడు సౌభాగ్యాలు సంపదలు కావాలంటే నా దగ్గరే ముంది కేవలం తపస్సు చేసుకొనేవాడిని కదా. నీకోరికను నేనెలా తీర్చగలను. ఒకవేళ తపశ్శక్తితో నీకోరికను తీర్చాలని నీవు కోరుకుంటున్నావేమో కాని ఈ ఐహిక సుఖాల కోసం నా తపఃశక్తిని నేను వినియోగించను' అని కరాఖండిగా చెప్పాడు. దానికి కూడా లోపాముద్ర బాధపడకుండా నేనెపుడూ మీ తపశ్శక్తిని దుర్వినియోగం చేయమని చెప్పను. మీరు సాధారణ విప్రునిలాగే ధనం సంపాదించండి అని చెప్పింది. దానికి సరే అని అగస్త్యుడు ఓ సాధారణ బ్రాహ్మణునిలాగా ఓ పేరు ప్రఖ్యాతులున్న రాజు దగ్గరకు వెళ్లాడు.

ఆ రాజు మహర్షికి అర్ఘ్యపాద్యాదులిచ్చి ఆహ్వానం పలికాడు. కుశల ప్రశ్నలు అడిగాడు. మాటల మధ్యలో అగస్త్యుడు తాను వచ్చిన పనిని చెప్పి 'ఓ రాజా! నీ దగ్గర మిగిలి ఉన్న సొమ్ములో నాకు కొంత భాగాన్నివ్వు. నేను నా భార్య కోరిక తీర్చాలి''అని చెప్పాడు.

దానికా రాజు తన దగ్గర ఉన్న సొమ్ము, ఖర్చులు రెండూ విడమర్చి చెప్పి ''ఓ మహర్షి! ఇందులో మీకు మిగులుగా కనిపించిన సొమ్మును యథేచ్ఛగా తీసుకోండి' అని చెప్పాడు. అన్నీ లెక్కలు వేసి చూచిన అగస్త్యుడు ఇదంతా కూడా రాజ్య వ్యవహారాలను సక్రమంగా నడపడానికి, రాజ్యంలోని వారికి సుఖసౌఖ్యాలకు సరిపోను మాత్రమే ఉందని గ్రహించాడు. అందువల్ల ఈ సొమ్మును తీసుకోలేను అని చెప్పి మరొక రాజు దగ్గరకు వెళ్లాడు. అక్కడ కూడా పరిస్థితి అలాగే ఉంది.

ఏం చేయాలా అని ఆలోచిస్తున్న అగస్త్యుని దగ్గరకు అనేక ఆశ్రమాల నుంచి మునులందరూ వచ్చి 'ఓ మహర్షి వర్యా! మమ్మల్ని ఇల్వలుడనే రాక్షసుడు చాలా ఇబ్బందులు పెడుతున్నాడు. అమాయకులైన విప్రులను వాడు వాని తమ్మునితో చేరి పొట్టన పెట్టుకుంటున్నాడు. మమ్మల్నందరినీ మీరే కాపాడాలి' అని మొరపెట్టుకున్నారు.

అగస్త్యుడు నేను కూడా ఈ ఇల్వలుడు, వాతాపి అనే వారిని గూర్చి విన్నాను. సరే నేనే వెళ్లి వాని పని పడతానులే మీరు నిర్భయులై ఉండండి అని చెప్పి వారిని పంపించేశాడు. అగస్త్యుడు వాతాపిని ఏవిధంగా చంపాడో అందరికీ తెలిసిందే.

వాతాపి మరణంతో ఇల్వలుడు అగస్త్యునికి దాసోహం అయ్యాడు. తానెప్పుడు ఇతరుల జోలికి పోనని మాటిచ్చాడు. అపుడు ఇల్వలుని దగ్గర ఉన్న సొమ్మును తీసుకొని అగస్త్యుడు తన భార్య అయిన లోపాముద్ర కోరికను తీర్చాడు.


మరోసారి కాలకేయుడనే అసురుని అనుచరులంతా కలసి సాధుసజ్జనులందరినీ హింసించడం ఆరంభించారు. ఎంతోమందిని వారు పొట్టన పెట్టుకున్నారు. ఆ అసురులను సంహరించమని మునిగణమంతా మహావిష్ణువును ప్రార్థించారు. అపుడు మహావిష్ణువు వీరంతా సముద్ర గర్భంలో దాక్కుంటున్నారు. వీరిని బయటకు తీసుకొని వస్తే నేను సంహరిస్తాను. వీరు సముద్రం నుంచి బయటకు రావాలంటే ఆ సముద్రపు నీరంతా ఇంకిపోవాలి అని చెప్పాడు. సముద్ర జలాలను ఇంకింపచేసే వారు ఎవరా అని ఆలోచించే మునిగణానికి మహావిష్ణువే దీనికి అగస్త్యుడే తరుణోపాయం చూపిస్తారు. మీరంతా ఆయన అనుగ్రహాన్ని పొందండి అని చెప్పాడు. మునిబృందం అగస్త్యుని కోరగా ఆయన వెళ్లి ఆ సముద్ర జలాన్నంతా తన దోసిలిలోకి తీసుకొని ఒక్క గుక్కలో తాగేశాడు. సముద్ర నీరు తరిగిపోగానే రాక్షస గణం బయటపడింది. వారందరూ మహావిష్ణువు ఆజ్ఞప్రకారం సంహరించబడ్డారు.

ఈ అగస్త్యుడు రాముని చరిత్రలో కూడా మనకు కనిపిస్తాడు. ఎంతకీ రావణునిపై విజయం పొందలేక పోతున్నానని అనుకొనే రామునికి ఆదిత్య హృదయం బోధించి సూర్యునికి నమస్కారం చేసి యుద్ధానికి వెళ్లమని అగస్త్యుడు చెప్తాడు. అగస్త్యుడు చెప్పినట్లుగా రాముడు చేసాడు. రావణునిపై విజయం సాధించాడు.

ఆ అగస్త్యుడు తన శిష్యుడైన వింధ్యుడు (వింధ్యపర్వతం) ఒకసారి గర్వంతో అందరిని తలదన్నుతున్నట్లుగా పెరగ సాగింది. అలా సూర్యునికి అడ్డుపడడంతో ఆ నీడ వల్ల సమస్యలు ఉత్పన్నం కాసాగాయి. మునులు అగస్త్యుని ఆశ్రయించారు. అగస్త్యుడు మునుల కోరిక ప్రకారం వింధ్యుని దగ్గరకు వెళ్లాడు. తన గురువుగారిని చూసిన వింధ్యుడు వెంటనే ఆకారాన్ని తగ్గించుకుని వంగి గురువుగారికి నమస్కరించాడు. అపుడు అగస్త్యుడు 'ఓ వింధ్యా నేను దక్షిణాపథానికి వెళుతున్నాను. నేను వచ్చేవరకు నీవు ఇలాగే వంగి ఉండు' అని ఆజ్ఞాపించాడు. అంతే అప్పటి నుంచి తన ఆకారాన్ని పెంచకుండా అందరికీ అనువుగా ఉన్నాడు వింధ్యుడు. ఇతని జీవితాన్ని మనం ఆదర్శంగా తీసుకొని మనకున్నంతలో చేతనైనంత ఇతరులకు సాయం చేయాలన్న నీతిని నేర్చుకోవాలి. ఇలా నేర్చుకొని ఆచరించడమే మనం వారికిచ్చే నివాళిగా చెప్పుకోవచ్చు.

- అశ్విని

యజ్ఞాల కంటె కృష్ణభక్తి దివ్యం



భగవద్గీత

అధ్యాయం 4

శ్లోకం 28:

ద్రవ్యయజ్ఞాస్తపోయజ్ఞాః
యోగయజ్ఞాస్తథాపరే।
స్వాధ్యాయజ్ఞానయజ్ఞాశ్చ
యతయః సంశితవ్రతాః॥

తాత్పర్యం

కఠిన వ్రతాలను చేపట్టి కొందరు, తమ సంపత్తిని అర్పించటం ద్వారా మరి కొందరు తీవ్రతపస్సులు చేయటం ద్వారా, అష్టాంగ యోగ పద్ధతిని పాటించటం ద్వారా లేదా దివ్యజ్ఞాన పురోగతికై వేదాధ్యయనం చేయటం ద్వారా జ్ఞానవంతులవుతారు.

భాష్యం

అనేకమంది తమకున్న వాటిని సమాజ అభ్యున్నతికి దానధర్మాలు చేస్తారు.. వాటిని ''ద్రవ్యమయయజ్ఞము''లు అటారు. మరి కొందరు స్వర్గలోక ప్రాప్తి కోసం జీవిత సౌఖ్యాన్ని వదలి కఠినమైన తపస్సులను ఆచరిస్తారు. వాటిని ''తపోమయ యజ్ఞము''లు అందరు. ఇక మరికొందరు సిద్ధులను కోరి గాని, బ్రహ్మంలో లీనమవ్వాలని గాని హఠయోగ లేద పతంజలి యోగ పద్ధతులను పాటిస్తారు. కొందరు తీర్థయాత్రలను చేయటంలో మునిగి ఉంటే మరి కొందరు వేదాధ్యయనంలో నిమగ్నులవుతారు. ఇలా రకరకాల యజ్ఞాలందు నియుక్తులైన వ్యక్తులు ఉన్నత జీవన స్థాయిని కోరుకుంటారు. అయితే కృష్ణభక్తి విధానం అందుకు భిన్నమైంది. అది పైన చెప్పబడిన ఏ విధమైన యజ్ఞాల ద్వారా సాధ్యపడదు. కేవలం కృష్ణుడు, అతని భక్తుల కృప ద్వారా మాత్రమే ప్రాప్తించేది. కావున భగవంతుని ప్రత్యక్షసేవా విధానమైన కృష్ణభక్తిరస భావనం దివ్యమై ఉంది.

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఏసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

ఆంధ్రప్రభ యాప్‌లో శ్రావ్యమైన ఆడియోతో...

Google play | iOS iTunes

ఆంధ్రప్రభ నాయిక

సేవ



మహిళలకు ఎంతో ముఖ్యమైన దశ ఋతుక్రమ దశ. ఆ సమయంలో వారు సురక్షితమైన విధానాలను పాటించకపోతే అనుకోని విపత్కర పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుంది. అలా సురక్షితమైన పద్ధతులను పాటించక బాలికలు, మహిళలు ప్రతిసంవత్సరం ఎంతోమంది సెర్వికల్ కాన్సర్ బారిన పడుతున్నారు. ఈ పరిస్థితులను అవగాహన చేసుకున్న ఒక సంస్థ మహిళలు ఈ కాన్సర్ బారిన పడకుండా తనవంతుగా ఒక ప్రయత్నం మొదలుపెట్టింది. ఆ సంస్థ పేరేమిటి...వాళ్లు చేస్తున్నటువంటి సేవలేమిటో తెలుసుకుందాం...

ఆకార్ సంధించిన ఋతు 'చక్రం'



ఎ.సి. నీల్‌సేన్ అధ్యయనం ప్రకారం భారతదేశ జనాభాలో 355మిలియన్ల మహిళల్లో ఋతుక్రమంలో కేవలం 12శాతం మహిళలు మాత్రమే సానిటరీ నాప్‌కిన్స్‌ని వాడుతున్నారని తేలింది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల్లో 1033మందిని అధ్యయనకారులు ఇంటర్వ్యూ చేసినప్పుడు ఈ విషయాలు తెలిసాయి. నేటికీ 88శాతం మహిళలు ఆ సమయంలో వస్త్రాలనే వినియోగిస్తున్నారు. సురక్షితమైన సానిటరీ నాప్‌కిన్స్‌ని వాడడానికి కావలసిన ఆర్థిక స్థోమత వారికి లేదని ఈ అధ్యయనంలో 70శాతం కుటుంబాలు తెలిపాయి. ఈ అధ్యయనంలో ఇంకో విషయం కూడా తెలిసింది. ఋతుక్రమ సమయంలో 12 నుండి 19 సంవత్సరాల ప్రాయంలోని బాలికలలో 23శాతం మంది స్కూలుకి వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోతున్నారు. ఈ కారణాల వల్ల వారు చదువులో కూడా వెనుకబడిపోతున్నారని స్పష్టమైంది. అలాగే కొన్ని ప్రాంతాల్లో మహిళలు కూడా నాలుగురోజులు ఉద్యోగానికి వెళ్లకుండా ఇంట్లోనే ఉండిపోతున్నారు. ఆవిధంగా సంవత్సరానికి 48రోజులు ఆదాయాన్ని వాళ్లు కోల్పోతున్నారు. ఈ కారణంగా చాలామంది మహిళలు తమ అభివృద్ధిలో వెనుకబడుతున్నారని అధ్యయనకారులు పేర్కొన్నారు.

2010జూన్‌లో భారత ప్రభుత్వం ఒక కొత్త పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ సానిటరీ నాప్‌కిన్స్ తయారీకి కావలసిన ముడిసరుకులను సబ్సిడీలో అందజేయాలని, కాని నాప్‌కిన్స్ తయారుచేయడానికి కావలసిన శిక్షణ, నీటిసదుపాయం, వర్కర్లు లేకపోవడంతో ఆ పథకానికి ఆటంకం కలిగింది. ఈ నాప్‌కిన్స్ తయారీలో కూడా ఎకో ఫ్రెండ్లీ నాప్‌కిన్స్ అయితే మహిళలకు చాలా మంచిదని అధ్యయనకారుల అభిప్రాయం. ఒక మహిళ తన జీవితకాలంలో 125 నుండి 150 కేజీల సానిటరీ నాప్‌కిన్స్‌ని వాడుతుందని వారి అంచనా. కాని దీనికి ఎంత ఖర్చవుతుందనే విషయాన్ని వారు అంచనా వేయలేకపోతున్నారు. అలా ఈ పరిశోధనలో పాల్గొన్న ఆకార్ సంస్థ ఫౌండర్ జయదీప్ మండల్‌కి మహిళల పరిస్థితి చూసి మనసు కకావికలమైపోయింది. వీరిగురించి ఏదోఒకటి చేయాలన్న తపన మనసులో మొదలైంది. ఆ ఆలోచనల ప్రతిరూపంగా ఎకో ఫ్రెండ్లీ సానిటరీ నాప్‌కిన్స్‌ను తయారుచేసే ఫ్యాక్టరీ అజ్మీర్‌లో ప్రారంభమైంది. ఈ ఫ్యాక్టరీలో మట్టిలో కలిసిపోయేవిధంగా నాప్‌కిన్స్‌ని తయారుచేస్తున్నారు. కేవలం వీటిని తయారుచేసి అమ్మడమే కాకుండా కొంతమంది మహిళలు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి ఈ నాప్‌కిన్స్‌ని వాడటం వల్ల కలిగే ఉపయోగాలేమిటనేది ప్రతి మహిళకూ వివరిస్తున్నారు. అంతేకాదు ఈ సానిటరీ నాప్‌కిన్స్‌ను వాడే వారికి సెర్వికల్ కాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని వివరిస్తూ, అక్కడి ప్రజలకు వాటిపట్ల అవగాహన కల్పిస్తున్నారు.

ఆకార్ సంస్థ జయదీప్ మండల్ ఆలోచనే ఈ ఫ్యాక్టరీ. ఈ సానిటరీ నాప్‌కిన్స్ మట్టిలో కలిసిపోయేటట్టు తయారుచేస్తే ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు ఉండవు కదా అని ఆలోచించి, ఆయన గ్రామీణ ప్రాంతాలలోని మహిళలతో మాట్లాడి వారందరూ ఈ ఫ్యాక్టరీలో పనిచేసేలా ఒప్పించి ఎకో ఫ్రెండ్లీ సానిటరీ నాప్‌కిన్స్‌ని తయారుచేసేలా ఒక చిన్న ఫ్యాక్టరీని ప్రారంభించారు.





2013లో 'ఆనంది'అనే పేరుతో వందశాతం మట్టిలో కలిసిపోయేవి, ఎక్కువ సురక్షితమైన సానిటరీ నాప్‌కిన్స్‌ని, తయారుచేయడానికి పూనుకున్నారు. దీనివలన ఎంతోమంది మహిళలు, బాలికలను ఇన్ఫెక్షన్స్, వ్యాధులు, మరణాల నుంచి రక్షించటమే ధ్యేయంగా ఈ సంస్థను ప్రారంభించారు. వీటిని తయారుచేయడమే కాదు మహిళలందరూ వీటిని వాడేలా ప్రచారం చేయాలని కూడా నిశ్చయించుకున్నారు. క్లాత్ వాడడాన్ని నిషిద్ధం చేయాలని గ్రామాలలో ప్రచారం చేస్తున్నారు. ఈ సంస్థ ఎక్కువగా బస్తీ ప్రాంతాలలో, గ్రామాలలో పర్యటించి వారికి వీటి ప్రయోజనాన్ని వివరించి వాడేటట్లు చేస్తున్నారు. వారిలో అవగాహనను కల్పిస్తున్నారు. ప్రతి ఒక్కరిలో వీటిపట్ల అవగాహనను కల్పించి వారు వాడి ఆరోగ్యకరమైన జీవితాన్ని ప్రతి బాలిక ఆస్వాదించాలనేదే వారి ఉద్దేశ్యం. ఈ ఫ్యాక్టరీలో పనిచేసే వాటాదారులు స్కూళ్లలోని ఆరోగ్యాధికారులుగా, వుమెన్ సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లుగా, కమ్యూనిటీ వాలంటీర్లుగా తయారై తమ విధులను నిర్వహిస్తున్నారు. ఇందులో పనిచేసే ప్రతి ఒక్కరి ఆలోచన ఋతుక్రమ సమయంలో సురక్షితంగా ఉండాలని, తమ ఆలోచనలను మార్చుకొని డిస్పోజబుల్ పాడ్‌లను వాడాలని వారి ప్రయత్నం. దీనిద్వారా పర్యావరణం కూడా మెరుగుపడి ఏజెన్సీ ప్రాంతాలలో బాలికలు, మహిళలకు మేలు జరగాలనేదే వారి ఆశ. ఈ సంస్థ తమ యూనిట్లను 14 విభిన్న రాష్ట్రాలలో నిర్వహిస్తున్నారు. అంతర్జాతీయ యూనిట్లు కూడా ఉన్నాయి. అవి కెన్యా, సౌత్ ఆఫ్రికా, ఉగాండా.

ఈ సంస్థ ఒకచోట ఈ ఫ్యాక్టరీ ప్రారంభించడమే కాకుండా అలాంటి ఫ్యాక్టరీలు తమ ఊరిలో ఏర్పరచుకోవడానికి కావలసిన సహాయాన్ని కూడా అందజేస్తున్నది. అందులో పనిచేసే మహిళలకు వీటిని ఎలా తయారుచేయాలో శిక్షణ ఇస్తున్నారు. వాళ్లను విలేజ్ లెవెల్ ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా పిలుస్తున్నారు. అందులో పనిచేసేవారందరికి సురక్షితమైన నాప్‌కిన్స్‌ని ఎలా తయారుచేయాలో వివరిస్తున్నారు. ఇప్పటివరకు ఈ సంస్థ నుండి 12000 నుండి 14000మంది మహిళలు, బాలికలు ప్రయోజనాన్ని పొందినట్లు సంస్థ నిర్వాహకులు చెబుతున్నారు. కంపోస్టబుల్ సానిటరీ పాడ్స్ వాడటం వల్ల పర్యావరణం కూడా బాగుంటుందని వాళ్లు తమ ప్రచారంలో పేర్కొంటున్నారు. ఈ ప్రచారంలో స్కూల్ టీచర్స్‌ను, ఆషా వర్కర్లను, అంగన్‌వాడీ వర్కర్లను చేర్చుకుని ప్రతి ఒక్కరితో ఊరూరా ప్రచారం చేయిస్తున్నారు. ఉన్నత ఆశయంతో ముందుకు నడుస్తూ ఎంతో మంది మహిళల జీవితాలను నిలబెడుతున్న ఆకార్ సంస్థకు ప్రతి మహిళా అభినందనలు తెలియజేయాల్సిందే.

పిల్లల్ని కంటేనే తల్లి అవుతుందని అనుకోకూడదు. జీవితంలో ఎదురయ్యే అనుభవాలను బట్టి ప్రతి మహిళలో ఉండే మాతృత్వం కనబడుతుంది. తల్లికి గల విలక్షణతలు ఎన్నో. ఆమె ఒక గార్డియన్‌గా, ప్రేమని అందించే మాతృమూర్తిగా పరిస్థితులను బట్టి మారుతూంటుంది. తన బాధ్యతలను నెరవేర్చడానికి నిరంతరం మెదడుకు పదును పెడుతూనే ఉంటుంది. పిల్లల అభివృద్ధి గురించి, విలువల గురించి, స్వేచ్ఛ గురించి వివరించేది కేవలం అమ్మే. అలాంటి ఓ అమ్మ తన సేవాకార్యక్రమాల ద్వారా వెలుగులోకి వచ్చింది. ఆమె పేరే ఎస్ఓఎస్ మదర్ గీతాసింగ్. ఆమె చేసిన సేవలను గుర్తించి హెల్మట్ కుటిన్ అవార్డును బహూకరించారు. ఇంతకీ గీతాసింగ్ ఎవరో తెలుసుకుందాం...

ఆదర్శం

కన్నతల్లిలా ఆదరిస్తున్న గీత



ఆమె వయసు 44సంవత్సరాలు. మనోహరమైన స్వభావం కలది. అంతేకాదు ఎటువంటి పరిస్థితులకు లొంగకుండా ధైర్యంగా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతుంది. ఆమె భోపాల్‌లోని ఖజూరిఖాన్ గ్రామంలో ఎస్ఓఎస్ మదర్ ఇన్ చిల్డ్రన్స్‌కి తన సేవలను అందిస్తోంది. ఆ గ్రామంలో పెద్దవాళ్లు తమ పిల్లలకోసం ఈ సంస్థను ఏర్పరిచారు. వారికవసరమైన ముఖ్య అవసరాలను తీర్చడమే ధ్యేయంగా ఆమె అక్కడ పనిచేస్తోంది. ఈ సంస్థలో పనిచేస్తున్న ప్రతి మహిళ తన అపారమైన శక్తిని ఉపయోగించి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దుతుందనే నమ్మకంతో మేము ఇక్కడ పనిచేసే మహిళలను ఎంపికచేస్తున్నామని ఆమె చెప్పారు. ఆమెకు ఇక్కడున్న పిల్లలకు ఎటువంటి సంబంధం లేకపోయినా ఆమె ఇచ్చే ప్రోత్సాహాన్ని,ప్రేమని చూసి పిల్లలంతా ఆమె పట్ల ఎంతో ఆకర్షితులవుతున్నారు.



ఎస్ఓఎస్‌విలేజ్ ఖాజూరిఖాన్ పిల్లల అవసరాలకోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నది. 2004లో ఈసంస్థస్థాపించ బడింది. ఈ సంస్థ ముఖ్య ఉద్దేశ్యమేమిటంటే వెనుకబడిన కుటుం బాల పిల్లలకు విద్యను అందజేసి వారి కనీస అవసరాలను తీర్చి సమాజంలో వారికంటూ ఒక స్థాయి వచ్చే దాకా ప్రోత్సాహాన్నివ్వడమేనని ఆమె చెప్పారు. ఈ సంస్థలో 186మంది పిల్లలు 14మంది తల్లులు, 12మంది ఆయాల మధ్య వాళ్ల జీవితాన్ని ముందుకు నడిపిస్తున్నారు.

గీత మదర్‌గా ప్రయాణం మొదలైందిలా...

ఆమె ఎస్ఓఎస్ సంస్థలోకి 2003లో ప్రవేశించింది. పిల్లల పట్ల చూపించేప్రేమ, శ్రద్ధ, ఈసంస్థకు అవసరమనిపించి ఆ ఊరి ప్రజలు ఆమెను నియమించారు. మొదట్లో ఆమె ఈ విధినిర్వహణకు రావాలంటే భయపడిపోయింది. కాని ఇప్పుడు ఎంతమంది పిల్లలు వచ్చినా ఎంతో శ్రద్ధతో వారిని తీర్చిదిద్దవచ్చునన్న ఆత్మవిశ్వాసం ఆమెకు కలిగింది. ఆ సంస్థలో సర్వీసు పెరిగే కొద్దీ ఆమెలో ఆత్మవిశ్వాసం మరింత పెరుగుతూ వస్తోందని, అంతేకాదు ఆ సంస్థలో తన పాత్ర ఏమిటో, తన బాధ్యతలేమిటో తెలిసాయని ఆమె చెప్పారు. పిల్లలతో తరచుగా మాట్లాడడం వల్ల వారి మనోభావాలను, ప్రత్యేక అవసరాలు ఏమిటనేది తెలిసేవని తెలిపారు. ఆమె పిల్లలకు ఆరోగ్య సూచనలు కూడా చెప్పేది. ప్రతి ఒక్కరూ కూడా ఎక్కువగా నడిచే విధంగా పనులు చేయించేది. దాని వల్ల వారికి ఆరోగ్యం సమగ్రంగా ఉండేది. అంతే కాదు ఆరోగ్యానికి కావలసిన ప్రత్యేక సూచనలను భోజన సమయంలో పాటించాల్సిన నియమాలను చెబుతుండేది. విద్యార్థులలోని మానసిక, శారీరక వైకల్యాలను త్వరగానే గుర్తించేది. వారికి కావలసిన వైద్యసదుపాయాలను అందజేసేది.

''ఈ సంస్థకు వచ్చి నాకు పద్నాలుగేళ్లు అయ్యింది. నా కృషితో 12మంది విద్యార్థులను మంచి మార్గంలోకి తీసుకురాగలిగాను. ఈ సమయంలో ఇటువంటి సంస్థ నిర్వహించ డమనేది చాలా ఛాలెంజింగ్‌తో కూడుకున్నది. నా సంస్థలోని పిల్లలు మంచి భవిష్యత్తుకు వెళ్లినప్పుడు నేను పడిన బాధలన్నీ మటుమాయ మయిపోతాయి. వారిని చూస్తే జీవితంలో ఏదో సాధించా నన్న సంతృప్తి నాకు కలుగుతుంది'' అని ఆమె అన్నారు. సంస్థలోని ఇద్దరమ్మాయిలు డెఫ్ అండ్ డంబ్. ఆమె వాళ్లను ఎంతో ప్రేమతో చూసుకుంటుంది వారిని అలా వదిలేయకుండా ఒకామెకు బ్రెయిలీ లిపిని నేర్పిస్తున్నది. 2015సం.లో సంస్థలోని పిల్లలు శృతి,విజయ్ స్పెషల్ ఒలింపిక్స్ వరల్డ్ సమ్మర్ గేమ్స్‌లో పాల్గొని మెడల్స్‌ను కూడా సంపాదించారు. ఇది వారికి మాత్రమే విజయం కాదు. ఎస్ఓఎస్ విజయం కూడా అని గీత అన్నారు. నా వివాహ జీవితం నాకు పిల్లలు పుట్టే అవకాశం లేదనే కారణంతో అర్థాంతరంగా ముగిసిపోయింది. ఆ సమయంలో ఈ సంస్థ ఇచ్చిన కోచింగ్ వల్ల నేను ఇంతమంది పిల్లలకు తల్లినయ్యానని ఎంతో గర్వంగా చెప్పారామె. ఆమె నిస్వార్థపూరిత సేవాభావాన్ని గుర్తించి ప్రభుత్వం హెల్మట్ కుటిన్ అవార్డు 2017ను అందజేసింది. ఈ అవార్డు ప్రదానం ఎంతో ప్రతిష్టాత్మకమైన హెల్మట్ కుటిన్ అధ్వర్యంలో జరిగింది. ప్రపంచంలో ఎస్ఓఎస్ సంస్థలు 134 దేశాల్లో ఉన్నాయి. ఈ సంస్థలోని పిల్లల పట్ల పనిచేసేవారు చూపిస్తున్న ఆత్మీయతను దృష్టిలో పెట్టుకుని వీరు ఈ అవార్డును అందజేస్తారు. ఈ అవార్డు అందుకున్న సమయంలో పత్రికల వాళ్లతో మాట్లాడుతూ....పిల్లలను కంటేనే తల్లి అయిపోరు. వారిని ప్రేమతో, దయతో, వాత్సల్యంతో ఎవరైతే మంచి భవిష్యత్తు మార్గాన్ని చూపిస్తారో, మంచి జీవితంకోసం విద్యాబుద్ధులు నేర్పిస్తారో ఆమె అసలైన తల్లి అని ఎంతో గర్వంగా చెప్పారు. అందరినీ ఎంతో ఆప్యాయతతో చూసుకుంటూ మంచి భవితకు మార్గాన్ని ఏర్పరుస్తున్న మదర్ గీతకు హేట్సాఫ్ చెప్పాల్సిందే.

విజేత

పేదరికంతో పరుగు పందెం!

సంకల్ప శక్తి ఉంటే అసాధ్యాన్ని సాధ్యం చేయవచ్చునని నిరూపించింది చిత్ర. రోజు కూలీ చేసుకునే జీవనం సాగించే కుటుంబంలో పుట్టిన అమ్మాయి చిత్ర. రన్నింగ్‌లో మంచి స్థాయికి చేరుకోవాలనే తపనతో స్వయంకృషితో శిక్షణ పొంది క్వీన్ ఆఫ్ ఆసియా ఇన్ ద మైల్ కి ఎంపిక అయ్యింది. ఆమె వివరాలు మీకోసం...

ఆమె 1995సం.లో జూన్9వతేదీన కేరళలోని పలక్కడ్ జిల్లా ముండూర్‌లో ఉన్నికృష్ణన్, వసంతకుమారి దంపతులకు జన్మించింది. వాళ్లకు నలుగురు సంతానం. అందులో చిత్ర మూడవది. రోజు కూలీతోనే వారి జీవనం నడుస్తోంది. ఆమె పలక్కడ్‌లో హయ్యర్ సెకండరీ స్కూల్‌లో తన చదువును పూర్తిచేసింది. ఆమెకు రోజుకు 25రూపాయలను కేరళ స్పోర్ట్స్ కౌన్సిల్ అందించేది.

ఆమెలోని ఉత్సాహాన్ని చూసి స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నెలకు రూ.600 ఇచ్చేది. యువ అథ్లెట్స్‌ను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా ఈ మొత్తం ఇచ్చారు. దీంతో ఆమె తన శిక్షణ అవసరాలు తీర్చుకునేది.

ఆమె 2011 సంవత్సరంలో మహారాష్ట్రలోని పుణెలో జరిగిన 56వ ఇండియన్ నేషనల్ స్కూల్ గేమ్స్‌లో 1500 మీటర్ల పరుగు పందెంలో గోల్డ్ మెడల్, 3000, 5000మీటర్ల పరుగు పందెంలో రజతపతకాన్ని పొందింది.

2012సంవత్సరంలో తిరువనంతపురంలోని కేరళ స్టేట్ స్కూల్ గేమ్స్‌లో, 1500మీటర్లలో,3000, 5000మీటర్లలో గోల్డ్‌మెడల్ పొందింది.

2013సంవత్సరంలో ఎర్నాకులంలోని 57వ కేరళ స్టేట్ స్కూల్ గేమ్స్‌లో 1500మీటర్లలో,3000, 5000మీటర్లలో గోల్డ్‌మెడల్ పొందింది.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఈతవాహ్ లోని 58వ ఇండియన్ నేషనల్ స్కూల్ గేమ్స్‌లో 1500, 3000, 5000 మీటర్లే కాకుండా మూడు కిలోమీటర్ల పందెంలో కూడా ఆమె గోల్డ్‌మెడల్ సంపాదించింది. 3000మీటర్ల పందెంలో 10.05.22సమయంలో రన్నింగ్ ముగించిన మొదటి ఆసియా స్కూల్ అథ్లెట్ ఆమె. 2016లో ఒడిషాలోని రాంచీలోని 59వ ఇండియన్ నేషనల్ స్కూల్ గేమ్స్‌లో 1500మీటర్లలో,3000, 5000మీటర్లలో గోల్డ్‌మెడల్ పొందింది. అంతేకాదు ఆమె సాధించిన విజయాలకు ప్రతిఫలంగా టాటా నానోకారును ఉత్తర్‌ప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్, కేరళ ప్రభుత్వం కలిసి బహూకరించాయి. చిత్ర తల్లిదండ్రులకు పనిదొరకలేని సమయంలో ఇంట్లోని వారందరూ ఖాళీకడుపులతోనే పడుకునేవారు. ఆమె కూడా అలాగే పడుకునేది. అలాంటి పరిస్థితుల్లో కూడా తెల్లవారుజామునే రన్నింగ్ ప్రాక్టీస్ కోసం 5.45నిమిషాలకే లేచి స్కూల్‌కి వెళ్లిపోయేది.



ఆమె కోచ్ సిజిన్ ఎన్.ఎస్. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ''చిత్ర ఎప్పుడూ విదేశాల్లో జరిగే పోటీల్లో పాల్గొని భారతదేశ గౌరవాన్ని పెంచాలనుకుంటుంది''అని చెప్పారు. స్కూలు సమయంలోనే ఆమె అథ్లెటిక్ రంగాన్ని ఎంచుకుంది. వారి కుటుంబ పరిస్థితుల రీత్యా ఆమెకు సంపూర్ణ ఆరోగ్యంలేకపోయినా ప్రతీ పోటీలో విజయం సాధించడం ఎంతో గర్వించదగ్గ విషయమని అన్నారు. ఆమె ఎన్నో కష్టాలను, సమస్యలను ఎదుర్కొంటుంది. కాని అటువంటి పరిస్థితులలో కూడా శిక్షణకోసం క్రమం తప్పకుండా స్కూలుకి వచ్చేది. ఆ వయసు వారిలో అంతటి అకుంఠిత దీక్షను నేను మరే అథ్లెట్‌లోనూ చూడలేదు''అని ఆయన చెప్పారు. మా అమ్మాయి భారతదేశం తరపున వివిధ దేశాలలో పాల్గొని ఎన్నో మెడల్స్ సాధించాలన్నదే మా కోరిక అని ఆమె తల్లితండ్రులు చెప్పారు. మా దగ్గర కనుక డబ్బు ఉండి, పలుకుబడి కూడా ఉండి ఉంటే నిజంగా మా అమ్మాయి ఇన్ని విజయాలు సాధించగలిగేదా అని ఆమె తండ్రి ఉన్నికృష్ణన్ పత్రికా విలేఖరులతో ఎంతో ఆనందంతో చెప్పారు.


ప్రభాస్, శ్రద్ధాకపూర్

ప్రభాస్‌కు జోడీ దొరికింది

ప్రభాస్‌కు సంబంధించి ప్రతిది ఆసక్తికరమైన వార్త అవుతోంది. బాహుబలితో ప్రపంచవ్యాప్త ఖ్యాతి తెచ్చుకున్న ప్రభాస్ నటిస్తున్న కొత్త చిత్రం సాహో.. ఐదేళ్ళు బాహుబలి కోసం డేట్స్ కేటాయించిన ఈ హీరో ఇప్పుడు పక్కా కమర్షియల్ సినిమా చేస్తున్నారు.

తన సొంత నిర్మాణ సంస్థ యువీ క్రియేషన్స్ నిర్మించే సాహో చిత్రానికి సుజిత్ దర్శకుడు. జాతీయ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

సాహో..లో నటించే నాయిక ఎవరు? అనేదానిపై కొనసాగిన సస్పెన్స్ విడిపోయింది. తొలుత అనుష్క, తమన్నాతో పాటు మరికొన్ని పేర్లు వినిపించినా ఇప్పుడు బాలీవుడ్ భామ శ్రద్ధాకపూర్‌ను ఎంపికచేసినట్టు అధికారికంగా ప్రకటించారు. ఈ శ్రద్ధాకపూర్ (30) ఎవరంటే బాలీవుడ్ కమేడియన్, విలన్ పాత్రధారి శక్తికపూర్ తనయ. 2010లో కెరీర్ మొదలు పెట్టింది. ఏక్ విలన్, ఏబిసిడి, బాగీ వంటి సినిమాల్లో నటించి ప్రశంసలు అందుకుంది. ఆషికి 2లో గాయనిగా అభినందనలు అందుకుంది. నటన కొనసాగిస్తూనే గాయనిగా కూడా పేరు తెచ్చుకుంది. సాహో..లో ప్రభాస్‌కు సరైన జోడీ అవుతుందని ఆమెను ఎంపికచేసినట్టు తెలిసింది.

సాహో.. చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళ భాషల్లో ఏకకాలంలో నిర్మిస్తారు. శంకర్ ఎహసాన్ సంగీతం అందిస్తున్నారు.

మళ్లీ నటిస్తోంది!


మాళవికనాయర్

ఆ మధ్య పరీక్షల కారణంగా నటనకు కాస్త గ్యాప్ ఇచ్చిన మాళవికనాయర్ మళ్లీ సినిమాలను అంగీకరించడం మొదలుపెట్టింది. మలయాళీ కుటుంబానికి చెందిన మాళవిక ఢిల్లీలో పుట్టి పెరిగింది. తొలుత మలయాళ, ఆ తర్వాత తమిళ సినిమాల్లో అవకాశాలు రావడంతో ఓ వైపు చదువుకుంటూనే నటనవైపు కూడా మొగ్గుచూపింది. ఈ నేపథ్యంలో నాని కథానాయకుడిగా తెరకెక్కిన ఎవడే సుబ్రమణ్యం, నాగశౌర్య కథానాయకుడిగా నందినిరెడ్డి దర్శకత్వంలో రూపొందిన కల్యాణ వైభోగమే వంటి చిత్రాలలో కథానాయికగా నటించడం ద్వారా తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితమైంది. అందానికి అందం, అభినయానికి అభినయంలో మంచిమార్కులే సంపాదించుకున్న ఆమెకు మంచి భవిష్యత్తే ఉంటుందన్న అభిప్రాయాలు ఆమె నటించిన రెండు సినిమాల తర్వాత సినీ పరిశ్రమలో వ్యక్తమయ్యాయి. మంచికథ, మంచి పాత్రలతోనే ప్రేక్షకులకు దగ్గర కావాలని ఆమె నిర్ణయించుకోవడం కూడా సంఖ్యాపరంగా తక్కువ సినిమాలు చేసేందుకు కారణమని అంటున్నారు. ఇదిలావుండగా, కల్యాణ వైభోగమే చిత్రం విడుదల తర్వాత ఆమె కొత్త చిత్రాలను అంగీకరించలేదు. అందుకు కారణం ఏమిటని అడిగితే ప్లస్ టూ చదువుతున్నందువల్ల పరీక్షలయ్యేంతవరకు కొత్త సినిమాల జోలికి వెళ్లదలచుకోలేదని అప్పట్లో ఆమె చెప్పుకొచ్చింది. చదువు పట్ల తనకున్న అమితమైన ఇష్టం వల్లే సినిమాలకు గ్యాప్ ఇస్తున్నానే తప్ప సినిమాలంటే ఇష్టంలేక కాదు అని ఆమె వివరించింది.కూడా. ఎట్టకేలకు మళ్లీ సినిమాలకు ఆమె గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం ఆరంభించింది. ఇప్పటికే తమిళంలో సినిమాలను అంగీకరించిన ఆమె ఇప్పుడు తెలుగులో ఓ చిత్రం చేయబోతున్నట్లు వినిపిస్తోంది. విజయ్ దేవరకొండ (పెళ్లిచూపులు ఫేమ్) కథానాయకుడిగా రూపొందిన అర్జున్‌రెడ్డి విడుదలకు సిద్ధమవుతుండగా, ఆయన మరో చిత్రం చేయబోతున్నారు. ది ఎండ్ చిత్రం దర్శకుడు రాహుల్ దర్శకత్వంలో రూపొందబోయే చిత్రంలో విజయ్ దేవరకొండ నటించబోతున్నారు. ఇందులో క్యాబ్ డ్రైవర్‌గా ఆయన పాత్ర ఉంటుందని, ఆయన సరసన కథానాయికగా మాళవిక పేరును పరిశీలిస్తున్నట్లు తెలిసింది.


అజిత్, కాజల్

అజిత్‌తో హ్యాట్రిక్ సినిమా

తమిళ స్టార్ హీరో అజిత్ మరో సరికొత్త గెటప్‌లో ప్రేక్షకుల ముందుకువస్తున్నారు. కాజల్ అగర్వాల్, అక్షర హాసన్‌లతో కలిసి అజిత్ నటిస్తున్నాడు. సినిమా పేరు వివేగం. వివేక్ ఒబరాయ్ కీలక పాత్రధారి. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వంశధార క్రియేషన్స్ పతాకంపై నవీన్ శొంఠినేని వివేకం పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం సమకూర్చారు.

దర్శకుడు శివ మాట్లాడుతూ అజిత్‌గారితో ఇది హ్యాట్రిక్ సినిమా. జేమ్స్‌బాండ్ మూవీలా స్టైలిష్‌గా ఉంటుంది. అభిమానులు చూడాలనుకుంటున్న పాత్రలో లుక్ ఉంటుంది. ఆగస్టు 24న సినిమాను విడుదల చేస్తున్నాం అని తెలిపారు.

నలుగురు హీరోలతో కలిసి నటించా: తాప్సీ



తాప్సీ పన్ను ప్రధాన పాత్రలో రూపొందిన చిత్రం ఆనందోబ్రహ్మ. శ్రీనివాసరెడ్డి, వెన్నెల కిషోర్, తాగుబోతు రమేష్, షకలక శంకర్ ఇతర ప్రధాన పాత్రధారులు. మహి వి.రాఘవ్ దర్శకుడు. 70 ఎం.ఎం. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. కాగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన హీరో ప్రభాస్ బిగ్ సీడీని విడుదల చేయగా, మరో అతిథిగా పాల్గొన్న ఎం.శ్యాంప్రసాద్‌రెడ్డి థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదలచేశారు.

ఈ సందర్భంగా ప్రభాస్ స్పందిస్తూ, దెయ్యం మనుషులకు భయపడే కాన్సెప్ట్‌తో రూపొందించిన ఈ చిత్రం ఎంతో ఆసక్తిని కలిగిస్తోంది. ఈ తరహా కాన్సెప్ట్‌తో సినిమా రావడమనేది భారతీయ సినీరంగంలో ఇదే మొదటిసారి. ఇందులో తాప్సీ అందమైన దెయ్యంగా నటించింది. దర్శకుడు మహి కాన్సెప్ట్ చాలా బావుంది. మంచి నటీనటులంతా ఇందులో నటించారు. విడుదలకు ముందే ఈ సినిమా గురించి మంచి టాక్ వింటున్నాను అని అన్నారు. ప్రధాన పాత్రధారి తాప్సీ పన్ను మాట్లాడుతూ, ఈ సినిమాలో నలుగురు హీరోలతో కలిసి నటించానని చెప్పగా, దర్శకుడు మహి వి.రాఘవ్ మాట్లాడుతూ, దెయ్యం ఎలా ఉంటుందో నాకే కాదు ఎవరికీ తెలియదని అనుకుంటాను. వాస్తవానికి దెయ్యాలంటే నాకు నమ్మకం లేదు. తాప్సీ లేకుండా ఈ సినిమా వీలయ్యేది కాదు అని అన్నారు. నటుడు సుధీర్‌బాబు మాట్లాడుతూ, నేను, నిర్మాత విజయ్ కాలేజీ స్నేహితులం. నేను నటించిన భలే మంచిరోజు చిత్రంతో అతను నిర్మాతయ్యారు.

తాజాగా అతను తీసిన ఈ చిత్రం ప్రేమకథాచిత్రమ్ కంటే బావుంది అని అన్నారు. నటుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ఇందులో నా పాత్ర పేరు సిద్ధు. దర్శకుడు నా పాత్రను ఎంతోబాగా మలిచారు అని పేర్కొనగా, ఈ చిత్రంలో విభిన్నమైన పాత్రను పోషిస్తున్నానని వెన్నెల కిషోర్ చెప్పారు. నటుడు తాగుబోతు రమేష్ మాట్లాడుతూ, ఈ సినిమాలో పగలు దెయ్యానికి భయపడుతూ, రాత్రి తొమ్మిది తర్వాత దెయ్యాన్ని నేను భయపెట్టే పాత్రలో నటించానని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాజీవ్ కనకాల, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

అందమైన ప్రేమకథ


అనుపమ పరమేశ్వరన్, దుల్కర్ సల్మాన్

ఓకే బంగారం ఫేమ్ దుల్కర్ సల్మాన్, అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించిన చిత్రం అందమైన జీవితం పేరుతో తెలుగులో విడుదల కానుంది. మళయాలంలో హిట్ అయిన ఈ చిత్రాన్ని మేఘవర్ణ క్రియేషన్స్ తెలుగులో అనువదిస్తోంది. ఐశ్వర్య రాజేష్ మరోక నాయికగా నటించింది. విద్యాసాగర్ సంగీతం అందిస్తున్నారు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది.

నిర్మాత పత్తిపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇది కుటుంబనేపథ్యంలో సాగే ప్రేమకథ. తండ్రికొడుకుల మధ్య అనుబంధాన్ని, ప్రేమికుల మధ్య ప్రేమని అద్భుతంగా ఆవిష్కరించారు. సంగీతపరంగా హిట్ అయింది. మళయాలంలో యాభై కోట్లు వసూలు చేసింది. నెలాఖరున విడుదల చేయబోతున్నాం అని తెలిపారు.

ఈ చిత్రానికి మాటలు ఘంటసాల రత్నకుమార్, ఛాయాగ్రహణం ఎస్.కుమార్, పాటలు శ్రీరామమూర్తి, దర్శకత్వం సత్యన్ అంతిక్కాడ్.

మన చుట్టూ కనిపించే పాత్రలతో...


స్వాతి, రక్షిత్

రక్షిత్, స్వాతి నాయకానాయికలుగా తెరకెక్కుతున్న చిత్రం లండన్ బాబులు. చిన్నికృష్ణ దర్శకత్వంలో మారుతీ టాకీస్, ఏవీయస్ స్టూడియోస్ పతాకాలపై మారుతి నిర్మిస్తున్న ఈ చిత్రం నిర్మాణానంతర పనుల్లో ఉంది. కాగా మంగళవారం స్వాతంత్ర్య ధినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ చిత్రం తొలిపాటను అతిథిగా విచ్చేసిన దర్శకుడు హరీష్‌శంకర్ విడుదలచేయగా, టీజర్‌ను మరో అతిథి తమ్మారెడ్డి భరద్వాజ విడుదలచేశారు. ఈ సందర్భంగా భరద్వాజ మాట్లాడుతూ, మంచి సినిమాలు రావాలని అంటుంటాం. అలా వచ్చిన మంచి సినిమాలను ఆదరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఇందులోని పాత్రలు సహజత్వానికి దగ్గరగా ఉన్నాయి అని అన్నారు. హరీష్‌శంకర్ మాట్లాడుతూ, స్వాతికి ఏడాదికి పది సినిమాలు చేసే అవకాశాలున్నా ఆమె మాత్రం మంచి కథావస్తువును ఎంపిక చేసుకుని ఏ సినిమానైనా అంగీకరిస్తుంటుంది.

అష్టాచమ్మా మొదలుకుని కార్తీకేయ వంటి పలు చిత్రాలను ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. మారుతి నిర్మాతగా నాకు స్ఫూర్తిదాయకంగా అనిపిస్తుంటారు. దర్శకుడు చిన్నికృష్ణ ఈ చిత్రాన్ని ఎంతోబాగా మలిచారు. చిత్రానికి స్వాతి ప్రత్యేక ఆకర్షణవుతుంది. ఇలాంటి సినిమాలను ప్రోత్సహిస్తే మరిన్ని మంచి సినిమాలను తీసే అవకాశం కలుగుతుంది. వచ్చే నెలలో సినిమాను విడుదలచేస్తాం అని అన్నారు. కథానాయిక స్వాతి మాట్లాడుతూ, ఇందులోని పాత్రలలో నిజాయితీ కనిపిస్తుంది. వేరే ప్రపంచంలా కాకుండా మన సమాజంలో, మన చుట్టూ ఉండే పాత్రలనే ఈ చిత్రంలో చూస్తాం అని పేర్కొనగా, దర్శకుడు చిన్నికృష్ణ మాట్లాడుతూ, కథ, పాత్రలకు తగ్గట్టుగా నటీనటులను ఎవర్ని అడిగినా, అలాగే శ్యామ్.కె.నాయుడు వంటి టాప్ టెక్నీషియన్లు కావాలని చెప్పినా మరోమాట లేకుండా మారుతి ఓకే చెప్పారు. ఆండవన్ కట్టళై అనే తమిళ సినిమా ఆధారంగా దీనిని రూపొందించాం. వీసా కోసం పడే తిప్పల్ని గురించి ఇందులో చూపించాం. రెగ్యులర్ చిత్రాలకు భిన్నంగా ఉంటుంది అని అన్నారు

భయపెట్టే షాలిని



స్వర్ణ ప్రొడక్షన్స్ పతాకంపై ఆమోగ్ దేశపతి, అర్చన, శ్రేయావ్యాస్ నాయకానాయికలుగా తెరకెక్కిన చిత్రం షాలిని. సాయివెంకట్ సమర్పణలో షెరాజ్ దర్శకత్వంలో పి.వి.సత్యనారాయణ నిర్మించిన ఈ చిత్రం ప్లాటినమ్ డిస్క్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. అతిథులుగా విచ్చేసిన తెలంగాణ ఫిలిం చాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్, సీనియర్ నటి కవిత చేతులమీదుగా చిత్రబృందానికి జ్ఞాపికల ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ, ఈ చిత్రం మేకింగ్ ఛూశాను. చాలా బావుంది. చిన్న సినిమా అయినా మంచి క్వాలిటీతో తీశారు అని అన్నారు. నటి కవిత మాట్లాడుతూ, మంచికథ తీసుకున్నారు. తప్పకుండా ఇది మంచి సినిమా అవుతుందన్న నమ్మకం ఉంది. కొత్తతరానికి మా సహాయ, సహకారాలు తప్పకుండా ఉంటాయి అని అన్నారు. సమర్పకుడు సాయివెంకట్ మాట్లాడుతూ, ఈ చిత్రానికి షాలిని పేరు బావుంది.. విడుదలైన ఈ చిత్రం పాటలకు లక్షల వ్యూస్ లభించాయి అని పేర్కొనగా, దర్శకుడు షెరాజ్ మాట్లాడుతూ, టైటిల్ సాఫ్ట్‌గా అనిపించినా సినిమా మాత్రం హారర్ అంశాలతో భయపెడుతుంది. ప్రతిక్షణం ఉత్కంఠను కలిగించేవిధంగా ఉంటుంది. హారర్ ఇష్టపడే వారికి ఈ చిత్రం ఎంతగానో నచ్చుతుంది. ఇదివరకే నేను హీరోగా నటించడం వల్ల ఈ సినిమా చేస్తున్నప్పుడు తనకు మూడు సినిమాల్లో అవకాశాలు లభించాయని, వాటిలో బూచోడు చిత్రం ఒకటని, ఓ భక్తిరస చిత్రంలో వెంకటేశ్వరస్వామి పాత్రను పోషిస్తున్నట్లు చెప్పారు. చిత్ర నిర్మాత సత్యనారాయణ మాట్లాడుతూ, షెరాజ్‌తో నాకు రెండో సినిమా ఇది. సెప్టెంబర్ 1న ఈ సినిమాను విడుదల చేస్తున్నాం అని చెప్పారు.

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?
అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్కలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076

ఆధునిక ఆవిష్కారం
Vaccum Therapy
లింగవర్ధక యంత్రం
అమెరికన్ ఏజెన్సీ ఎఫ్‌డీఏ ద్వారా వ్యాక్యూమ్ థెరపీ లింగవర్ధక యంత్రంతోపాటు ఆయుర్వేదిక్ ఔషధం సేవించడం వలన కేవలం మీ లింగం ఆకారం 7 నుండి 8 అంగుళాల పొడుగు మరియు 2 నుండి 3 అంగుళాల లావు అవుతుంది. దీనితోపాటు ఆయుర్వేదిక్ ఔషధం సేవించడం వలన శీఘ్రస్కలనం, శుక్రాణువులు తక్కువగా ఉండుట, నపుంసకత్వం, సంతానహీనత తొలగించి, వైవాహిక జీవితంలో ఆనందం, సెక్స్ సమయాన్ని 30 నుండి 45 నిమిషాలు పెంచుతుంది. 100% ఆయుర్వేదిక్ చికిత్స
గమనిక: 30 రోజుల ఔషధంతోపాటు జపాని ఉత్తేరక నూనె, 100% ఆయుర్వేదిక్ మెడిసిన్
09835234384,09931658485